V3 NEWS

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
సోమవారం
02-09-2024
సంపుటి : 01 | సంచిక : 121 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD



# వణికిస్తున్న వరుణుడు
## తెలుగు రాష్ట్రాల్లో వర్ష బీభత్సం..

- నిరంతరంగా కురుస్తున్న వానలు
- పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ
- స్తంభించిన జన జీవనం..
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- వాహనదారుల ఇక్కట్లు
- పలుగ్రామాలకు తెగిపోయిన సంబంధాలు
- రెండు రాష్ట్రాల మధ్య పలు రైళ్లు రద్దు
- అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి టెలికాన్ఫరెన్స్‌లో సమీక్ష
- బోటులో వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించిన ఏపీ సీఎం చంద్రబాబు
- రెండు రాష్ట్రాల్లోని పరిస్థితిపై ఆరా తీసిన అమిత్ షా
- రేవంత్ రెడ్డి, చంద్రబాబులకు ప్రధాని ఫోన్
- పరిస్థితులను అడిగితెలుసుకొన్న మోదీ
- అవసరమైన సహాయం చేస్తామని హామీ

2



వాయుగుండం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షం నిరంతరాయంగా కురుస్తోంది. ఆ ప్రాంతం.. ఈ ప్రాంతం అని లేకుండా.. అన్ని చోట్ల వర్షం కమ్మేసింది. ఏపీ, తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ అయింది. కొన్ని చోట్ల భారీ వర్షా లు పడటంతో జనజీవనం స్తంభించి పోయింది. ఇప్పటికే వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. నదుల్లో వరద ప్రవాహ ఉధృతి పెరిగిపోయింది.రోడ్లపై వరద నీరు చేరడంతో వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షా లపై ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ ఆరా తీశారు. మున్సిపల్, విద్యుత్, వైద్యారోగ్య, రెవెన్యూ శాఖలు మరింత చురుకుగా వ్యవహరించాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్త వహించాలన్నారు. అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం అత్యవసరంగా టెలికాన్ఫరెన్స్ లో సమీక్ష నిర్వహించారు. భారీ వర్షా లు, వరదల కారణంగా రాష్ట్రంలో 9 మంది మృతి చెందినట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు. ప్రజలనుంచి ఫిర్యాదులు, సమస్యలపై సత్వరమే స్పందించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. సహాయక చర్యలు, శానిటేషన్, జలాశయాలు, చెరువుల్లోకి వస్తున్న వరద నీటి ఉద్ధృతి అంశాలను పరిశీలించేందుకు మున్సిపల్ శాఖ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్ హైదరాబాద్ నగరంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. మహానగరాన్ని వర్షం అతలాకుతలం చేస్తున్న నేపథ్యంలో ప్రజలకు ధైర్యం చేప్పేందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను నేరుగా కలుసుకున్నారు. విజయవాడలో కొండచరియలు విరిగి పడడంతో చంద్రబాబు నాయుడు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని గమనించారు. అనంతరం విజయవాడ కలెక్టరేట్‌లోనే బస చేసిన చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. రెండు రాష్ట్రాల్లోని పరిస్థితిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆరా తీశారు. అవసరమైన సహాయక చర్యలు అందిస్తామని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు హామీ ఇచ్చారు.

- విశ్వంభర, న్యూస్

## అధికారులెవరూ సెలవులు పెట్టొద్దు

- అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు చేపట్టాలి
- భారీ వర్షా ల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- ఇబ్బందులుంటే అధికారులకు ఫోన్ చేయాలని సూచన

2



## విజయవాడలో సాధారణస్థితి వచ్చే వరకు కలెక్టరేట్లోనే ఉంటా

- లక్ష మందికి సరిపోయే ఆహారం సరఫరా చేయాలి
- బాధితుల కష్టాలు తీర్చే వరకు విశ్రమించేది లేదు
- ప్రతి ఒక్క బాధితుడికి సాయం అందిద్దాం..
- విజయవాడ కలెక్టరేట్లో ఉన్నతాధికారులతో సమీక్షలో ఏపీ సీఎం చంద్రబాబు



2

## రాజకీయాల్లోనూ క్యాస్టింగ్ కౌచ్..

- ఇది సినీరంగానికే పరిమితం కాలేదు..
- రాజకీయాల్లోనూ ఈ విపరీత పోకడ ఉంది
- పదవుల ఆశ జూపి అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు
- అధిష్ఠానంతో సన్నిహిత సంబంధాలున్న వారికే అవకాశాలు
- కేరళ కాంగ్రెస్ నాయకురాలి సంచలన వ్యాఖ్యలు

2

మరిన్ని తాజా వార్తల కోసం
స్కాన్
చేయండి

# కోర్టుల్లో 'వాయిదాల సంస్కృతి' మారాలి

పెండింగు కేసులు భారీ స్థాయిలో పెరిగిపోవడం అతిపెద్ద సవాల్

న్యాయాన్ని రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది

మహిళా అధికారుల సంఖ్య పెరగడం హర్షణీయం

జిల్లా న్యాయవ్యవస్థ జాతీయ సదస్సులో రాష్ట్రపతి ముర్ము వ్యాఖ్యలు



**దిల్లీ:** సత్వర న్యాయం అందించాలంటే కోర్టుల్లో వాయిదాల సంస్కృతి మారాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. పెండింగు కేసులు భారీ స్థాయిలో పెరిగిపోవడం అతిపెద్ద సవాల్ అన్నారు. జిల్లా న్యాయవ్యవస్థ జాతీయ సదస్సులో ప్రసంగించిన ఆమె.. న్యాయాన్ని రక్షించాల్సిన బాధ్యత దేశంలోని న్యాయమూర్తులందరిపై ఉందన్నారు. "కొన్ని సందర్భాల్లో పలుకుబడి ఉన్న వ్యక్తులు నేరం చేసిన తర్వాత నిర్భయంగా, స్వేచ్ఛగా తిరుగుతుండటం బాధాకరం. ఆ నేరాల్లో బాధితులు మాత్రం తామే నేరం చేసినట్లు భయంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. మరోవైపు.. కోర్టులకు హాజరు కావడమనేది సామాన్యులపై ఒత్తిడి పెంచుతుంది. కోర్టుల్లో వాయిదాల పద్ధతిని మార్చేందుకు అన్ని విధాలా కృషి చేయాలి. న్యాయాన్ని రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది" అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు.

మిగతా2లో...

"ఆస్పత్రిలో వైద్యురాలి హత్యాచార ఘటన

# మానవత్వానికి సిగ్గుచేటు


ఆయన ఇలా మాట్లాడడం ఎంతో బాధాకరం

ఒక్కసారి వారు ఆత్మపరిశీలన చేసుకోవాలి

రాజకీయాలు చేయడానికి ఇది సందర్భం కాదు

ఇలా మాట్లాడినందుకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలి

కపిల్ సిబల్‌పై మండిపడ్డ ఉపరాష్ట్రపతి జగదీప్ ధనఖడ్



2

నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 87 | ₹ 109 |
| స్కిన్ | స్కిన్ లెస్ |
| ₹ 158 | ₹ 180 |

హైదరాబాద్ వస్తున్న

# విమానానికి బాంబు బెదిరింపు



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** మధ్యప్రదేశ్ లోని జబల్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడం అలజడి సృష్టించింది. ఆదివారం ఉదయం 7.55 గంటలకు ఇండిగో విమానం జబల్‌పూర్ ఎయిర్‌పోర్టు నుంచి బయలు దేరింది. దాదాపు 9 గంటల ప్రాంతంలో ఓ ప్రయాణికుడు టాయిలెట్ లోకి వెళ్లగా కమోడ్ సీటుపై "బ్లాస్ట్" అని రాసి ఉన్న పేపర్ కనిపించింది.వెంటనే సిబ్బందికి చెప్పడంతో పైలట్ అప్రమత్తమై విమానసిబ్బందికి, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌కు సమాచారం అందించారు. ఉదయం 9.20 గంటలకు విమానం నాగ్‌పూర్ ఎయిర్‌పోర్టులో దిగిన తరువాత ప్రయాణికులను దించివేసి తనిఖీలు చేపట్టారు. ఇప్పటివరకు ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు. ఇంకా తనిఖీలు కొనసాగుతున్నాయి. విమానంలో 69 మంది ప్రయాణికులు , నలుగురు సిబ్బంది ఉన్నారు. ప్రయాణికులను బస్సులో హైదరాబాద్‌కు తరలించారు.

# ఏం కష్టం వచ్చిందో..

జీడిమెట్లలో ఇద్దరు పిల్లలను చంపి,
ఆపై ఆత్మహత్య చేసుకున్న దంపతులు..

సంగారెడ్డిలో ముగ్గురి పిల్లలకు విషమిచ్చి, తల్లి ఆత్మహత్య!



2

తెలంగాణలో భారీ వర్షాలకు

# 9 మంది మృతి

- మంత్రి పొంగులేటి వెల్లడి
- వర్షా లకు రాష్ట్రం అతలాకుతలం
- నేడు పాఠశాలలకు సెలవు

10



## అధికారులెవరూ

# సెలవులు పెట్టొద్దు

### తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

**విశ్వంభర .తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం అత్యవసరంగా టెలికాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు వర్షాలతో జనం ఇబ్బందిపడుతున్న నేపథ్యంలో సెలవులు పెట్టొద్దంటూ అధికారులను ఆదేశించారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. వరదల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలలో అలర్ట్ గా ఉంటూ ఎప్పటికప్పుడు ప్రజలకు అవసరమైన సూచనలు చేయాలన్నారు. అవసరమైతే జనాలను ఇతర ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. ప్రాణ నష్టం నివారించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదురైతే ఫోన్ ద్వారా అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. అదేవిధంగా సహాయక చర్యల్లో పాల్గొనాలంటూ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితర ప్రజాప్రతినిధులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. వరదలతో ఇబ్బంది పడుతున్న వారిని ఆదుకోవాలంటూ కాంగ్రెస్ కార్యకర్తలకు రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. . అత్యవసర విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సీఎంఓ కార్యాలయానికి పంపాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. అత్యవసర పని ఉంటే తప్ప బయటకు రావద్దని రేవంత్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అవసరం ఉంటే అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్థానికంగా ఉండి సహాయక చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మరోవైపు కాంగ్రెస్ కార్యకర్తలు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని, సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇక రాజధాని హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. పట్టణాలు, నగరాల్లోని రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలు జలమయమై ఇళ్లు జలమయమయ్యాయి. గ్రామాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, జొన్నలు నీటమునిగాయి. ఈ సమీక్షలో మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.

### విజయవాడలో సాధారణస్థితి వచ్చే వరకు

# కలెక్టరేట్లోనే ఉంటా

**విశ్వంభర, విజయవాడ:** వరద ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం విజయవాడ కలెక్టరేట్లో ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. బుడమేరు వరద బాధితుల కష్టాలు తీర్చే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి తీవ్రత చెప్పడంలో అధికారులు విఫలమయ్యారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలు, ఆహారం, తాగునీరు, కొవ్వొత్తులు, టాక్సు వెంటనే అన్ని ప్రాంతాల నుంచి తెప్పించాలని సూచించారు. లక్ష మందికి సరిపోయే ఆహారం సరఫరా చేయాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి అదనపు బోట్లు, ట్రాక్టర్లు తక్షణం తెప్పించాలని ఆదేశించారు.సహాయక చర్యలు వేగవంతం కావాలన్న సీఎం.. తక్షణం అందుబాటులో ఉన్న ప్యాక్డ్ ఫుడ్ బాధితులకు అందించాలన్నారు. వృద్ధులు, చిన్నారులను వరద ప్రాంతాల నుంచి వెంటనే తరలించాలని సూచించారు. విజయవాడలో ఉన్న అన్ని దుకాణాల నుంచి వాటర్ బాటిల్స్ తెప్పించాలన్నారు. బుడమేరులో ఊహించని స్థాయి వరదతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. ప్రతి ఒక్క బాధితుడికి సాయం అందిద్దాం.. సాయంలో ప్రతి రెండు గంటలకు మార్పు కనిపించాలని ఆదేశించారు. అక్షయ పాత్ర నుంచి, సరఫరా చేయగలిగిన ఏజెన్సీల నుంచి ఆహారం తెప్పించాలని, ఖర్చు గురించి ఆలోచన చెయ్యవద్దని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులు, మంత్రులకు ఎవరి బాధ్యతలు వారికి అప్పగించి పంపించారు. నిముషాలు లెక్కన అప్పగించిన బాధ్యతలను పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలో వెంటనే అన్ని దుకాణాల నుంచి బిస్కట్లు, పాలు తెప్పించాలని సూచించారు. విజయవాడలో సాధారణస్థితి వచ్చే వరకు కలెక్టరేట్లోనే ఉంటానని సీఎం స్పష్టం చేశారు. దీంతో విజయవాడ కలెక్టరేట్ సీఎం.. తాత్కాలిక కార్యాలయంగా మారింది. సీఎం బస్సు కూడా కలెక్టరేట్ వద్దకు చేరుకుంది. అవసరమైతే ఇవాళ బస్సులోనే సీఎం ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

# రాజకీయాల్లోనూ క్యాస్టింగ్ కౌచ్..

### కేరళ కాంగ్రెస్ నాయకురాలి సంచలన వ్యాఖ్యలు

**కేరళ :** మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్ కుదిపేస్తోంది. ఈ కమిటీ వేసిన తర్వాత ఎంతోమంది నటీమణులు మీడియా ముందుకు వచ్చి తమ చేదు అనుభవాలు, ఆవేదన పంచుకుంటున్నారు. ఈ పరిణామాల వేళ కేరళకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. 'క్యాస్టింగ్ కౌచ్' అనేది సినీరంగానికే పరిమితం కాలేదని, రాజకీయాల్లోనూ ఈ విపరీత పోకడ ఉందని ఆమె ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీ కేరళ యూనిట్లో 'క్యాస్టింగ్ కౌచ్ ' తరహా పరిస్థితులు ఉన్నాయంటూ సీనియర్ నాయకురాలు సిమీ రోజ్‌బెల్ జాన్ తీవ్ర ఆరోపణలు చేశారు. పార్టీలో చాలా మంది మహిళలు.. పురుష నేతల నుంచి అభ్యంతరకర ప్రవర్తనను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆ భయానక అనుభవాలను కొంతమంది తనతో పంచుకున్నారని, అందుకు సంబంధించిన ఆధారాలు తనవద్ద ఉన్నాయని పేర్కొన్నారు. సమయం చూసుకుని వాటన్నింటినీ బయట పెడతానని ఆమె చెప్పారు.

పదవుల ఆశ జూపి కొంతమంది సీనియర్ నాయకులు మహిళా నేతల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని రోజెబెల్ ఆరోపించారు. అంతేగాక, అధిష్ఠానంతో సన్నిహిత సంబంధాలున్న వారికే అవకాశాలు లభిస్తున్నాయని, అలా కేరళ కాంగ్రెస్ యూనిట్లో కొంతమంది అర్హత లేని మహిళలు ఉన్నత హోదాల్లో ఉన్నారని అన్నారు. అయితే, ఆమె ఆరోపణలు పార్టీలో అంతర్గత విభేదాలకు దారితీశాయి. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ విభాగం పార్టీ హైకమాండ్కు ఆమెపై ఫిర్యాదు చేసింది.

2017లో మలయాళ నటి కిడ్నాప్ కేసు సంచలనం రేపింది. కారులో ఆమెపై లైంగిక వేధింపులకు రౌడీలను వినియోగించినట్టు నటుడు దిలీప్పై ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో అతడు అరెస్టయ్యాడు. ఈ నేపథ్యంలోనే మాలీవుడ్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసేందుకు కేరళ ప్రభుత్వం 2019లో జస్టిస్ హేమ నేతృత్వంలో ఓ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఇటీవల తమ నివేదికను సమర్పించింది. దీని అనంతరం మాలీవుడ్కు చెందిన పలువురు ప్రముఖ నటులపైనా లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే వారిపై కేసులు కూడా నమోదయ్యాయి.

## కోర్టుల్లో 'వాయిదాల సంస్కృతి' మారాలి

### - రాష్ట్రపతి ముర్ము

(మొదటి పేజీ తరువాయి)

దిల్లీలోని భారత్ మండపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్లు హాజరయ్యారు. మరోవైపు ముందురోజు ఇదే సదస్సులో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ.. మహిళలపై జరిగే నేరాల్లో బాధితులకు సత్వరం న్యాయం లభించాలని, అప్పుడే వారికి భద్రతపై భరోసా లభిస్తుందని ఉద్ఘాటించారు. ఈ క్రమంలోనే 2019లో ఫాస్ట్రక్ కోర్టుల పథకాన్ని తీసుకువచ్చామని ప్రధాని మోదీ గుర్తుచేశారు.

## వణికిస్తున్న వరుణుడు

# తెలుగు రాష్ట్రాల్లో వర్ష బీభత్సం..

వాయుగుండం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షం నిరంతరాయంగా కురుస్తోంది. ఆ ప్రాంతం ఆప్రాంతం అని లేకుండా.. అన్ని చోట్ల వర్షం కమ్మేసింది. ఏపీ, తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్ కూడా జారీ అయింది. కొన్ని చోట్ల భారీ వర్షాలు పడటంతో జనజీవనం స్తంభించి పోయింది. ఇప్పటికే వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. నదుల్లో వరద ప్రవాహ ఉధృతి పెరిగిపోయింది.రోడ్లపై వరద నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.భారీ వర్షాలపై ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ ఆరా తీశారు.మున్సిపల్, విద్యుత్, వైద్యారోగ్య, రెవెన్యూ శాఖలు మరింత చురుకుగా వ్యవహరించాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్త వహించాలన్నారు. అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం అత్యవసరంగా టెలికాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు.భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో 9 మంది మృతి చెందినట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు. ప్రజలనుంచి ఫిర్యాదులు, సమస్యలపై సత్వరమే స్పందించాలని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.సహాయక చర్యలు, శానిటేషన్, జలాశయాలు, చెరువుల్లోకి వస్తున్న వరద నీటి ఉద్ధృతి అంశాలను పరిశీలించేందుకు మున్సిపల్ శాఖ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్ హైదరాబాద్ నగరంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించారు.మహానగరాన్ని అతలాకుతలం చేస్తున్న నేపథ్యంలో ప్రజలకు ధైర్యం చేప్పేందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను నేరుగా కలుసుకున్నారు. విజయవాడలో కొండచరియలు విరిగి పడడంతో చంద్రబాబు నాయుడు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని గమనించారు. అనంతరం విజయవాడ కలెక్టరేట్ లోనే బస చేసిన చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. రెండు రాష్ట్రాల్లోని పరిస్థితిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆరా తీశారు. అవసరమైన సహాయక చర్యలు అందిస్తామని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు హామీ ఇచ్చారు.

### తెలంగాణలో వర్ష బీభత్సం..

భారీ వర్షాల కారణంగా తెలంగాణలోని పలు గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులు కొట్టుకపోవడంతో.. రాకపోకలు నిలిచిపోయాయి. ఇప్పటి వరకు అందిన ప్రాథమిక సమాచారం మేరకు 117 గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయినట్లేనని పంచాయతీ, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ గుర్తించింది. ఆయా గ్రామలకు వెళ్లే రాహదారులు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి.తెలంగాణలో హైదరాబాద్, ములుగు, భద్రాద్రి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, పెద్దపల్లి, కరీంనగర్, భూపాలపల్లి, మహబూబ్‌నగర్, నారాయణపేట, వికారాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. భారీ వర్షాలు, వరదల కారణంగా ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాష్ట్రంలో 9 మంది మృతి చెందినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం అత్యవసరంగా టెలికాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు వర్షాలతో జనం ఇబ్బందిపడుతున్న నేపథ్యంలో సెలవులు పెట్టొద్దంటూ అధికారులను ఆదేశించారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. వరదల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలలో అలర్ట్ గా ఉంటూ ఎప్పటికప్పుడు ప్రజలకు అవసరమైన సూచనలు చేయాలన్నారు. అవసరమైతే జనాలను ఇతర ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. ప్రాణ నష్టం నివారించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాష్ట్రానికి మరో రెండు రోజుల పాటు వర్ష సూచన ఉండటంతో అన్ని జిల్లాల యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై సత్వరమే స్పందించాలని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. రోడ్లపై భారీగా వరద నీరు ప్రవహించే ప్రాంతాలను గుర్తించి, అక్కడకు ప్రజలు వెళ్లకుండా బ్యారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రానికి మరో రెండు రోజుల పాటు భారీ వర్షసూచన ఉండటంతో హైదరాబాద్ మహానగర వాసులు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని మున్సిపల్ శాఖ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్ సూచించారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా నగరంలో సహాయక చర్యలు, శానిటేషన్, జలాశయాలు, చెరువుల్లోకి వస్తున్న వరద నీటి ఉద్ధృతి అంశాలపై ఆయన ఆదివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. భారీ వర్షాలు హైదరాబాద్ మహానగరాన్ని అతలాకుతలం చేస్తున్న నేపథ్యంలో ప్రజలకు ధైర్యం చేప్పేందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ నేరుగా క్షేత్రానికి వెళ్లారు. ఆదివారం ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించి, ప్రజలను కలుసుకున్నారు. హైదరాబాద్ నగరానికి మరో రెండు రోజుల పాటు వర్ష సూచన ఉండటం, రెడ్ అలర్ట్ జారీ చేసినందుకు అత్యవసరమైతే తప్ప, ప్రజలు బయటకు రావద్దని సూచించారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలంగాణలో భారీ వర్షాలు, ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పరిస్థితిపై అమిత్ షా దృష్టికి తీసుకెళ్లారు. బండి సంజయ్ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో ఫోన్ లో మాట్లాడుతూ అదనంగా ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపిన విషయాన్ని తెలిపారు. అదే సమయంలో ఎన్డీఆర్ఎఫ్ ఉన్నతాధికారులతో మాట్లాడిన బండి సంజయ్ రాష్ట్ర అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.వర్షాల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో దాదాపు 40 రైళ్లు వరకు రద్దయ్యాయి. అదే సమయంలో పెద్ద ఎత్తున రైళ్లను అధికారులు దారి మళ్లించారు. మరో రెండు రోజులపైనే వర్ష సూచన ఉండడంతో తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు ప్రభుత్వం సెప్టెంబర్ 2 సోమవారంను సెలవు దినంగా ప్రకటించారు. రెండు రాష్ట్రాల్లోని పరిస్థితిపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాఆరా తీశారు.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడులకు ఆయన ఫోన్ చేశారు. తక్షణమే అవసరమైన సాయం అందిస్తామని ఆయన ఇద్దరు సీఎంలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణలో ఎలాంటి ప్రాణ నష్టం జరుగకుండా చర్యలు తీసుకుంటున్నామని రేవంత్ రెడ్డి షాకు వివరించారు.ఆదివారం ఉదయం తెలంగాణలో వరద పరిస్థితులను, జరిగిన నష్టాన్ని అడిగి ప్రధాని అడిగి తెలుసుకున్నారు. .పలు జిల్లాల్లో భారీ వర్షం.. వరదతో వాటిల్లిన నష్టాన్ని సీఎం రేవంత్ ప్రధాని దృష్టి కి తీసుకెళ్లారు. ప్రాణ నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించినందుకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రధాని అభినందించారు. .ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సేవలు అందించే హెలికాప్టర్లను పంపిస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం తరపున అవసరమైన వరద సహాయక చర్యలు అందిస్తామన్నారు.






### ఆంధ్రప్రదేశ్ ను వణికిస్తున్న వానలు..

మరోవైపు భారీ వర్షాలతో ఆంధ్రప్రదేశ్ వణికిపోతోంది. విజయవాడలో కొండచరియలు విరిగి పడడంతో పాటు పలు చోట్ల ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. దాంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని గమనించారు.విజయవాడ నగరంలో ఇలాంటి విపత్తును ఎప్పుడూ చూడలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. బోటులో వెళ్లి సింగ్నగర్, తదితర వరద ప్రాంతాలను చంద్రబాబు పరిశీలించారు. భద్రతా సిబ్బంది వద్దంటున్నా వినకుండా సీఎం బోటులో వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించారు. సింగ్ నగర్ గండి పూడ్చుడంపై అధికారులతో మాట్లాడారు. బాధితులందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. "బాధితుల ఇబ్బందులను దగ్గరుండి చూశా. వరదనీరు తగ్గే వరకు పరిస్థితి పర్యవేక్షిస్తా. బాధితులకు వెంటనే ఆహారం, తాగునీరు అందిస్తాం. ఆరోగ్యం బాగాలేని వారిని ఆసుపత్రులకు తరలిస్తాం. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు మీ దగ్గర్లోనే ఉంటా" అని బాధితులకు భరోసా కల్పించారు.

అనంతరం విజయవాడ కలెక్టరేట్‌లోనే బస చేసిన చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. వరదను సమర్థంగా ఎదుర్కొంటామని చెప్పారు. వరద బాధితులందరికీ న్యాయం జరిగేలా ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌తో ముందుకెళ్తామని.. ఆ తర్వాతే తాను అక్కడ నుంచి వెళ్తానని ఆయన తెలిపారు .ఈ 50 ఏండ్లలో కనీవినీ ఎరుగని వరద వచ్చిందని, కృష్ణా నదికి ఈ స్థాయిలో వరద రావడం నష్ట తీవ్రతను పెంచిందని అన్నారు. అంతేకాదు బుడమేరు వాగు నిర్వహణ లోపం కారణంగా సమస్య తీవ్రత పెరిగిందని.. వరదల కారణంగా దాదాపు లక్ష కుటుంబాలు ముంపులో ఉన్నాయని, వాళ్లందరికి అవసరమైన సాయం అందిస్తామని చంద్రబాబు వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్లో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తోన్న నేపథ్యంలో స్థానిక పరిస్థితులగురించి ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో వరద పరిస్థితి గురించి ముఖ్యమంత్రిని అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వపరంగా అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ప్రధాని మోదీ సీఎం చంద్రబాబుకు హామీ ఇచ్చారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రస్తుతం తీసుకుంటున్న సహాయక చర్యలపై సీఎం చంద్రబాబు ప్రధాని మోదీకి వివరించారు. కేంద్ర ప్రభుత్వంలోని ఆయా శాఖలకు ఆదేశాలు ఇచ్చామని, రాష్ట్రానికి అవసరమైన సహాయం చేయాలని ఆదేశించానని ఈ సందర్భంగా ప్రధాని మోదీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో అన్నారు. తక్షణమే ఆయా శాఖల నుంచి రాష్ట్రానికి అవసరమైన సామగ్రిని పంపేందుకు ఆదేశాలు ఇచ్చానని ప్రధాని వెల్లడించారు. భారీ వర్షాల కారణంగా ఏపీలో పలు రైళ్లను రద్దు చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజల్ని అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ఏపీలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని నిషేధం విధించారు.



## "ఆస్పత్రిలో వైద్యురాలి హత్యాచార ఘటన

# మానవత్వానికి సిగ్గుచేటు

### ఉపరాష్ట్రపతి జగదీప్ ధనఖడ్

**దిల్లీ:** పశ్చిమ బెంగాల్ లోని కోల్కతా ఆర్‌ కర్ మెడికల్ కాలేజీలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన రాజకీయాలను కుదిపేస్తోంది. ఈ ఘటనపై సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధనఖడ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆయన చేసిన వ్యాఖ్యలకు గానూ క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు.

ఈ ఘటన సర్వసాధారణమంటూ కపిల్ సిబల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలను ధనఖడ్ తీవ్రంగా తప్పుబట్టారు. ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడడం తగదన్నారు. "ఆస్పత్రిలో వైద్యురాలి హత్యాచార ఘటన మానవత్వానికి సిగ్గుచేటు. బాధితురాలికి జరిగిన అన్యాయం పట్ల కొందరు వ్యక్తులు చేస్తున్న వ్యాఖ్యలు ఆ బాధను మరింత పెంచుతున్నాయి. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడి స్థానంలో ఉన్న ఆయన ఇలా మాట్లాడడం ఎంతో బాధాకరం" అని కపిల్ సిబల్ను ఉద్దేశిస్తూ ధనఖడ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

### క్షమాపణలు చెప్పాల్సిందే..

"ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సబబు కాదు. అలా మాట్లాడినందుకు ఒక్కసారి వారు ఆత్మపరిశీలన చేసుకోవాలి. రాజకీయాలు చేయడానికి ఇది సందర్భం కాదు. బాధితురాలి గురించి ఇలా మాట్లాడినందుకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలి" అని ఉపరాష్ట్రపతి డిమాండ్ చేశారు. కాగా.. ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన దేశ వ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. పెద్దఎత్తున విద్యార్థులు ఆందోళన కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేస్తోంది.

ఈ ఘటనకు సంబంధించి ఎన్నో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. బాధితురాలి తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు చేసినట్లుగా మూడు ఆడియో కాల్స్ ఇటీవల బహిర్గతమయ్యాయి. ఉద్దేశపూర్వకంగానే మృతురాలి తల్లిదండ్రులకు తప్పుడు సమాచారం ఇచ్చారనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.

# భారీ వర్షా ల నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం

### తెలంగాణకు అదనంగా 9 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రాణ నష్టం లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఆదేశించారు. ఆదివారం ఉదయం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలంగాణలో భారీ వర్షాలు, ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పరిస్థితిపై అమిత్ షా దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఖమ్మం జిల్లాలో 110 గ్రామాలు ముంపుకు గురవడంతోపాటు పట్టణంలోని ప్రకాశ్ నగర్ గుట్టపై 9 మంది, పాలేరు నియోజకవర్గంలోని అజ్మీరాతండ గుట్టపైన 68 మంది, బిల్డింగులపైన 42 మంది చిక్కుకున్న విషయాన్ని అమిత్ షాకు వివరించారు. వెంటనే స్పందించిన అమిత్ షా తెలంగాణకు అవసరమైన ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా చెన్నై, వైజాగ్, అసోం నుండి 3 చొప్పున మొత్తం 9 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను తెలంగాణకు పంపాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రాణ నష్టం లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఎన్డీఆర్ఎఫ్ ను ఆదేశించారు.

అనంతరం బండి సంజయ్ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో ఫోన్ లో మాట్లాడుతూ అదనంగా ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపిన విషయాన్ని తెలిపారు. అదే సమయంలో ఎన్డీఆర్ఎఫ్ ఉన్నతాధికారులతో మాట్లాడిన బండి సంజయ్ రాష్ట్ర అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. అట్లాగే తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వర్షాల పరిస్థితి, ప్రజలు పడుతున్న ఇబ్బందులతోపాటు కొనసాగుతున్న సహాయక చర్యలపైనా బండి సంజయ్ ఆరా తీశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరిన బండి సంజయ్ బీజేపీ కార్యకర్తలు, నాయకులంతా జాగ్రత్తగా ఉంటూనే అధికారులను సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.

# ఏం కష్టం వచ్చిందో..

**విశ్వంభర, జీడిమెట్ల/సంగారెడ్డి:** ఆర్థిక ఇబ్బందులో.. కుటుంబ కలహాలో.. కారణం ఏదైతేనేమి క్షణికావేశంలో నిండు ప్రాణాలు తీసుకుంటున్నారు నేటి కాలం యువత. చిన్న వయసులోనే చేతులారా ప్రాణాలు తీసుకుంటున్నారు. తాజాగా ఓ జంట ఇదే విధమైన క్షణికావేశంలో తాము ఆత్మహత్య చేసుకోవడంతో పాటు.. అభం శుభం తెలియని పసివాళ్లను కూడా కడతేర్చారు. ఈ విషాద ఘటన హైదరాబాద్‌లోని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంగారెడ్డి జిల్లాలో మరో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. నవమాసాలు మోసి కనిపెంచిన కన్నతల్లి పసివాళ్లను హతమార్చింది. గోరు ముద్దులు తినిపించిన చేతితోనే పసి పిల్లలకు విషమిచ్చి ఆయువు తీసింది. అనంతరం ఆ తాను కూడా ఉరి పోసుకుని తనువు చాలించింది.


ఇద్దరు పిల్లలను చంపి, ఆపై ఆత్మహత్య చేసుకున్న దంపతులు..

హైదరాబాద్‌లోని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గాజుల రామారంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వెంకటేశ్ (40), వర్షిణి (33) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. రిషికాంత్(11), విహంత్ (3). వీరి స్వస్థలం మంచిర్యాల గత కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వెంకటేశ్ మానసికంగా ఎంతో చిత్రవధ అనుభవించాడు. చివరికి భార్య వర్షిణితో కలిసి కుటుంబం అంతా చనిపోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో తమ అపార్ట్‌మెంట్‌లోనే ఇద్దరు పిల్లలను చంపి, దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. వీరి అపార్ట్‌మెంట్ నుంచి దుర్వాసన రావడంతో ఇరుగు పొరుగు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆర్థిక ఇబ్బందులతోనే దంపతులు తమ పిల్లలను చంపి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు. దీనిపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించారు.

సంగారెడ్డిలో మరో ఘటన: ముగ్గురి పిల్లలకు విషమిచ్చి, తల్లి ఆత్మహత్య!

సంగారెడ్డి జిల్లాలో మరో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. నవమాసాలు మోసి కనిపెంచిన కన్నతల్లి పసివాళ్లను హతమార్చింది. గోరు ముద్దులు తినిపించిన చేతితోనే పసి పిల్లలకు విషమిచ్చి ఆయువు తీసింది. అనంతరం ఆ తాను కూడా ఉరి పోసుకుని తనువు చాలించింది. ఈ గుండెలు పిండే వ్యధ సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..

పటాన్‌చెరులోని రుద్రారం గ్రామంలో ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఓ మహిళ మరణాన్ని ఆశ్రయించింది. అప్పులు ఆదుకోకపోవడంతో కనిపెంచిన చేతులతోనే కన్న బిడ్డల ఆయువు తీసింది. తన ముగ్గురి పిల్లలకు విషం ఇచ్చి చంపింది. ఆపై తాను ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. తల్లీ బిడ్డలు నలుగురూ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



ఉపల్ నియోజకవర్గంలోని చిలుకనగర్ డివిజన్‌లో చింతల మహేష్ రెడ్డి - మౌనిక దంపతుల కుమార్తె సహస్ర రెడ్డి మొదటి జన్మదిన వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన కాచం సత్యనారాయణ, కాచం సాయి, మేడికొండ పరమేశ్, మాదాసు నరేష్

- విశ్వంభర, ఉప్పల్






సూర్యాపేట పట్టణంలోని సుందరయ్య నగర్‌లో నీట మునిగిన ప్రాంతాలను పరిశీలిస్తున్న మాజీమంత్రి, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి తదితరులు.

- విశ్వంభర, చివ్వేంల

## జోరు వానలో ఘనంగా బోనాల జాతర



**విశ్వంభర, చేగుంట :** చేగుంట మండలం కేంద్రంలోని మహంకాళి అమ్మవారి ప్రథమ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జోరు వానను సైతం లెక్కచేయకుండ అధిక సంఖ్యలో భక్తులు బోనాలు తీసుకుని వచ్చి అమ్మవారికి సమర్పించి, మహంకాళి అమ్మవారిని దివ్య దర్శనం చేసుకున్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులు వస్తుంటారని ఆలయ కమిటి సభ్యులు తెలిపారు.

# సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి : తపస్



**విశ్వంభర, చేగుంట :** మెదక్ జిల్లా కేంద్రంలోని తపస్ కార్యాలయంలో తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్‌లు విలేకరుల తో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా.. సీపీఎస్ రద్దు గురించి ఆలోచించకపోవడం శోచనీయమని అన్నారు. సీపీఎస్ రద్దు విషయం అనేది రాష్ట్ర పరిధిలోని అంశం కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సీపీఎస్ విధానం వల్ల అటు ప్రభుత్వం కానీ, ఇటు ఉద్యోగి కానీ లాభపడటం లేదన్నారు. ఒక ఉద్యోగి తన జీవిత కాలం ప్రభుత్వానికి సేవాలందిస్తే ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్ లేకపోవడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఏకీకృత పెన్షన్ విధానం ద్వారా ఉద్యోగి తన చివరి వేతనంలో 50% పెన్షన్‌గా పొందే సదుపాయాన్ని కల్పిస్తూ కేంద్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని, చివరగా పాత పెన్షన్ సాధనే ధ్యేయంగా తపస్ పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నర్సింలు, జ్ఞానేశ్వర్, తపస్ బాధ్యులు శ్రీకాంత్ రెడ్డి, నరేందర్,వినోద్,మధు మోహన్, శ్రీధర్ రెడ్డి, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

-ఎండీ ఎజాస్



**విశ్వంభర, పరిగి :** మున్సిపల్ పరిధిలోని 3వార్డు సాయిరాం నగర్ కాలనీలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద నీరు కాలనీలోకి రోడ్లపై ప్రవహిస్తుంది. దీనివల్ల కాలనీ ప్రజలు రోడ్ల పైన నడవలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న పరిగి పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులుచ మూడవ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎండీ ఎజాస్ కాలనీని సందర్శించి సమస్యను పరిశీలించి మున్సిపల్ అధికారి ఆగయ్యని పిలిచి రోడ్ల సమస్యలు, డ్రైనేజీ సమస్యలు, వర్షపు నీటి సమస్యను వివరించి కాలనీ ప్రజల ఇబ్బందిని దృష్టిలో ఉంచుకొని సమస్యను తొందరగా పరిష్కారం చేయాలని కోరారు. ప్రస్తుతం సమస్యలను ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎజాస్ తెలిపారు. సమస్యను పరిశీలించిన మున్సిపల్ అధికారి ఆగయ్య వెంటనే జేసీబీ సహాయంతో వర్షపు నీటిని పక్కనే ఉన్న నాళాలోకి మళ్లీస్తామని సమస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ కాలనీ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు అనిల్, యువజన కాంగ్రెస్ నాయకులు నాగరాజ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌మోహన్‌రావుకు ప్రతిష్ఠాత్మక పురస్కారం



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావుకు స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఢిల్లీకి చెందిన ఈ సంస్థ ప్రతి ఏడాది క్రీడారంగంలోని ప్రముఖులకు అవార్డులు ప్రదానం చేసి, సన్మానిస్తుంది. తాజాగా న్యూఢిల్లీలో జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో ఈ ఏడాదికి గాను ఉత్తమ స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్‌గా జగన్‌మోహన్‌రావుకు స్పోర్ట్స్ ఇండియా ఫౌండేషన్ పురస్కారం ప్రదానం చేసింది. హ్యాండ్‌బాల్, క్రికెట్‌తో పాటు వివిధ క్రీడాంశాలకు చెందిన క్రీడాకారులకు జగన్‌మోహన్ రావు వ్యక్తిగతంగా అందిస్తున్న ప్రోత్సాహం, క్రీడా రంగ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సహకారాన్ని గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేశారు.









# రాజకీయాలకు కొత్తఅర్థం చెప్పిన నేత

# వైఎస్ రాజశేఖర్ రెడ్డి

**నేడు ఆయన వర్ధంతి**



**యెడుగూరి సందింటి రాజశేఖరరెడ్డి ఆంధ్ర ప్రదేశ్ 16వ ముఖ్యమంత్రిగా, కాంగ్రెస్ పార్టీ నాయకునిగా, ప్రత్యేక గుర్తింపు పొందారు. తల పండిన నేతలను తల దన్నిన వ్యూహ రచనా దురంధరుడు ఆయన. మునిగి పోతున్న కాంగ్రెస్ నావను ఒంటి చేత్తో దరికి చేర్చిన రథ సారథి ఆయన. రాజకీయాలకు సరి కొత్త అర్థం చెప్పిన చాణక్యుడు వై.యస్... రాజశేఖర్ రెడ్డి.**

వై.యస్...రాజశేఖర్ రెడ్డి 1949 జూలై 8న జమ్మల మడుగు లోని సి.ఎస్.ఐ. కాంప్‌బెల్ మిషన్ ఆసుపత్రిలో జన్మించా డు. ఆయన తల్లిదండ్రులు జయమ్మ, రాజారెడ్డి. ఆయన తండ్రి బళ్ళారిలో కాంట్రాక్టరుగా పనిచేస్తుండటం వల్ల ఆయన పాఠశాల చదువంతా బళ్ళారి లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో సాగింది. ఆ తర్వాత విజయవాడ లయోలా కళాశాలలో చేరారు. 1972లో గుల్బర్గా విశ్వ విద్యాలయం నుంచి వైద్య విద్యలో పట్టా పుచ్చు కున్నారు. గుల్బర్గాలోని మహాదేవప్ప రాంపూరే వైద్య కళాశాలలో వైద్యవృత్తిని అభ్యసిస్తుండగానే కళాశాల విద్యార్థి సంఘానికి అధ్యక్షు డిగా వ్యవహరించారు. శ్రీ వెంకటేశ్వర వైద్యకళాశాల (యెస్.వి.ఆర్.ఆర్), తిరుపతి నుంచి హౌస్ సర్జన్ పట్టా పొందారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల వైపు ఆకర్షితుడైన రాజశేఖరరెడ్డి యెస్.వి.ఆర్.ఆర్ కళాశాలలో పని చేస్తుండగానే అక్కడ హౌస్‌సర్జన్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తరువాత కొద్ది రోజుల పాటు జమ్మల మడుగులోని సి.ఎస్.ఐ. కాంప్‌బెల్ ఆసుపత్రిలో వైద్య అధికారిగా పనిచేశారు. ఆ తరువాత 1973లో పులివెందులలో తండ్రి వై.ఎస్.రాజారెడ్డి పేరుతో కట్టించిన 70 పడకల ఆసుపత్రిలో వైద్యుడిగా పని చేశారు. ఆ ఆసుపత్రి ఇప్పటికీ పనిచేస్తూనే ఉంది. వాళ్ళ కుటుంబం పులివెందులలో ఒక పాలిటెక్నిక్ కళాశాల, డిగ్రీ కళాశాలను కూడా నెల కొల్పారు. తరువాత వాటిని లయోలా సంస్థలకు అప్పగించారు. పులివెందుల దగ్గరిలో ఉన్న సింహాద్రి పురంలో ఉన్న కళాశాలను మాత్రం ఇప్పటికీ వీరి కుటుంబమే నిర్వహిస్తోంది. కళాశాల దశ నుంచే రాజకీ యాలపై ఆసక్తి చూపారు. 1975లో యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా;ఇక 1978లో పులివెందుల నుంచి తొలిసారి శాసన సభ్యుడిగా ఎన్నికయ్యారు, కడప లోక్‌సభ నియోజకవర్గం నుంచి 4 సార్లు ఎన్నికయ్యారు. పులివెందుల అసెంబ్లీ నియోజక వర్గం నుంచి 6 సార్లు విజయం సాధించారు. రాజశేఖరరెడ్డి 198083 కాలంలో రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రి పదవిని నిర్వహించారు. రాష్ట్ర శాసన సభ ప్రతిపక్ష నేతగా, రెండు సార్లు రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పని చేశారు. 1980 నుంచి 1983 దాకా గ్రామీణాభివృద్ధి, వైద్యశాఖ, విద్యాశాఖ మొదలైన కీలకమైన మంత్రి పదవులను నిర్వహించారు. తెలుగు దేశం నేత నారా చంద్రబాబు నాయుడు మొదటగా కాంగ్రెస్ లో ఉన్నపుడు ఇరువురూ మంచి మిత్రులు. 1985 నుంచి 1998 వరకు పార్టీలో వై.ఎస్. నిత్య అసమ్మతి వాదిగా పేరు పడ్డారు. కాంగ్రెస్ ముఖ్య మంత్రులు అందరితో ఆయన పోరాటం చేయాల్సి వచ్చింది. 198994 మధ్య కాలంలో ముఖ్యమంత్రి కావాలని ప్రయత్నించినా సాధ్య పడలేదు. మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి వంటి నేతలతో ఆయన రాజకీయ యుద్ధమే చేశారు. వారికి వ్యతిరేకంగా క్యాంపులు నడిపారు. మర్రి చెన్నారెడ్డిని, నేదురుమిల్లి జనార్ధన్‌రెడ్డిని పదవినుండి తొలగించడానికి ప్రధాన కారణమైన హైదరా బాదు నగరంలో జరిగిన అల్లర్లలో రాజశేఖర్ రెడ్డి వర్గపు పాత్ర ఉందన్న ఆరోపణలు వచ్చాయి. అదే తాను ముఖ్య మంత్రి అయ్యేనాటికి అలాంటి శిబిరాలు లేని పరిస్థితిని సృష్టించు కోగలిగారు. రాజకీయాల్లో ముక్కు సూటి తనానికి, నిర్మొహమాట ధోరణికి రాజశేఖరరెడ్డి నిలువెత్తు నిదర్శనం. ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా వై.ఎస్.రాజశేఖరరెడ్డి రెండు సార్లు పనిచేశారు. తొలిసారి 1983 నుంచి 1985 వరకు, రెండో పర్యాయం 1998 నుంచి 2000 వరకు ఆ పదవిలో ఉన్నారు. 1999 నుంచి 2004 వరకు 11 వ శాసన సభలో ప్రతి పక్ష నేత గానూ వ్యవహ రించారు. 2003 వేసవి కాలంలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో పాద యాత్ర చేపట్టి 1,467 కిలోమీటర్లు పర్యటించారు. పాదయాత్ర వలన వ్యక్తిగతంగా వైఎస్.కు మంచి జనాదరణ లభించడమే కాకుండా ఆ తదుపరి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి దోహద పడింది. 2004 మేలో జరిగిన 12వ శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు సాధించడంతో అది వరకే పార్టీలో పేరు సంపాదించిన వై.ఎస్. ఆర్. ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించారు. పాద యాత్ర వలన జనాదరణ పొందడమే కాకుండా ఎన్నికల ప్రచారంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, పెండింగులో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తిచేయటం, జలయజ్ఞం లకు ప్రాధాన్యం ఇవ్వడంతో ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన పిదప తొలి సంతకం ఉచిత విద్యుత్తు ఫైలు పైనే చేశారు. 2009 ఏప్రిల్లో జరిగిన 13వ శాసనసభ ఎన్నికలలో కూడా కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలలో విజయం సాధించడానికి కృషిచేసి వరుసగా రెండో పర్యాయం ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. 2009 ఏప్రిల్‌లో జరిగిన శాసనసభ, లోక్‌సభ ఎన్నికలలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ముందుండి నడిపించడమే కాకుండా శాసన సభలో 156 స్థానాలతో పూర్తి మెజారిటీని సంపాదించి పెట్టారు. అదే సమయంలో లోక్‌సభ ఎన్నికలలో 33 స్థానాలలో విజయం సాధించడానికి కృషి చేశారు. వై.యస్.రాజశేఖర రెడ్డి చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా (సి.ఎస్.ఐ) అనే చర్చికి చెందిన ప్రొటెస్టెంటు క్రైస్తవుడు. ఆయన తొలిసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత 2004లోనూ, మరలా 2009లోనూ కుటుంబ సమేతంగా బెత్లహేము యాత్రకు వెళ్ళి వచ్చారు. క్రైస్తవులైనా పారంపరికంగా వచ్చిన హిందూ సంప్రదా యాలని వీడలేదు. రాజశేఖరరెడ్డి తిరుమలను అనేకమార్లు సందర్శించి వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకొని పూజలు చేశారు. సెప్టెంబర్ 2, 2009 న చిత్తూరు జిల్లా పర్యటనకు అననుకూల వాతావరణంలో బయలు దేరగా ఉదయం గం.9.35 నిమిషాలకు హెలి కాప్టరుతో సంబంధాలు తెగి పోయాయి. ముఖ్యమంత్రి ఆచూకీ కోసం గాలించగా 25 గంటల తరువాత ప్రమాదానికి గురైన హెలికాప్టర్ ఆనవాళ్ళు లభించాయి. వై.ఎస్.తోసహా మొత్తం ఐదుగురు హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు.



- రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

---

## ప్రజా ఉద్యమ కెరటం, సాహితీ దిగ్గజం

# కామ్రేడ్ కోటూరు ముత్యం

**ఉత్తర తెలంగాణ నిజామాబాద్ జిల్లా లోని ఓ పల్లెటూరు లో జన్మించిన కోటూరు ముత్యం ఉత్తరాంధ్ర ఉద్యమాల పై అదీనూ మహోత్తర శ్రీకాకుళ విప్లవ పోరాటం పై అద్భుతమైన రచనలు చేశారు. భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన ఈ గిరిజన విప్లవ పోరాటపు మూలాలను ఏళ్లకు ఏళ్ళు శ్రమించి, శోధించి నేటి తరానికి, భవిష్యత్ తరాలకు అందించారు.**



ఈ శక్తి, ఈ ఆలోచన ముత్యానికి ఎలా వచ్చింది?

దేశమంతటా, ఆ మాట కొస్తే ప్రపంచమంతటా కల్లోలాలు చెలరేగుతున్నాయి. దేశాలు జాతులు విముక్తిని, దేశాలు స్వాతంత్రాన్ని, ప్రజలు విప్లవాన్ని కోరుకుంటూ న్న కాలం అది.సరిగ్గా ఈ కాలంలోనే హైదరాబాద్ లోని ఉస్మానియా యూనివర్సిటీ లో ముత్యం కాలు పెట్టాడు. ప్రపంచ రాజకీయాలను ప్రతిధ్వనించే కేంద్రం గా ఉస్మానియా బాసిల్ళుతున్న సంక్షోభ కాలం లోనే కోటూరు ముత్యం PDSU ముత్యం గా రూపొందాడు. ప్రపంచ మానవాళి విముక్తి కోసం రూపొందింపబడ్డ మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని ఆకర్శించాడు. లోతుగా ఆకలింపూ చేసుకున్నాడు.ఆ పునాదిగా రష్యా, చైనా తదితర దేశాలు శ్రామిక రాజ్యాలుగా రూపొంది,ఆనాడు సాగించిన కృషినీ అర్ధం చేసుకున్నాడు."కష్టపడే వాడు సుఖపడాలి సుఖ పడే వాడు కష్ట పడాలి" అని ప్రగాడంగా నమ్మాడు. ఆ బాటనే ఎంచుకొని,కలం చేత పట్టాడు. బిగి పిడికిలి తో కూడిన ఎర్రజెండా ను సమూన్నతం గా ఎత్తిపట్టాడు.

తెలంగాణ ప్రాంతానికంతటికి మకుటాయమానంగా ఉన్న ఆర్ట్స్ కాలేజీ విద్యార్థి సంఘానికి అధ్యక్షుడు గా హోరాహోరి పోరులో మతోన్మాదులను మట్టి కరిపించే విజయానికి కారకుడయ్యాడు. ప్రగతిశీల, విప్లవ రాజకీయాలకు ఓయూ క్యాంపస్ లో,జంటనగరాల్లో ప్రగతిశీల విద్యార్థి ఉద్యమానికి ఊపు తీసుకొచ్చాడు.

1984 లో PDSU మొట్టమొదటి చీలికను ఎదురుకున్నది. "తిరుగుబాటు", "విజ్రంభణ" లుగా చీలిపోయింది.వి.శంకర్ ఒక వర్గానికి,, కటకం పాపయ్య మరో వర్గానికినాయకులుగా ఉన్నారు.

అప్పుడు పాపయ్య వర్గానికి జంట నగరాల కమిటీకి ముత్యం అధ్యక్షులు గా, నేను(కె. గోవర్ధన్) ప్రధాన కార్యదర్శి గా, ఎస్ ప్రభాకర్ రెడ్డి, చందూ ఉపాధ్యక్షులుగా, గొర్రెపాటి రామకృష్ణ కోశాధికారిగా ఉండి, విద్యార్థి ఉద్యమ నిర్మాణానికి, విస్తరణకు పాటుపడ్డాము. ఆ కాలం లో ఇంటా, బయట సాగిన అన్ని వివాదాల్లో, చర్చల్లో, సంభాషణల్లో అనునిత్యం మునిగి తేలేవాళ్ళం. అదొక మర్చిపోలేని గొప్ప జ్ఞాపకం.. అనుభూతి....అనుభవం....

కామ్రేడ్ ముత్యం తదనంతర కాలంలో బెనారస్ విశ్వవిద్యాలయం లో పీహెచ్డీ పూర్తి చేసుకుని తిరిగి వచ్చిన తర్వాత వివిధ కాలేజీల్లో లెక్చరర్ గా, ప్రొఫెసర్ గా బోధనా వృత్తి ని సాగించాడు.ఎందరెందరో, ఎక్కడెక్కడో, ఏయే మార్గాల్లో సెటిల్ అయినా ముత్యం మాత్రం సెటిల్మెంట్ గురించి పెద్దగా ఆలోచించలేదు.

తన మొత్తం జీవితాన్ని సాహిత్య సృజనకు అందులో ఉద్యమ సాహిత్య సృష్టికి, ప్రచారానికే వెచ్చించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన పరిశోధనలు, వెలికి తీసిన రికార్డ్స్,ప్రముఖులతో సాగించిన సంభాషణలు, సేకరించిన కరపత్రాలు,గ్రంధాలు, పుస్తకాలు,పాటలు ఎన్నెన్నో....

ప్రజా రచయితగా, ఉద్యమ సాహితీ వేత్తగా, నిరంతర పరిశోధకుడుగా అన్నిటికి మించి తాను నమ్ముకున్న రాజకీయ, సిద్ధాంతానికి ,విలువలకు ,అన్నిటికి మించి విశ్వాసాలకు కట్టుబడి చిట్ట చివరి వరకు నిలిచారు. రాజీ లేకుండా ఎన్నెన్నో కష్టాలు, కడగండ్ల మధ్య జీవించాడు.

నలభై ఏళ్లుగా నాకు తెలిసిన ముత్యమన్న జీవితం నేటి తరానికే కాక భవిష్యత్తు తరాలకు ఎంతో స్ఫూర్తిదాయక మైనది. ఆయన భౌతికంగా మన ముందు నేడు లేక పోయినా, ఆయన చేసిన రచనలు, పరిశోధనలు, చిత్రించిన డాక్యుమెంటరీ(అరుణోదయ కానూరి తాత పై) చిత్రాలు సదా చిరస్మరణీయంగా ఎప్పటికీ వెలుగొందుతూనే ఉంటాయి.

కామ్రేడ్ ముత్యమన్నకు కన్నీటి విప్లవ జోహార్లు!



- కె. గోవర్ధన్
సిపిఐ(ఎం-ఎల్)న్యూడెమోక్రసీ

---

## గోపూజా పర్వదినం...

# పోలాల అమావాస్య

**భిన్న సంస్కృతులు, భాషలు, ధర్మాలు, ప్రజల కేంద్రస్థానమై, అఖండ మరియు అవిభాజ్యమైన సంస్కృతికి మూలాధారమైన భారతావని ప్రాచీన కాలంనుండీ వ్యవసాయ ప్రధాన దేశం కావడం గ్రామీణులలో అధిక సంఖ్యాకులు రైతుల కావడం, ఎడ్లు మరియు నాగళ్ళతో విడదీయరాని బంధం, అనుబంధాన్ని ఏర్పరచుకున్న రైతు వాటికి కృతజ్ఞతను ప్రకటించే వారసత్వ ఆచార క్రమంలో, ఏటా శ్రావణ మాస ముగింపు దినమైన అమావాస్యను 'పోలాల అమావాస్య'గా పండగ జరుపుకోవడం అనాదిగా వస్తున్న సత్సాంప్రదాయం. దీనిని గో, వృషభ ఉద్దిష్టమైన పర్వదినంగా భావిస్తారు. శ్రావణ కృష్ణ అమావాస్యను తెలుగు ప్రజలు "పోలామావాస్య లేక పోలాలామావాస్య"గా వ్యవహరిస్తారు. "పోల' అనగా కడుపునిండా మేతమేసి నీరు త్రాగి పనిపాట లేకుండిన ఎద్దు అని అర్థం. "అమా" అంటే అమావాస్య. పోలాలామావాస్య అంటే ఎద్దులను బాగా మేపే అమావాస్య అని అర్థం.**



పౌరాణిక గాథ ప్రకారం అంధకాసురుడు అనే రాక్షసుడు బ్రహ్మను గూర్చి తపస్సుచేసి, అనేక వరాలు పొంది, వరగర్వం చేత ఒకసారి పార్వతిని కామించడం జరిగింది. శివుడు భూలోకానికి వెళ్ళిన వేళ కనిపెట్టి, అంధకాసురుడు పార్వతి వద్దకు వెళ్ళి తన దుష్టచింతను తెలిపాడు. అదిగాంచి వాకిట కావలిగల నంది అంధకునితో యుద్ధానికి తలపడ్డాడు. ఇంతలో శివుడు వచ్చి వియయం తెలుసు కుని అంధకాసురిని సంహరించాడు. ఈసదర్భంలో నందికేశ్వరుడు చేసిన సాయానికి మెచ్చి శివుడు, నందిని ఏదైనా వరం కోరుకో మన్నాడు. శిలాదుడు పొలము కెక్కిరిస్తూండగా ఆది వృషభ రూపమున నేను, ఆయనకు దొరికిన రోజు శ్రావణ బహుళ అమావాస్య కనుక, ఆనాడు వృషభ పూజ చేస్తే ఫల ప్రదమయ్యేట్లు అనుగ్రహించమమని వేడుకోగా శివుడు అనుగ్రహించాడని తెలుస్తున్నది. మాళవదేశంలో 'పోల' పండువగా, మహారాష్ట్ర లో 'పిథోరి అమావాస్యగా, ఆంధ్రదేశంలో 'పోలాంబ' ప్రతాచరణలు ఆచరణలో ఉన్నాయి. అలాగే పోలాల అమావాస్యతో ముడివడియున్న "పోలాంబ లేక పోలకమ్మ, పోలేరమ్మ" పేరుతో దేవీ పూజలు ఆచరించే నేపధ్యంలో, పెళ్లయి చాలా కాలమయినా సంతానం కలుగని స్త్రీలు, సంతానవతులైన స్త్రీలు ఈ వ్రతాన్ని ఆచరించడం సాంప్రదాయమై ఉంది. పిల్లలకు అకాల మృత్యు భయముండ కుండా పూజలు నిర్వహిస్తారు. సంతానం ఆయురారోగ్యాలతో ఉండటానికి కారణమైన గ్రామ దేవతల కరుణా కటాక్షాలు ఉండాలని, అందుకే మన పెద్దలు గ్రామ దేవతలను ప్రసన్నం చేసుకోవడానికి పండుగల రూపాలలో ఎన్నో అవకాశాలు కల్పించారు. మరి అటువంటి గ్రామ దేవతలలో పోలేరమ్మ ఒక ముఖ్యమైన దేవత. పొలాల అమావాస్య భక్తి శ్రద్ధలతో జరుపుకుని, అమ్మవారుగా కొలవబడే గౌరీదేవిని పూజించి, పిల్లలకు పసుపు కొమ్ము కట్టిన తోరములను కట్టే కార్యక్రమాలు ఆచరిస్తారు. పోలాల అమావాస్య వేడుకల నిర్వహణ సనాతన ఆచారంగా వస్తున్నది. పూజచేసే చోట ఆవుపేడతో అలికి, వరిపిండితో అందమైన ముగ్గువేసి, ఒక కందమొక్కను వుంచి, పసుపుకొమ్ము కట్టిన నాలుగు తోరాలను అక్కడ వుంచి, ముందుగా వినాయకుని పూజించి, తర్వాత ఆ కంద మొక్కలోకి మంగళగౌరీ దేవిని, సంతానలక్ష్మీ దేవినిగాని ఆవాహనచేసి షోడశోపచారాలతో అర్చించి, తొమ్మిది పూర్ణం, బూరెలు, గారెలు, తొమ్మిది రకాల కూరగాయలతో చేసిన పులుసు ఆమెకు నైవేద్యంగా సమర్పిస్తారు. తర్వాత బహు సంతానవతి అయిన పెద్ద ముత్తయిదువును పూజించి, కొత్తచీర, రవికల గుడ్డ పెట్టి, నైవేద్యం పెట్టని తొమ్మిది పూర్ణంబూర్లు, ఒక తోరాన్ని అమ్మవారికి వాయనంగా సమర్పించి దీవెనలు అందుకుంటారు. ఇలా చేస్తే పిల్లలు మృత్యువాత పడకుండా కలరా, మలేరియా , మశూచి మొదలైన వ్యాధులు రాకుండా పోచక్క తల్లి పిల్లలను కాపాడుతుందని విశ్వాసం.

పొలాల అమావాస్య నాడు వ్యవసాయం కలవారు ఎద్దులకు పూజ చేస్తారు. వ్యవసాయం లేనివారు ఎద్దు బొమ్మలు మట్టితో చేసి వాటికి పూజ చేస్తారు.

ఏరువాక (జ్యేష్ట) పౌర్ణమి నుండి వ్యవసాయ పనులతో తీరిక ఉండని ఎద్దులకు ఆటవిడుపుగా, రైతులు ఎద్దుల నాలుకలకు ఉప్పురాచి, నాగలి కట్టక, వ్యవసాయ పనులకు తాత్కాలికంగా విశ్రాంతి నొసంగి, ఎడ్లను రంగు రంగులతో అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, అలంకరించి ,"వృషభోత్సవాన్ని" ఆనందోత్సాహాల మధ్య జరుపు కుంటారు. గ్రామదేవతను ఆరాధిస్తూ ... వ్యవసాయానికి సహకరించే పశువులను పూజించే పర్వదినం కనుక ఇది ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో కనిపిస్తుంది. పోలాల అమావాస్య సందర్భంగా గృహిణులు మట్టితో ఎడ్లను, పశువుల కాపరి మృణ్మయ మూర్తులను తయారు చేసి, పూజలు నిర్వహిస్తారు. సర్వ బాధల, సకల రోగాల నివారణార్థం మరియు సర్వజనులు సుఖ శాంతులలో వర్ధిల్లాలని గ్రామ దేవతయైన పోచమ్మను ప్రార్థించి, ఆరాధించి, సువాసినులను తమ ఇళ్ళకు విందులకు ఆహ్వానించి, పోచమ్మతల్లి ప్రతిరూపా లాగా భావించి, కైమోడ్పులు, భోజన తాంబూల దక్షిణ, కట్నకానుకలతో సంతృప్తి పరచే ప్రత్యేక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. ఈసందర్భంగా ముత్తయిదువలు పోటీలుపడి వంటకాలు తయారు చేయడం సనాతన ఆచారంలో భాగం.

# సుప్రీం కోర్టు తీర్పు రద్దు చేయాలని రిలే నిరాహారదీక్షలు

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** ఆదివారం స్థానిక భద్రాచలం అంబేద్కర్ సెంటర్ లో సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా రిలే నిరాహారదీక్షలు చేపట్టడం జరిగింది.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వర్గీకరణ పోరాట సమితి అధ్యక్షుడు అల్లాడి పౌల్ రాజ్ మాట్లాడుతూ వర్గీకరణ పై సుప్రీం కోర్టు తీర్పు రద్దు చేయాలని, రాజ్యాధికారం వైపు అడుగులు పడుతున్న నేపథ్యంలో దళితులు ఎక్కడ అధికారం చేపడతారో అని దళితుల ఐక్యత చూసి ఓర్వలేక అధికార వ్యామోహంతో ఉన్న కొన్ని అగ్రకుల మనువాదులు అన్నదమ్ములు గా ఉన్న దళితులను విడదీసి రాగ ద్వేషాలు రెచ్చగొట్టి ఉసుగొలిపే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అని దళితులు మేలుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ముంపు మండలాల ఇంచార్జ్ దేగల వంశీ మాట్లాడుతూ మహానుభావుడు బీ ఆర్ అంబేద్కర్ ఈ దేశానికి యిచ్చినటువంటి రాజ్యాంగాన్ని మార్చే, మొత్తం ఎస్సీలకు ఉన్నటువంటి రిజర్వేషన్ తొలగించే కుట్రలో భాగమే ఈ వర్గీకరణ అని కొన్ని రాజకీయ పార్టీలు దళితులను కొన్ని వర్గాలను పావులగా వాడుకుంటుంది అని అనారు. దళిత ప్రజానీకం గమనించాలి అని మాలలు ముందు వరసలో ఉండి అట్టడుగు లోని అన్ని వర్గాలను కలుపుకొని అంబేద్కర్ ఇచ్చినటువంటి రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని, మా ప్రాణాలు సైతం అర్పిస్తమని అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో వర్గీకరణ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అల్లాడి పౌల్ రాజ్, దేగల వంశీ, శివ, సరేళ్ళ వెంకటేష్, శ్రీను, సందీప్, వెంకన్న, రాఘవులు, రామకృష్ణ, కార్తీక్,




సత్తిబాబు, సురేష్, వెంకటేశ్వర్లు, ఉప్పెర్ల వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ రాహుల్ శర్మ



**విశ్వంభర,భూపాలపల్లి:** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ప్రజలు ప్రయాణాలు మానుకోవాలని సూచించారు. పొంగేవాగులు, రహదారులు దాటే ప్రయత్నం చేయొద్దని సూచించారు. శిథిలావస్థలో నివాసం ఉంటున్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని తెలిపారు. జాలర్లు చేపల వేటకు వెళ్ళొద్దని సూచించారు. అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేసి ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలని ఆదేశించారు. అత్యవసర సేవలకు ప్రజలకు కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేయు విధంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 9030632608, 18004251123 కంట్రోల్ రూము నంబర్లుకు కాల్ చేయాలని తెలిపారు.

## 30/30 ఏ పోలీస్ యాక్టివ్ అమలు: ఎస్పీసింధు శర్మ



**విశ్వంభర, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లాలో 30/30 ఏ అమల్లో ఉందని జిల్లా ఎస్పీ సింధు శర్మ తెలిపారు ఈరోజు నుండి ఏడవ తేదీ వరకు ఈ యొక్క ఆక్టివ్ అమల్లో ఉంటుందని పోలీసు అధికారుల అనుమతి లేనిచో సభలు, సమావేశాలు, పబ్లిక్, ధర్నాలు, రాస్తారోకోలు చేయరాదని, ప్రజల ఆస్తులకు భంగం కలిగించినచో వారికి చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆమె తెలిపారు.

## జిల్లా వ్యాప్తంగా రేపు స్కూళ్లకు సెలవు డీఈఓ రాజు



**విశ్వంభర, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా రేపు ప్రభుత్వ ప్రవేట్ పాఠశాలకు సెలవు ప్రకటించినట్లు డీఈఓ రాజు తెలిపారు. కామారెడ్డి జిల్లాలో అతి భారీ వర్షాలు పడుతుండడంతో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం స్కూళ్లకు సెలవు ప్రకటిస్తున్నట్లు డీఈవో పేర్కొన్నారు.

## మోత్కుర్-రాయిగిరి రోడ్డుపై పడిన చెట్లు తొలగింపు
### రవాణా వ్యవస్థను పునరుద్ధరించిన: ఎస్సై ఎస్ కృష్ణయ్య




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం శనివారం రాత్రి గాలివానకు మోత్కుర్-రాయిగిరి మెయిన్ రోడ్డుపైన ఖప్రాయపల్లి, రహీంఖాన్ పేట, తుక్కాపురం గ్రామాల వద్ద చెట్లు కూలి రాకపోకలకు అంతరాయం ఎర్పడింది. సమాచారం అందుకున్న ఆత్మకూరు(ఎం) ఎస్సై ఎస్ కృష్ణయ్య ఆధ్వర్యంలో పోలీసు కానిస్టేబుళ్లు సైదా నాయక్, శీను, శివ, ఆంజనేయులు రోడ్డుపై అడ్డంగా పడిన చెట్లను గొడ్డల్లతో ముక్కలు చేసి అడ్డంపడిన చెట్లను తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. పోలీసులు చెసిన పనికి పలువురు వాహనదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మృతురాలి కుటుంబ సభ్యులకు కాలనీవాసుల సహాయం



**విశ్వంభర, ఆత్మకూరు :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన శబ్రు జయమ్మ దశదినకర్మ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ డబుల్ బెడ్ రూమ్ కాలనీ వాసులు వంట సామాగ్రి అందజేశారు. కాలనీవాసులు గర్దాసు లింగయ్య, గట్టు అశోక్, వేముల నరసింహ, రచ్చ రమేష్, గంధ మల్ల రమేష్, మంద్ర మహేందర్, ఎద్దు సురేష్, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు




**విశ్వంభర,మెట్‌పల్లి:** మెట్‌పల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మైలారపు రాంబాబు కార్యవర్గం ఆధ్వర్యం లో 5 చేతుల పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య సామూహిక వనభోజనాల కార్యక్రమాన్ని జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మైలారపు లింబాద్రి ప్రారంభించారు. దాదాపు 1500 మంది పైన భోజనాలకు ఏర్పాటు చేశారు. ఈ కార్య క్రమంలో కార్యదర్శి ఎల్మీ రవి కోశాధికారి దొంతుల లక్ష్మీనారాయణ, సంయుక్త కార్యదర్శి కొత్త నవీన్, వాసవి దేవా లయం అధ్యక్షులు చాడ సురేష్, వాసవి గార్డెన్ అధ్యక్షులు కోట కిరణ్‌కుమార్, సంస్కృత కమిటీ అధ్యక్షులు చింత లవ కుమార్, మహిళా మండలి అధ్యక్షురాలు పుల్లూరి మధుమిత, మైలారపు లక్ష్మి, కోట ధనలక్ష్మి, చాడ పావని, బండారి గోపి, బండారి ప్రసాద్, చిట్టి మిల్లి శ్రీనివాస్, జొన్న శ్రీనివాస్, వెలగందుల లక్ష్మీ నరసయ్య, జలంధర్, కట్కం శంకర్, ఎలగందుల అజయ్, పుల్లూరి నవీన్, బండారి శివ, పాముపొట్టి అమర్నాథ్, ఎలగందుల షామిలి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## కురుస్తున్న వర్షాలకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ ప్రజలు అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున వాతావరణ శాఖ భారీ వర్షాల కురుస్తాయన్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర, యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు నియోజక వర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సూచించారు. ఇంకా రెండు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని తెలిపారు. గ్రామాలలో పాత ఇండ్లు, గుడిసెలు, శిధిలావస్తలో ఉండే నివాసాలలో ఉండే ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సురక్షితమైన ప్రాంతాలకు వెళ్లాలని గ్రామాలలో పెద్దలు తమ పిల్లలను చెరువులు, కుంటలు, వాగుల వద్దకు వెళ్లకుండా చూడాలని వాగులు వంకలలో కూడా నీటి ప్రవాహాలు వచ్చే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాలలో అప్రమత్తంగా ఉండాలని శాసనసభ్యులు ఐలయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, గోరువెచ్చని నీటిని త్రాగాలనీ, నిల్వ ఉంచిన నీటినీ వాడుకోకుండా ఉండాలి అని తెలిపారు. సీజనల్ వ్యాధులు సోక కుండా చూసుకోవాలని అన్నారు. రైతులు వ్యవసాయ క్షేత్రంలో పనుల కోసం వెళ్లినప్పుడు విషసర్పలతో జాగ్రత్తగా ఉండాలని కాలనీలలో, గ్రామాల్లో, వ్యవసాయ క్షేత్రాల వద్ద కరెంటు స్తంభాలు తాకవద్దు అని తెలిపారు. ఏదైనా సహాయం కోసం తనను కానీ తన కార్యాలయ సిబ్బందిని సంప్రదించవచ్చు తెలిపారు.

## భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:
### కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు



**విశ్వంభర, కోరుట్ల:** కోరుట్లజిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు నేపథ్యంలో కోరుట్ల నియోజకవర్గంలోని పట్టణ, మండల, గ్రామ స్థాయిలో అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంఛార్జి, పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి నర్సింగరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నందున రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్యారోగ్య శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోరుట్ల నియోజకవర్గంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సహాయక శిబిరాలకు తరలించాలని అన్నారు. లోతట్టు, దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని వారిని ఆదేశించారు. అదే విధంగా బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతుందని మరో రెండు, మూడు రోజులు కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వాగు పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కూలిపోయే సిద్ధంగా ఉన్న ఇళ్లల్లో ఎవరు నివాసం ఉండరాదని అన్నారు. పరివాహ ప్రాంతాల్లో గల వరద నీటిలోకి ఎవరు వెళ్లొద్దని తెలిపారు. మత్స్యకారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షం కారణంగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లకు షార్ట్ సర్క్యూట్ వచ్చే అవకాశం ఉన్నందున వాటికి దగ్గరగా మనుషులు వెళ్లొద్దని, పశువులను కూడా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. పట్టణాలు, గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన సేవలందించాలని కోరారు. మండల, గ్రామస్థాయి అధికారులతో కలిసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. నియోజకవర్గంలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. గోదావరికి భారీ వరద నీరు వచ్చే అవకాశం ఉండడంతో అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

## ఇంజనీర్ల పాత్ర కీలకం: ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం




**విశ్వంభర,ఎల్బీనగర్:** తెలంగాణ భవిష్యత్తు నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆదివారం సరూర్నగర్ లోని పాపడం హెూటల్లో గేట్ మాస్టర్ ప్రెస్ మీట్ సక్సెస్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ మీకు రాజకీయ నాయకులు కానీ బాసులు కానీ ప్రధానం కాదని అన్నారు. చట్టమే మీకు అన్నింటికీ మించిన సుప్రీమ్ అని తెలిపారు. తప్పు అని తెలిసి కూడా తప్పులు చేస్తే తిప్పలు తప్పవన్నారు. నిజాయితీ నిబద్ధత కూడిన ఉద్యోగం చేస్తే అందరూ మీకు సలాం చేస్తారని, అలా కాకపోతే మీరు అందరికీ సలాం చేస్తూ తల దాచుకోవాల్సి వస్తుందన్నారు. అనంతరం గేట్ మాస్టర్ డైరెక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇటీవల విడుదలైన ఏఈఈ ఫలితాలలో 509 మంది గెజిటెడ్ ఆఫీసర్స్ తమ అకాడమీ నుండి సెలెక్ట్ అయ్యారని తెలిపారు. అనంతరం స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన వ్యక్తి డి వెంకట్ రెడ్డికి బహుమతిని ప్రధానం చేశారు.

## బీసీల అమరణ దీక్షపై ప్రభుత్వం స్పందించాలి
### తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ డిమాండ్



**విశ్వంభర,ఎల్బీనగర్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కల్పిస్తామన్న 42 శాతం రిజర్వేషన్లు హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల నేతలు చేస్తున్న ఆమరణ నిరాహారదీక్ష పై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి వారి ప్రాణాలను కాపాడాలని తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది . సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న హిందూ బీసీ మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర పటేల్ ను తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు ఘోర శ్యాంసుందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మారోజు రామన్న చారి లు పరామర్శించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీక్ష చేస్తున్న వారి డిమాండ్లు నెరవేర్చకపోతే తెలంగాణలోని బీసీ ప్రజలందరూ ప్రభుత్వంపై తీవ్రతరమైన ఉద్యమం చేస్తారని వారు హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ స్వయంగా ఇచ్చిన హామీలైన కులగణన ప్రక్రియ చేపట్టాలని ,స్థానిక సంస్థల రిజర్వేషన్లు 42 శాతం బీసీలకు కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నెరవేర్చని పక్షంలో పార్టీ తగు మూల్యం చెల్లించుకుంటుందని వారు హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమ తరహాలోనే బీసీ ఉద్యమం కూడా నిర్మిస్తామని వారు తెలిపారు .గత ఎనిమిది రోజులుగా బీసీ డిమాండ్లపై నిరాహార దీక్ష చేస్తున్న బత్తుల సిద్దేశ్వర్లు పటేల్, జక్కని సంజయ్, చాపర్తి కుమార్ ల ఆరోగ్యం క్షీణిస్తున్నదని వారి ఆరోగ్యానికి ఏమైనా ప్రమాదం జరిగితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని అన్నారు. పరామర్శించిన వారిలో బీసీ జనసభ అధ్యక్షులు రాజారాం యాదవ్, చామకూర రాజు, కెవి గౌడ్, వేణు కుమార్, కొంగర నరహరి పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి
### ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి



**విశ్వంభరా,ఎల్బీనగర్:** చదువుతో పాటు క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్తమంగా రాణించాలని నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి, పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ అన్నారు. నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే వాలీబాల్, కో కో క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులను నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పంపినీచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగోల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు క్రీడా పోటీల్లో సత్తా చాటాలని కోరారు. ఎఫ్ జి ఎఫ్ పోటీల్లో పతకాలు సాధించి పాఠశాల కు పేరు తేవాలన్నారు. పాఠశాలలో శనివారం జరగాల్సిన కబడ్డీ టోర్నమెంట్ వర్షాల కారణంగా వాయిదా వేశామని వారు తెలిపారు. ఈ పోటీలు త్వరలోనే నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రెసిడెంట్ ఖన్నా గౌడ్, ఉపాధ్యక్షుడు సురేష్, సిద్ధి రమేష్, సంయుక్త కార్యదర్శి పల్లే లింగం గౌడ్, డోనార్స్ కమిటీ సభ్యులు జిల్కపల్లి శ్రీనివాస్ రెడ్డి, అనంతుల శ్రీనివాస్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాళ్ళ ఉమామహేశ్వర్ గుప్త కృతజ్ఞతలు తెలిపారు.

## గాలి పోచమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవం



**విశ్వంభరా, నాగోల్:** ఎల్బీనగర్ లోనీ ఎరుకల నాంచారమ్మ బస్తీ ఆదర్శ్ నగర్ డబుల్ బెడ్ రూమ్ లో జరిగిన గాలి పోచమ్మ పోచమ్మ అమ్మవారి కళ్యాణానికి ముఖ్య అతిథిగా టిపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ , రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఆ గాలి పోచమ్మ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుంది అని ఆయన తెలిపారు. తన వంతుగా ఎన్నో దేవాలయాల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గయ్య, చైర్మెన్ రుపాని లింగ స్వామి, ప్రధాన కార్యదర్శి భీమన పల్లి సిద్దు పాల్గొన్నారు.

## ఉక్కు పాదం మోపవలసిన అవసరం ఉంది
### ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు



**విశ్వంభర, ఎల్బీనగర్:** రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో విద్యార్థులు చేసిన ఉద్యమాన్ని పక్కదారి పట్టించి హిందువులను టార్గెట్ చేసి హతమార్చడం లాంటి చర్యలకు పాల్పడిన నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో ఉన్న భారతీయులను సురక్షితంగా భారతదేశనికి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లపై జరిగిన ఆందోళనలు హసీనాలేని బంగ్లాదేశ్‌లో మరిన్ని సమస్యలు భారతీయులు ఎదుర్కోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో 19 వేల మంది భారతీయులు ఉండగా వారిలో కొద్ది మంది మాత్రమే భారత్‌కు వచ్చారని అతి క్రూరంగా హిందువులను హతమార్చడం అత్యాచారాలు చేయడం దేవాలయాలు ధ్వంసం చేయడం బంగ్లాదేశ్ ఇస్లామిక్ మతోన్మాదుల అరాచకాలపై ఉక్కు పాదం మోపవలసిన అవసరం ఉందని అన్నారు. గతంలో ఉక్రెయిన్ లో జరిగిన యుద్ధ సమయంలో భారతీయ వైద్య విద్యార్థులను సురక్షితంగా తీసుకువచ్చిన కేంద్రం బంగ్లాదేశ్ నుండి మన వారిని తీసుకురావడంలో ఎందుకు మీనమేషాలు లెక్కబెడుతుందని ప్రశ్నించారు. తక్షణమే భారతీయులందరినీ భారత్‌కు తీసుకొని రావాలని కేంద్రం తక్షణమే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వక్కలంక శ్రీనివాస్ రావు ప్రశ్నించారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ ప్రవీణ్ కుమార్

**విశ్వంభర, మునగాల:** రాత్రి నుండి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మునగాల మండల ప్రజలకు ఎస్ఐ ప్రవీణ్ కుమార్విజ్ఞప్తి చేశారు. వర్షాలకు వాగులు వంకలు చెరువులు నిండి పలు గ్రామాలకు చెరువుల నుండి వాగుల ద్వారా భారీగా నీరు వచ్చే ప్రమాదం ఉన్నది. కావున చెరువులు కల్వర్టు (బ్రిడ్జి)ల వద్ద అప్రమత్తంగా ఉండాలని లోతట్టు ప్రాంత ప్రజలు మరియు పురాతనమైన శిధిలమైన భవనాలలో నివసించే వారు సురక్షితమైన ప్రాంతాలకు వెళ్లాలని కోరుతున్నాము. విద్యుత్ స్తంభాలు ట్రాన్స్ఫార్మర్ల పట్ల రైతులు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని కోరుతున్నాము. గ్రామాలలో వర్షాల వల్ల ఎక్కడైనా ఏమైనా అనుకొని ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉంటే వెంటనే 100 నెంబర్ కు ఫోన్ చేసి స్థానిక పోలీసు, రెవెన్యూ, విద్యుత్ అధికారులకు, మండల పాలన అధికారులకు, గ్రామపంచాయతీ సిబ్బందికి సమాచార ఇవ్వండని తెలిపారు. హైదరాబాద్ - విజయవాడ నేషనల్ హైవే పైన వాహనాలు అడ్డగోలుగా నిర్లక్ష్యంగా నిలపడం అతివేగంగా వాహనాలు నడపడం ద్వారా ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు హైవే పక్కన వాహనాలు నిలపవద్దు, అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దు, కుటుంబాలకు దూరం కావద్దన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల మితిమీరిన వేగంతో నడిపి యువకులు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. దయచేసి తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వకండి. నేషనల్ హైవే రోడ్డు మీద ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు, టూవీలర్ వాహనదారులు హెల్మెట్ ధరించండి ఫోర్ వీలర్ వాహనదారులు సీట్ బెల్ట్ పెట్టుకొని వాహనాలను నెమ్మదిగా పోనీ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్క వాహనదారుడు జాగ్రత్త వహించాలని కోరుతున్నాము.



# పంటల్లో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి:

## వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్ కుమార్



**విశ్వంభర, చింతపల్లి :** చింతపల్లిమండల వ్యాప్తంగా గత మూడు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాల నేపథ్యంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి పాల్వాయి శ్రవణ్ కుమార్ ఆదివారం చింతపల్లి మండలం కుర్మేడ్ గ్రామంలోని పత్తి పంటలను పరిశీలించారు. అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వరి పంటలు వేసిన రైతులు నాటు వేసిన పొలాలలో నీరు నిలిచినట్లయితే 48-72 గంటల లోపు నీటిని కాలువల ద్వారా బయటికి పంపాలన్నారు. లేనిచో మొక్కలు ఆక్సిజన్ అందక చనిపోయే అవకాశం ఉంటుంది. నాట్లు వేసిన పొలాలు మునిగి మొక్కల సంఖ్య దెబ్బ తిన్నట్లయితే ఆ పొలాలను దమ్ము చేసుకొని అతి స్వల్ప కాలిక రకాలతో నేరుగా విత్తుకోవాలని తెలిపారు. నేరుగా విత్తే పద్ధతులైన డ్రం సీడర్ లేదా వెదజల్లే పద్ధతిలో సాగర్ ఆయకట్టు పరిదిలో సెప్టెంబర్ 10 లోపు నేరుగా విత్తుకునే అవకాశం ఉన్నదని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు నార్లు పోయని రైతులు, వర్షాలను సద్వినియోగం చేసుకొని పొలాలను దమ్ము చేసుకోవాలి, వానలు తెరిపిచ్చినాక నేరుగా విత్తుకోవడం వలన సమయము మరియు పెట్టుబడి ఆదా చేసుకోవచ్చు. వరినారు తీసే ఏడు రోజుల ముందు రెండు గుంటల నారు మడికి 800 గ్రాముల కార్బో ఫిరాన్ గుళికలను నారుమడిలో చల్లుకోవాలి. ముదురు నారు నాటేటప్పుడు నారు కొనలను తృంచి కుదురుకు 4 నుండి 5 మొక్కలను నాటాలి. నాట్లు వేసిన రైతాంగం వర్షాల వలన రోజులలో 3-5 కలుపు మందులు వేసుకోలేనప్పుడు ఆ తర్వాత కూడా కలుపు మందులు వాడుకోవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. కుర్మేడు ఏఈఓ నరసింహ, రైతులు నాదిరి ఆంజనేయులు, లక్ష్మయ్య, గంజేటి వెంకటయ్య, కృష్ణయ్య, శ్రీను, పడకంటి మదార్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నీటి ప్రవాహం వద్ద పోలీసు భద్రత




**విశ్వంభర, ఆమనగల్లు:** గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో అమనగల్లు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అమనగల్లు ఎస్.ఐ వెంకటేష్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మేడిగడ్డ తాండ, శంకర్ కొండ తాండ గ్రామపంచాయతీ ల మధ్య ఉన్న కత్వా వాగు పొంగి ప్రవహిస్తుండగా ఎస్.ఐ వెంకటేష్ గిరిజన ప్రజలతో కలిసి పరిశీలించి బారికెడ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, నదులు పొంగి ప్రవహిస్తున్నాయని గిరిజన ప్రజలు చేపల వేటకు వాగు వద్దకు వెళ్ళవద్దన్నారు. యువత రీల్స్ కోసం వాగు వద్దకు వెళ్ళొదన్నారు. వాగులు వంకలను ప్రజలు దాటే సాహసం చేయకుండా రైతులు ప్రజలు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ.ఎస్.ఐ బాల్ రెడ్డి, కానిస్టేబుల్స్ ప్రవీణ్, ఇబ్రహీం, మల్లేష్, శివ కుమార్ మరియు గిరిజన ప్రాంతా ప్రజలు విజయ్ రాథోడ్, సురేష్, భాస్కర్, సిద్దు, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# గజ్వేల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నియామకం



**విశ్వంభర,గజ్వేల్:** గజ్వేల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గా మహంకాళి శ్రీనివాస్ గుప్త, ఉప్పల శ్రీనివాస్ గుప్త, సముద్రాల హరినాథ్ గుప్త లు నియామకం అయ్యారు. కొత్తగా మార్కెట్ కమిటీకి నియామకమైన డైరెక్టర్లకు కొండ పోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ అయిత సత్యనారాయణ అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ గజ్వేల్ మార్కెట్ కమిటీలో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించిన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# గంగారం చెరువు కాలువకు గండి



**విశ్వంభర, మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ జిల్లా, మూసపేట మండలం, జానంపేట గ్రామంలో ఆదివారం గంగారం చెరువుకు వచ్చే కాలువ పల్లి పెంటయ్య, పల్లి శాంతప్ప, దొంగ వెంకటన్న వాళ్ల పొలాల దగ్గర.. తెగి పోయింది. దీంతో వరి పంట పొలాలు ఏర్లతో సహా కొట్టుకు పోయినవి. గతంలో రెండు సంవత్సరాల క్రితం ఇదే మాదిరిగా జరిగింది. అప్పటి ఇరిగేషన్ అధికారులకు రైతులు, గ్రామ పెద్దలు ఎన్నో సార్లు సీసీ వేయమని దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. చెరువు కు ఇలాంటి గండీలు ఇంకో రెండు, మూడు పడే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న ఇరిగేషన్ అధికారులు అప్పటి ఇరిగేషన్ అధికారులు ఒక్కరే. జానంపేట గ్రామంలోని నాగిరెడ్డి పల్లి చెరువు నుంచి నేరేడి చెరువు కు వచ్చే కాలువ, ప్రస్తుతం గాజులపేట కద్దళ్ దగ్గర గేట్ (తలుపులు) లేక చెరు వులు నిండు కుండలలాగ మారడంతో రైతులు ఇబ్బందులుపడుతున్నారు. నేరేడు చెరువు యపాలా చెరువు కింద ఉన్న రైతులు ఎక్కడ ఈ రెండు చెరువులు గండి పడతాయో అన్నా భయానికి నాగిరెడ్డి పల్లి చెరువు దగ్గర ఉన్న తలుపు లు మూసి ఉంచారు. ఇరిగేషన్ అధికారులకు గ్రామ రైతులు, పెద్దలు వర్షాకాలం మొదలు ముందు మా గ్రామంలో ఉన్నటువంటి చెరువులను మారమ్మతులు చేయమని ఎన్నో సార్లు విన్నవించుకోగా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇలాంటి దుస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.మరమ్మతులు చేయకపోగా చెరువు కట్టలపోంటి ఇరువైపులా చెట్లు పెరిగి వాటివేర్లు కట్టలకు పాకడంతో ఊర్లో ఉన్న చేరులు తెగిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# రక్తదాతల సమూహం, ఐవీఎఫ్‌కి తలసేమియా అవార్డులు



**విశ్వంభర, కామారెడ్డి:** తలసేమియా సికిల్ సెల్ సొసైటీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాల ఏర్పాటు చేసి వారి ప్రాణాలను కాపాడిన కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైష్ ఫెడరేషన్(ఐవిఎఫ్) లకు ఉత్తమ మోటివేటర్ మరియు రక్తదాతల అవార్డులను ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ సంగీత పాఠక్, అపూర్వ గోష్, కోటపాటి రత్నావళీలు అవార్డు గ్రహీతలు డాక్టర్ బాలు, డాక్టర్ వేదప్రకాష్, జమీల్, గంప ప్రసాద్, డాక్టర్ పుట్ల అనిల్ కుమార్, వెంకటరమణ ఈ రోజు శివరాంపల్లిలో గల తలసేమియా సికిల్ సెల్ సొసైటీలో అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం 3500 యూనిట్ల రక్తాన్ని అందజేసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో నమోదు కావడం జరిగిందని, భారత దేశంలోనే మొట్టమొదటి స్వచ్ఛంద సేవా సంస్థగా కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైష్ ఫెడరేషన్ కి గుర్తింపు రావడం జరిగిందని, తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం భవిష్యత్తులో మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహించి వారి ప్రాణాలను కాపాడడానికి కృషి చేస్తామని అన్నారు. రక్తదానానికి ముందుకు వచ్చిన రక్త దాతలకు, ఎంతగానో సహకరిస్తున్న మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి



**విశ్వంభర,కోరుట్ల:** కోరుట్ల నియోజకవర్గ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక జి ఎస్ గార్డెన్లో మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాటు చేశారు. గడ్డం వివేక్ వెంకట్ స్వామి హాజరయ్యారు. గడ్డం వివేక్ వెంకట్ స్వామికి కొరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వడి నర్సింగారావు మరియు కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ అంజిరెడ్డి వైస్ చైర్మన్ వెంకటేష్ గౌడ్ మార్కెట్ కమిటీ పాలకవర్గానికి వివేక్ వెంకట్ స్వామి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ అంజిరెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి చైర్మన్ పదవి కట్టబెట్టిన జువ్వాడి నర్సింగరావు కు రుణపడి ఉంటానని చిన్న వయసులో పెద్ద బాధ్యతలు అప్పగించిన జువ్వడి నర్సింగరావుకు పాదాభివందనం చేస్తున్నానని కోరుట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నాల అంజిరెడ్డి అన్నారు. కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.



విశ్వంభర, ఎల్బీనగర్: రంగారెడ్డి జిల్లా కోర్టు సీనియర్ న్యాయవాది షాయి రెడ్డి న్యాయవాది కార్యాలయం ప్రారంభోత్సవం పాల్గొన్న మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి. బండి మధుసూదన్ రావు, ఇమ్రాన్ అలీ,నగేష్ పాల్గొన్నారు.

# మహదేవపూర్ మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా వ్యాప్తముగా ఆగస్టు 31 నుండి సెప్టెంబర్ 2 వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినందున మహదేవపూర్ మండల ప్రజలు అప్రమత్తముగా ఉండాలని స్థానిక ఎమ్మార్వో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎవరు కూడా ఇండ్లలో నుండి బయటకు రాకూడదని, శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఎవరూ ఉండకూడదని, ఎవరూ కూడా గోదావరి తీర ప్రాంతాలకు వెళ్ళకూడదని, మత్స్యకారులు చేపలు పట్టుటకు గోదావరి లోకి, చెరువులు, వాగుల వద్దకు వెళ్ళకూడదని ఆయన తెలిపారు. పశువుల మేపుటకు అడవులకు వెళ్ళకూడదని, లోతట్టు ప్రాంతాలకు ఎవరూ కూడా వెళ్ళవద్దని కరెంటు స్తంభాలకు మరియు కరెంటు పోల్ లను ముట్టుకోకుండా దూరంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తముగా ఉండాలని కాళేశ్వరం ఎస్సై సిహెచ్ చక్రపాణి, మహా దేవ్ పూర్ ఎమ్మార్వో, ఎంపీడీవో తెలిపారు. ఈ మూడు రోజులు అధిక వర్షాల దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలియచేసారు.

# అలుగులు పోస్తున్న చెరువు వద్ద పూజలు



**విశ్వంభర, కామారెడ్డి:** భారీ వర్షాలకు పొంగి పొర్లుతున్న కామారెడ్డి చెరువు వద్దకు భారతీయ జనతా పార్టీ కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు ఆకుల భరత్ పరిశీలించారు. చెరువు అలుగులు పోస్తున్న గంగామాతకు కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు. అలుగు పొంగి పొర్లుతుంటే అందరూ ఆనందం ఆనందం వ్యక్తం చేయడం జరిగింది. కామారెడ్డి లో భారీ వర్షాలు పడుతుండడంతో అందరూ జాగ్రత్తగా ఉండాలని, వీలైనంతవరకు ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా ఉండాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో కౌన్సిలర్ అవధూత నరేందర్ పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రతాప్ నేత, రాజు పటేల్ ఉపాధ్యక్షులు సబ్బని ప్రవీణ్ కుమార్ రజనీకాంత్ గంగారం నాయకులు పాల్గొన్నారు.

# రెడ్ అలర్ట్ అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ రాహుల్ శర్మ

**విశ్వంభర, భూపాలపల్లి :** రానున్న రెండు రోజులు జిల్లాకు రెడ్ అలెర్ట్ ఉన్నదని యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా తెలిపారు. వర్షాలు, వరదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదివారం అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గడిచిన రెండు రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకున్నామని, రానున్న రెండు రోజులు ఇదే స్ఫూర్తితో అప్రమత్తంగా ఉండాలని ఈ రెండు రోజులు చాలా ముఖ్యమని అన్నారు. మండల స్థాయిలో రెవెన్యూ, పంచాయతి, పోలీస్ అధికారులు పరిస్థితులను పర్యవేక్షణ చేయాలన్నారు. వర్షం ఎపుడు వస్తుందో తెలీదని ప్రజలు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. వాగులు, రహదారులపై నీళ్ళు వస్తే ప్రయాణాలు నియంత్రణకు ప్రమాద హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాలల్లో పటిష్ఠ రక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా ముంపు గ్రామాల జాబితాను సిద్ధం చేసుకుని తగు జాగ్రత్తలు పాటించే విధంగా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు నివారణ చర్యల్లో భాగంగా లూజు వైర్లు గుర్తించి ఎలాంటి ప్రమాదాలు వాటిల్లకుండా తగు రక్షణ చర్యలు చేపట్టాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. నిండు కున్న జలాశయాలకు వీక్షణకు ప్రజలు వస్తుంటారని నియంత్రణ చర్యలు చేపట్టాలని పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. పొంగే వాగులు, రహదారులపై వాహనాలు రాకపోకలు నియంత్రణ చేయాన్నారు. అన్ని తహసీల్దార్ కార్యాలయాలతో పాటు కలెక్టరేట్ నందు కంట్రోల్ రూములు ఏర్పాటు చేయడం జరిగిందని, ఏదేని అత్యవసర సేవలకు ప్రజలు కంట్రోల్ రూము నంబర్స్ కు కాల్ చేయాలని ఆయన తెలిపారు. ప్రసవానికి దగ్గర తేదీ ఉన్న మహిళలను ఆసుపత్రులకు తరలించాలని వైద్యాధికారులను ఆదేశించారు. 102, 104 వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. కాళేశ్వరానికి వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున రెవెన్యూ, పోలీస్, పంచాయతి, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ఈ టెలి కాన్ఫరెన్స్ లో అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వెంటనే స్పందించిన కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్తా



**విశ్వంభర, ఎల్‌బీ నగర్:** చైతన్యపురి డివిజన్ లోని ఫణిగిరి కాలనిలో భారీ వర్షాలకు మూసి పక్కన వున్న ఇండ్లు మునిగి పోయాయి. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్తా జీహెచ్‌ఎంసీ జెడ్.సీ శ్రీ హేమంత కేశవ్ పాటిల్ తో మాట్లాడి జేసీబీ తెప్పించి అక్కడ వున్నా నాలాను క్లియర్ చేయించారు. ఈ విషయంలో కాలనీ వాసులు మరియు బీజేపీ నాయకులు వినోద్ యాదవ్, వెంకన్న, అంజిబాబు, రాకేష్, రాంమోహన్ మరియు కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

# పిల్లల బంగారు భవిష్యత్తు శంషాబాద్ రోడ్డు ఎక్కింది!

■ పాలమాకుల కేజీబీవీ బాలికల ఆక్రందనలు వినేదెవరు? ■ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురుకులాలపై దృష్టి పెట్టాలి ■ బాలల హక్కుల సంక్షేమ సంఘం డిమాండ్



**విశ్వంభర, శంషాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గురుకులాలు, హాస్టళ్లలో, కస్తూర్బా గాంధి బాలికల విద్యాలయాల్లో(కేజీబీవీ) నాణ్యమైన ఆహారం పెట్టడం లేదు. పెట్టే భోజనంలో పురుగులు వస్తున్నాయని పిల్లలు ఎంత మొత్తుకున్నా అధికారులు పర్యవేక్షించడం లేదు. మంత్రులు ఏదో ఒక సంఘటన జరిగితే ఆర్భాటంగా రెండు రోజుల హడావిడి తప్ప ఎలాంటి మార్పు ఉండడం లేదు. విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్యమంత్రి వద్దే ఉండడంతో జరిగిన సంఘటనలు ముఖ్యమంత్రి వద్దకు వెళ్లడం లేదా? వెళ్తే వాటిపై దృష్టి పెట్టే తీరికలేదా? అని బాలల హక్కుల సంక్షేమ సంఘం(బీహెచ్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షులు డా గుండు కిష్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ సంశయం వ్యక్తం చేసారు. రెండు రోజుల క్రితం శంషాబాద్ మండలం పాలమాకుల గురుకుల పాఠశాలలో బాలికలను కులం పేరుతో, బూతులు తిడుతూ అవమానిస్తున్నారని, నాణ్యమైన ఆహారం అందించకుండా నిర్లక్ష్యం, వివక్ష పాటిస్తున్నారని విద్యార్థులు ఆందోళన చేస్తే మిమ్మల్నీ 10 వ తరగతిలో ఫెయిల్ చేస్తామని ఉపాధ్యాయులు బెదిరించడం ఎంతవరకు సమంజసం. అన్నంలో పురుగులు వస్తున్నాయని ప్రశ్నించిన బాలికల ముఖం పైకి కారం చల్లడం పిల్లల్ని హింసించడం క్రిందకి వస్తుందని, ఆ ఉపాధ్యాయులకు బిడ్డలు లేరా అని ప్రశ్నించారు. కులం పేరుతో వివక్ష చూపుతున్న ఉపాధ్యాయులను వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. చదువుకోవాల్సిన బాలికలు రోడ్డు ఎక్కి ధర్నాలు చేయాల్సిన పరిస్థితి దాపురించిందని వారు అన్నారు. అన్నం కూరల్లో పురుగులు వస్తున్నాయని పిల్లలు టీచర్లకు చెప్తే వాటిని తీసేసి తినండని ప్రిన్సిపాల్ బెదిరించడం అమానవీయమని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న టీచర్లు, ప్రిన్సిపాల్ అందరినీ అక్కడి నుండి బదిలీ చేయాలనీ బాలల హక్కుల సంక్షేమ సంఘం డిమాండ్ చేస్తుంది. నాణ్యమైన భోజనం పెట్టండని విద్యార్థులు రొడ్డెక్కడం రాష్ట్రంలో గురుకులాలు, హాస్టళ్లు, కస్తూర్బా గాంధి స్కూళ్ళలో పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో తెలియచేస్తుంది. విద్యార్థులను గురుకులాల్లో పాములు, ఎలుకలు కరుస్తున్నాయి. అయినా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. ఇటీవల ఐదు రోజుల క్రితం నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొండభీమనపల్లి బీసీ బాలుర గురుకుల పాఠశాలలో నిద్రిస్తున్న విద్యార్థులను ఎలుకలు కొరకటంతో 14 మంది గాయాల పాలయ్యారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యాలయలో కనీస వసతులను కల్పించాలన్నారు. గురుకుల విద్యార్థులకు బడ్జెట్ కోతలు లేకుండా చూడలన్నారు. హుసేన్ సాగర్ చుట్టూ స్కైవాక్ ల నిర్మాణాల కంటే ముందుగా విద్య, వైద్యం పై దృష్టి పెట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. గుడుల మీద వున్న దృష్టి బడులపై సారించి ఆధునిక్కమైన అన్ని మౌలిక వసతులతో అద్దె భవనాల్లో ఉన్న అన్ని గురుకులాలకు, హాస్టళ్లకు స్వంత భవనాలు నిర్మించాలని అద్దెల పేరుతో వేల కోట్ల రూపాయల దోపిడీ జరుగుతున్నదని దాన్ని అరికట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నామని వారన్నారు.

# అల్పపీడనం కారణంగా ఎల్లో అలర్ట్

■ భారీ వర్షాల దృష్ట్యా జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి ■ జిల్లా ప్రజలు అత్యవసరమైతేనే ప్రయాణాలు చేయండి
■ పొంగి, పొర్లుతున్న వాగులు, చెరువులను చూడానికి వెళ్లారాదు ■ కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితులను సమీక్షిస్తున్న జిల్లా ఎస్పీ రూపేష్




**విశ్వంభర. సంగారెడ్డి:** భారీ వర్షాల దృష్ట్యా సంగారెడ్డి జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేయడం జరిగిందని, జిల్లా ప్రజలు ఎవ్వరు కూడా పొంగి, పొర్లుతున్న వాగులు, చెరువులు, కుంటలను చూడానికి వెళ్లారాదని, అత్యవసరమైతేనే తప్పప్రయాణాలు చేయకూడదని, జిల్లా ఎస్పీ రూపేష్ అన్నారు. జలాశయాలు నిండు కుండాల మారే అవకాశం ఉన్నందున ప్రమాద కారణాల దృష్ట్యా ఎవ్వరూ చెరువులు, కుంటలను చూడటానికి వెళ్లారాదని సూచించారు. ఏదైనా ప్రమాదం తలెత్తినా, అత్యవసర సమయంలో స్థానిక పోలీసు స్టేషన్ కు లేదా జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నెంబర్ 8712656739 ను సంప్రదించవలసిందిగా జిల్లా ఎస్పీ సూచించారు. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, జిల్లా పోలీసు యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలని, చెరువులు కుంటలకు చూడటానికి ఎవ్వరిని అనుమతించరాదని, ప్రమాద సూచిక బోర్డ్ లను ఏర్పాటు చేసే విధంగాచూడాలన్నారు. యస్. హెచ్. ఒ. లు ప్రత్యేకంగా తమ తమ ఏరియాలో ఉన్న చెరువులు కుంటలను సమర్థించి, ఆనకట్టలు ప్రమాద అంచున ఉన్నట్లయితే సమాచారం అందించాలన్నారు. లోతట్టు ప్రాంతాలలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు పంపాలని పోలీసు అధికారులకు సూచనలుచేయడం జరిగింది. భారీ వర్షాల దృష్ట్యా **పాటించవలసిన జాగ్రత్తలు:** అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకూడదు. ప్రమాద కారణాల దృష్ట్యా చెరువులు, కుంటలను చూడటానికి వెళ్లారాదు. రైతులు పొలాలో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలి. విద్యుత్ స్తంభాలను గాని, వైర్లను కానీ చేతులతో తాకకకూడదు. నీరు నిలువ ఉన్న విద్యుత్ స్తంభాల దగ్గర నుండి వెళ్లారాదు. వాగులు వంకలు బ్రిడ్జ్ లపై నుండి వరద పొంగి, ప్రవహించే సమయంలో దాటాడానికి ప్రయత్నించరాదు. పాడైన పాత భవనాల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల ప్రక్కన నివాసం ఉండరాదు అని జిల్లా ఎస్పీ రూపేష్ సూచించారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశ్వంభర, కోరుట్ల: రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన ప్రజల ఇబ్బందులను తెలుసుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రానున్న రెండు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది కాబట్టి కోరుట్ల నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దు అని, తడిచిన చేతులతో కరెంటు స్విచ్ బోర్డులను కరెంటు స్తంభాలను తకవద్దని, పొంగిపొర్లుతున్న చెరువులను వాగులను చూడడానికి బయటకు వచ్చి ప్రమాదాల బారిన పడి వద్దని, అలాగే యువత సెల్ఫీల పేరా ప్రమాదం కొని తీర్చుకోవద్దని విష జ్వరాలు ప్రబలకుండా వేడిచేసినా నీటిని తాగాలని, నిల్వ ఉంచిన నీటిని ఉపయోగించాలని తెలిపారు. ఆపత్కాల సమయంలో బీజేపీ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని వార్డులలో గ్రామాలలో పురాతన ఇండ్లలో ఉండు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పోలీస్ సిబ్బంది రెవెన్యూ మునిసిపాలిటీ సిబ్బందితో ఆపత్కాల సమయంలో సహాయ సహకారాలు అందించాలని బీజేపీ పార్టీ నాయకులను కార్యకర్తలను కోరారు.

## భారీ వర్షాలు కురుస్తున్నాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ రాహుల్ రాజ్

**విశ్వంభర, పెద్ద శంకరంపేట :** మెదక్ జిల్లాలో అధిక వర్షాలు కురుస్తున్నాయని అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అన్ని విధాలుగా అండదండలుగా నిలవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ టెలికాన్ ప్రెస్ ద్వారా సమీక్ష నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. అధిక లవర్షాలకు ప్రజలు ఎవరు అధైర్య పడవద్దు జిల్లాలయంత్రాంగం ఎటువంటి సంఘటన జరిగిన ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నదని పేర్కొన్నారు. జిల్లాలో 396 చెరువులు వర్షాల కారణంగా పూర్తిగా నిండినవని పేర్కొంటూ విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు గైకొనాలని అన్నారు. ప్రజలకు ఎటువంటి ఆస్తి నష్టం ప్రాణ నష్టం జరగకుండా పగడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రెవిన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ ఇరిగేషన్, హెల్త్, ఎడ్యుకేషన్, ఎలక్ట్రిసిటీ ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్ సమన్వయంగా పని చేయాలన్నారు. అధిక వర్షాల పై జిల్లాలోని జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ వెంకటేశ్వర్లు తో కలిసి ఆర్డీవోలు,ఎంపీడీవోలు, తాసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్స్ అన్ని శాఖల అధికారులకు టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు.

## పేట శిశు మందిర్‌లో సామూహిక అగ్నిహోత్రం



**విశ్వంభర, పెద్ద శంకరంపేట :** పెద్ద శంకరంపేటలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ లో ఆదివారం విశ్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక అగ్నిహోత్రం హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వ ఫౌండేషన్ వారు మాట్లాడుతూ పర్యావరణానికి పరిరక్షించడానికి అగ్నిహోత్రం హోమాలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాల్లో భాగంగా ప్రతి ఒక్కరూ తమ గృహాల్లో సూర్యోదయం సూర్యాస్తమయం సమయంలో అగ్నిహోత్రం చేయడం వల్ల ఎన్నో లాభాలు ఉంటాయని వివరించారు. విశ్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం అన్ని గ్రామాల్లో అగ్నిహోత్రం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, గ్రామ పెద్దలు, ఆర్ఎస్ఎస్ బాధ్యులు, జహింద్ రెడ్డి సీతారామారావు, వీరప్ప సతీష్ గౌడ్ మల్లేశం, గాండ్ల సంగమేశ్వర్, సర్వేశ్వర్, చంద్రశేఖర్, గ్రామస్తులు సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి వినాయక మండపానికి కేవీఆర్ లడ్డు ప్రసాదం



**విశ్వంభర, కామారెడ్డి :** కామారెడ్డి నియోజకవర్గ పరిధిలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే వినాయక మండపాలకు కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి పంపిణీ చేసే లడ్డు ప్రసాద తయారి పూజా కార్యక్రమం బీజేపీ పట్టణ అధ్యక్షుడు భరత్, బీజేపీ సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి లు చేయటం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా కామారెడ్డి నియోజకవర్గం పరిధిలోని ప్రతి వినాయక మండపానికి కేవీఆర్ లడ్డు ప్రసాదం అందజేయటం జరుగుతుందని, నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసే వినాయక మండపలకు చిన్నా పెద్దా తేడా లేకుండా దాదాపు 3000 మండపలకు పంపిణీ చేస్తామని, వరుసగా 6 వ సంవత్సరం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. హిందువులు జరుపుకునే పండగలను ఉత్సాహంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి గత 6 సంవత్సరాలుగా వినాయక మండపాలకు లడ్డు, దుర్గా మాత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మ వారికి చీర, శ్రీరామ నవమికి శోభాయాత్ర, మాహశివరాత్రి జాగరణ, ఉగాది పర్వదినం సందర్భంగా యెడ్ల బండి ఏర్పాటు ఇలా ప్రతి పండగలో అన్నిటికీ ముందుండి తానై నడిపిస్తున్నారని అన్నారు.

## నిరుపేద ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక చేయూత
### కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటా - తడక రమేష్



**విశ్వంభర,భూదాన్ పోచంపల్లి :** నిరుపేద చేనేత కుటుంబానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థి బేతి జగదీష్ కుమార్ కు ది పోచంపల్లి అర్బన్ బ్యాంక్, టిఆర్ ఫౌండేషన్ ల చైర్మన్ తడక రమేష్ ఆర్థిక సాయం అందించి దాతృత్వం చాటుకున్నారు. పోచంపల్లి పట్టణ కేంద్రంలోని 11వ వార్డ్ లోని రామ్ నగర్ లో నివాసం ఉంటున్న చేనేత కార్మికుడు బేతి మధుసూదన్ న్ భాగ్యవతి దంపతుల కుమారుడు ఎంబీబీఎస్ 3వ సంవత్సరం గాంధీ మెడికల్ కాలేజీ లో చదువుకుంటున్నాడు. ఆర్థిక కారణాల వల్ల చదువుకు ఇబ్బందులు కల్గుతున్నా విషయాన్ని టి ఆర్ యువసేన ద్వారా తడక రమేష్ కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన టిఆర్ ఫౌండేషన్ , పోచంపల్లి బ్యాంక్ ల చైర్మన్ తడక రమేష్ 30 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఎవరికి ఎలాంటి ఆపద వచ్చిన వారిని ఆదుకోవడానికి టిఆర్ ఫౌండేషన్ ఎల్ల వేళలా తొడుంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ యువసేన,కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**విశ్వంభర, రామన్నపేట:** భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామన్నపేట బీజేపీ మండల అధ్యక్షులు, పల్లెపు దుర్గయ్య రామన్నపేట మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాల సమయంలో ప్రతి ఒక్కరూ ఇంట్లోనే ఉండాలని, అత్యవసరమైతేనే బయటకు వెళ్ళాలని, వర్షాల వల్ల తడిసిన కరెంటు స్తంభాలు, విద్యుత్ తీగలు, ఇనుప స్తంభాలు తగలకుండా జాగ్రత్తగా ఉండాలని, ఇంట్లో విద్యుత్ పరికరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు బయటకు రాకుండా చూసుకోవాలని, రైతులు పొలాల్లో విద్యుత్ స్తంభాలు, తీగలకు దూరంగా ఉండాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువలు, వాగుల వద్దకు వెళ్లవద్దని ప్రజలను కోరారు.

# స్కాలర్ షిప్ పంపిణీ



**విశ్వంభర,హైదరాబాద్:** భావ్సర్ క్షత్రియ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ టీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడ సుందర్ నగర్ లోని భావ్సర్ భవన్‌లో స్కాలర్ షిప్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్ లర్ ప్రొఫెసర్ జగదీశ్వర్ బసుత్కర్, బీజేపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.గౌతమ్ రావు, తెలంగాణ భావ్సర్ క్షత్రియ రంగ్రేజ్ సమాజ్ అధ్యక్షురాలు ఉమేష్ ఎ.జైతనే, తెలంగాణ బీకే మహిళా పరిషత్ అధ్యక్షురాలు శ్రీమతి విజయలక్ష్మి సూత్రవే, అశ్విని కుమార్ పటాంగే, అమర్ నాథ్ వౌత్రే, కిషోర్ తాండ్లే, శ్రీధర్ లోఖండే, కృష్ణ క్షిర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు సాహిత్య పరిశోధకుడు డా. కె ముత్యం సంస్మరణ సభ



**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రముఖ తెలుగు సాహిత్య పరిశోధకుడు డాక్టర్ కె ముత్యం సంస్మరణ సభ నారాయణగూడ లోని భరత్ విద్యాసంస్థలో మిత్రులు కుటుంబ సభ్యుల ఆద్వర్వయంలో జరిగింది. ఉస్మానియా ఆర్ట్స్ కాలేజ్ పూర్వ అద్యక్షులుగా పని చేసిన డాక్టర్ ముత్యం బెనారస్ విశ్వవిద్యాలయంలో శ్రీకాకుళ ఉద్యం పై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. తర్వాత శాతవాహన విశ్వవిద్యాలయ అద్యాపకునిగా పనిచేసి పదవీ విరమణ గావించారు. మరుగున పడిన చరిత్రలను వెలుగులోకి తెచ్చి పుస్తకాలు ప్రచురించారు. కార్యక్రంలో యం యల్ సీ కోదండరాం, ప్రముఖ కవులు శివారెడ్డి, నంధిని సిధారెడ్డ్, పొఫెసర్ వినాయక్ రెడ్డి, ఆర్ట్స్ కాలేజ్ పూర్వ అద్యక్షులు తుల రాజేందర్, సూర ప్రభాకర్ రెడ్డి, భరత్ విద్యాసంస్థల అధినేత వేణుగోపాల్ రెడ్డి, మాజీ యంల్ ఏ పటోళ్ల శశిధర్ రెడ్డి, సుధాకర్, జూలూరు గౌరీశంకర్, బండ్ల మాధవ రావు, నాళేశ్వరం శంకర్, సాధినేని వెంకటేశ్వర రావు, పోటు రంగారావు, కుటుంబ సభ్యులు అపర్ణ, ప్రత్యూష, వసంత్, గుల్మహర్ కాలనీ ప్రసిడెంట్ కాశీం, మాజీ సీటీవో అన్వర్ పాషా, ముత్యంగార్ శిష్యులు రమేష్, అక్బర్, విజయ్, చైతన్య, జెయన్టీయు మాజీ రిజిస్ట్రార్ వినయ్ బాబు, ఉన్నత విద్యామండలి చైర్మన్, ప్రొఫెసర్ లింబాద్రి, కె. గోవర్దన్, ఎం శ్రీనివాస్ ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి



**విశ్వంభర, చింతపల్లి:** అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపినందున భారీ వర్షాల నేపథ్యంలో చింతపల్లి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేష్ గౌడ్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్నందున అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దు అని తెలిపారు. గ్రామాలలో పాత ఇండ్లు, గుడిసెలు, శిథిలావస్థలో ఉండే నివాసలలో ఉండే ప్రజలు మరింతగా అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలని, గ్రామాలలో వుండే పెద్దలు తమ పిల్లలను, వాగుల వద్దకి వెళ్లకుండా చూడాలని, వాగులు వంకలలో కూడా నీటి ప్రవాహాలు వచ్చే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాలలో అప్రమతంగా ఉండాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి తెలిపారు. గోరువెచ్చని నీటిని మాత్రమే త్రాగాలని, నిల్వ ఉంచిన నీటిని ఉపయో గించొద్దని సూచించారు. సీజన్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా రైతులు వ్యవసాయ క్షేత్రంలో పనులకు వెళ్ళినప్పుడు విష సర్పాలతో జాగ్రత్త వుండాలని, కాలనీలలో కరెంటు స్తంభాలను తాకవద్దు అని తెలిపారు.

## కానిస్టేబుల్ మల్లయ్యకు కాంగ్రెస్ పార్టీ అండ



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండల పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తూ గత నెల 21న హేడ్ కానిస్టేబుల్ కళ్యాణం మల్లయ్య గుండె పోటుతో మరణించాడు కుటుంబ సభ్యులు ఆదివారం మల్లయ్య సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులుకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి కుటుంబానికి కడ్తాల్ కాంగ్రెస్ పార్టీ తరుపున 30 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బిచ్య నాయక్, చేగురి వెంకటేష్ జాహంగీర్, చందులాల్, జగన్, రవి, తదితరులు పాల్గొన్నారు.

# మన సంస్కృతిపై దాడి చేస్తే ఉపేక్షించకూడదు

■ మాజీ గవర్నర్ చిన్నమనేని విద్యాసాగర్ రావు ■ కుటుంబ వ్యవస్థ తోనే మన భారతదేశానికి ప్రపంచ స్థాయి గుర్తింపు ■ సమతా సమ్మేళన సమితి రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్

**విశ్వంభర, మెట్ పల్లి :** సమత సిద్ధాంతం తోనే భారతదేశానికి ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చిందని మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు అన్నారు. సామాజిక సమర సత్తా వేదిక ఆధ్వర్యంలో జరిగిన అహిల్యాబాయి హెూల్కర్ త్రి శతాబ్ది వేడుకల్లో సాగర్ జి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వివక్ష గురించి మూడు సంవత్సరాల క్రితమే మన దేశంలో బీజం పడిందని కేవలం రాజ్యాంగం వల్ల దేశం ముందుకు వెళ్ళగానే కాలానుగుణంగా రాజ్యాంగాన్ని మార్చుకుంటూ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. దేశ చరిత్ర భారత సంస్కృతి పై ఎవరు దాడి చేసినా మనం ఉపేక్షించకూడదని పిలుపునిచ్చారు. ప్రజల్ని నిరంతరం చైతన్యం చేసే ఇలాంటి సమతా సమ్మేళన సమితి రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్ మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థ తోనే భారతదేశానికి ప్రపంచ స్థాయి గుర్తింపు లభించిందని సామాజిక సమర సతావేదిక లో అన్నారు రామాయణం మహాభారతంలో కూడా కుల విపక్ష లేదని ఆనాడు రాముడు కృష్ణుడు అన్ని వర్గాల ప్రజలతో సమప్రాల్లతమిస్తూ కుటుంబ వ్యవస్థ విలువలు వేల సంవత్సరాల కిందటి నుంచే హిందువులు పాటిస్తున్నారని అలాంటి సంస్కృతి సంప్రదాయాల వల్లనే భారతదేశానికి గుర్తింపు వచ్చిందని మనం మన పిల్లలకి భవిష్యత్తులో కుటుంబ వ్యవస్థ హిందూ సంప్రదాయాలను బోధించాలని అన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ బెజ్జారపు మురళి, కోకన్వీనర్ పోహర్ తుకారాం, రాష్ట్రం మహిళా కన్వీనర్ కార్ల రుక్మిణి, రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్, డాక్టర్ నరేష్ బాబు, మోహన్ రావు, డాక్టర్ వెంకట్ రెడ్డి, మర్రి భాస్కర్, సురభి నవీన్,




హిందూ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నిత్యవసర సరుకులు, ఆర్థిక సహాయం



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండల కేంద్రంలో వెల్జాల్ గ్రామంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎస్సీ కాలనీలోని యాస చెన్నయ్య ఇల్లుకూలిపోయింది. మరో నాలుగు ఇండ్లు శిధిలావస్థలో ఉండడంతో ఆపత్కాల సమయంలో ఒకొక్క కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ బాధితులకు 25 కేజీల బియ్యం నిత్యవసర సరుకులు అందించారు. బీ.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ యాదవ్ ఒకొక్క కుటుంబానికి 1,000 వేయి రూపాయల చొప్పున బాధితులకు జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మూజీ బూర్ రెహమాన్, వైస్ చెర్మన్ కూన రవికుమార్ ద్వారా అందజేశారు. కున శ్రీను, విజయ్ కుమార్, శ్రీకాంత్, యాదయ్య, విజయ్ యాదవ్, సుల్తాన్, శేఖర్, చెన్నయ్య, సాయి పాల్గొన్నారు.

## మానసిక వికలాంగులకు అన్నదానం




**విశ్వంభర,వనస్థలిపురం:** మదర్ తెరిసా చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో వనస్థలిపురంలోని మదర్ ల్యాంప్ లో మానసిక వికలాంగులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు సొసైటీ అధ్యక్షులు చేపూరి శంకర్.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాధలను , వృదులను, మానసిక వికలాంగులను పేదవారిని , బీదవారిని ప్రతి ఒక్కరు ఆదుకోవాలని పుట్టినరోజు కూడా ఇక్కడే జరుపుకోవాలని కోరారు. మదర్ తెరిసా చారిటబుల్ సొసైటీ అధ్యక్షులు చేపూరి. శంకర్గణేష్, రాజు, గణేష్ లింగస్వామి, ప్రసాద్, చైతన్య, రాజశేఖర్, మమత తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** జిల్లాలో భారీ వర్షాలతో చెరువులు, వాగులలో ప్రవాహం ఎక్కువగా వున్నందున ప్రజలు అప్రమత్తంగా వుండాలనీ, అవసరం ఐతే తప్ప బయటకి రావద్దని, రైతులు పొలాల దగ్గరకి వెళ్ళినప్పుడు కరంట్ వైర్ల పట్ల జాగ్రత్తగా వుండాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు ఎస్పీ బోనాల కిషన్ అన్నారు. ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాలతో చిట్యాల మండలం నైన్ పాక, భూపాలపల్లి మండలం మొరంచపల్లిలో భూపాలపల్లి డిఎస్పీ సంపత్ రావు, సీఐ మల్లేశ్ లతో కలిసి మొరంచ వాగు వరదను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, భారీ వర్షాలు కురుస్తుందున విద్యుత్తు స్తంభాలు, వైర్లకు తాకకుండా తగు జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలని అన్నారు. భారీ వర్షాల వల్ల ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, చెరువులు నదుల వద్ద వరద ప్రవాహం అధికంగా ఉందని, వాటి వద్దకి ఎవరు వెళ్లవద్దన్నారు. గోదావరి, మానేరు నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, వాగులు, ప్రాజెక్టుల వద్దకు ప్రజలు, మత్స్యకారులు, ఎవరు కూడా చేపల వేటకు వెళ్లకూడదన్నారు. వర్షం నీటి వల్ల రోడ్డుపై వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదం ఉన్నందున, వరిమిత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. పిల్లలు, యువకులు చెరువులు నది దగ్గరకు సెల్ఫీలు తీసుకోవడానికి, ఈతలు కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. విపత్కర పరిస్థితిలో ప్రజలకు సేవలంచడానికి జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని, ఎటువంటి సహాయం కావాలన్నా 100కి ఫోన్ చెయ్యాలని లేదా స్థానిక పోలీస్ అధికారులకి ఫోన్ చేయాలని అదనపు ఎస్పీ సూచించారు.

## రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న చంద్రుపల్లి వాగు రాకపోకలు బంద్

**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దామెర కుంట, మహాదేవపూర్ మండలం అన్నారం మధ్యలో గల చంద్రుపల్లి వాగు రోడ్డుపై నుంచి ప్రవహిస్తుంది. దీంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

## సహాయం అందించాలి: మంత్రి శ్రీధర్ బాబు



**విశ్వంభర, భూపాలపల్లి :** గత మూడు రోజులుగా ఏడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పెద్ద పల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మరియు మంథని నియోజకవర్గ లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు పాటించాలి అని మంత్రి శ్రీధర్ బాబు కోరారు. భారీ వర్షాలు వరద నీటి ప్రవాహాల వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అన్ని విధాల సహాయ సహకారాలను అందించాలని జిల్లా కలెక్టర్ల, జిల్లా అధికారులు పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల సందర్భంగా పట్టణ ప్రజలు, మారుమూలప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా శిథిలావస్థలో ఉండి కూలిపోయే పరిస్థితిలో ఉన్న ఇండ్లలో ఉండేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వాగులు చెరువుల నీరు చేరే అవకాశం ఉన్న లోతట్టు గ్రామాల ప్రాంత ప్రజలను గుర్తించి వారిని సురక్షిత ప్రదేశాలకు అధికారులు వెంటనే తరలించాలని, ప్రజలకు ఇలాంటి ముప్పు రాకుండా వారికి ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలతో మంచి సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని ప్రతి జిల్లా అధికారి హెడ్ క్వార్టర్ లో ఉండాలని, రోడ్లపై వరద నీటిని ఎప్పటికప్పుడు స్థానిక సిబ్బంది చే క్లియర్ చేయాలని, విద్యుత్, నీటి సరఫరా ఎప్పటికప్పుడు పునరుద్ధరణ చేయాలని, అధికారులను ఆదేశించారు. చెరువులు, కాలువలు, కుంటల వద్ద ఏలాంటి ప్రమాదాలు జరగకుండా నీటి ప్రవాహం ఉన్నచోట రాకపోకలపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. మరి ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు ట్రాన్స్ఫార్మర్లు ఉన్నచోట జాగ్రత్త వహించాలని, ఐరన్ విద్యుత్ స్తంభాలు ఉన్నచోట విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు తగిన సూచనలు అందించాలని కోరారు. గోదావరినది పరివాహక ప్రాంతాల్లో, కాలువలు చెరువుల ప్రాంతాల్లో పశువులను, మేకలను మేపడానికి, చేపలు వేటకు గాని ఎవరు వెళ్ళవద్దు అని కోరారు. ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ శాఖ పరంగా తగిన ఏర్పాట్లతో ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని ప్రజలు ప్రభుత్వ అధికార యంత్రాంగానికి సంపూర్ణంగా సహకరించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అని కోరారు.

## ఇద్దరు వ్యక్తులను కాపాడిన స్థానికులు



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని లంబడి తండా రోడ్ డ్యాం వద్ద ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై ప్రవాహాన్ని దాటుతుండగా వరద ఉధృతి పెరిగి అందులో కొట్టుకుపోయారు. ఇది గమనించిన కొందరు యువకులు వారిరువుని కాపాడి ఒడ్డుకు చేర్చారు. దీంతో గ్రామస్తులు స్థానికులు వారిని అభినందించారు.

## దుర్గా భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వాన కవర్ల పంపిణీ




**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్ మున్సిపాలిటీలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మున్సిపల్ కార్మికులు ఆ భారీ వర్షంలోనే పని చేయటం చూసిన శ్రీ దుర్గా భవాని ఉత్సవ కమిటీ సభ్యులు అమనగల్లు మున్సిపాలిటీ కార్మికులకు వాన కవర్లు పంచిపెట్టారు. పట్టణంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిడిశెట్టి ప్రవీణ్, మన్న మురలీధర్, పాతకోట శ్రీశైలం, టిల్లు యాదవ్, మధు, కుమార్ గౌడ్, సాయి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ బోనాల జాతర

**విశ్వంభర, నారాయణపూర్ :** సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర రజక సహకార సంఘం, శ్రీ చెలిమి ముత్యాలమ్మ దేవస్థానం, మడివాల మాచిదేవుడు బోనాల సందర్భంగా హెూమ కార్యక్రమం అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ ఉప్పల లింగస్వామి, శ్రీ వెంకటేశ్వర రజక సహకార సంఘం అధ్యక్షులు ఉప్పల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి పున్నం యాదగిరి, గోల్కొండ అంజయ్య, ఉప్పల యాదగిరి, రాచకొండ లక్ష్మణ్, రాచకొండ రమేష్, రాచకొండ చిన్నా రమేష్, ఉప్పల రవి, ఉప్పల రఘు, ఉప్పల సురేష్, ఉప్పల ఉదయ్ కుమార్, పున్నం కృష్ణ, రాజు, ఉప్పల మణిదీప్, ఏపూరి యోగి, రాచకొండ అఖిల్, నిఖిల్, ఉప్పల ప్రణయ్, శశి తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల దృష్ట్యా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:ఎస్సై ఎస్ కృష్ణయ్య



**విశ్వంభర,ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల ఎస్సై ఎస్ కృష్ణయ్య మాట్లాడుతూ శనివారం సాయంత్రం నుండి వర్షాలు కురుస్తున్నందున రాబోయే మూడు రోజుల్లో భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపి నందుకు గాను మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే పోలీస్ శాఖ వారికి వెంటనే తెలియజేయాలని తెలిపారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం ఖప్రాయపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త రెడ్డిగట్టు సుధాకర్ అనారోగ్యంతో మరణించగా బీఆర్ఎస్ గ్రామశాఖ మృతుని కుటుంబాన్ని పరామర్శించి, వారికి తాజా మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి సహకారంతో రూ.5000/-లు ఆర్థిక సహాయం అందించటం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు కొంగరి మైసయ్య, ప్రధాన కార్యదర్శి గాధగాని ముత్యం, జిల్లా నాయకులు కాంభోజు భానుప్రకాష్, నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి నూనేముంతల విజయ్, నాయకులు కొంగరి యాదగిరి, రషీద్, దోనాల వీరారెడ్డి, కోట ఉపేందర్, అకిరెడ్డి శ్రావణ్, పోరండ్ల శెట్టయ్య, షాభుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లాలో రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. కాబట్టి తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, తడిచిన చేతులతో కరెంట్ స్విచ్ బోర్డులను, కరెంట్ స్తంభాలను తాకవద్దు. రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో పొంగి పొర్లుతున్న చెరువులను, వాగులను చూడటానికి బయటికి వచ్చి ప్రమాదాల బారిన పడవద్దని, సెల్ఫీల పేరిట ప్రమాదం కొని తెచ్చుకోవద్దని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. ఈ సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్పర్సన్ బండ్రు శోభరాణి భాస్కర్ తెలిపారు.

## పేకాట స్థావరాలపై దాడి

**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ గ్రామంలో ఆదివారం కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని మహాదేవపూర్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే మహాదేవపూర్ ఎస్ఐ సిబ్బందితో మహదేవపూర్ గ్రామానికి చెందిన ఆకుల రాజ్ కుమార్ ఇంట్లో 7 గురు వ్యక్తులు పేకాట ఆడుతూ కనిపించారు. పోలీసులను చూసి పారిపోతుండగా వారందరిని పట్టుకొని వారి దగ్గర నుండి 2,090 రూపాయల నగదు స్వాధీనం చేసుకొని ఏడుగురిపై కేసు నమోదు చేశారు.

## ఉమా సంగమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు




**విశ్వంభర, పెద్ద శంకరంపేట్ :** పెద్ద శంకరంపేట మండల పరిధిలోని కొప్పల్ ఉమా సంగమేశ్వర స్వామి ఆలయంలో గర్భగుడిలో కాశీ బుగ్గ నీరు రావడంతో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాశీ నుండి నేరుగా కొప్పల్ ఉమా సంగమేశ్వర స్వామి గర్భాలయంలోకి ప్రత్యేకంగా నీరు రావడానిని కాశీబుగ్గ అని ఇక్కడి ప్రాంత భక్తుల నమ్మకంగా పేర్కొంటున్నారు. ఆదివారం కొప్పల్ ఉమా సంగమేశ్వర స్వామి గర్భాలయంలో కాశిబుగ్గ రావడంతో భక్తులకు తీర్థంగా ఇచ్చినట్లు ఆలయ పూజారి సంగప్ప తెలిపారు. దాదాపు గత పది సంవత్సరాల క్రితం కాశిబుగ్గ వచ్చిందని ఈ సంవత్సరం శ్రావణమాసంలో కాశీబుగ్గ వచ్చిందని పూజారులు పేర్కొన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయడంతో పాటు కీర్తనలు భజనలు చేస్తున్నారు. ఆలయంలో భక్తులందరికీ కల్హేర్ మండలానికి చెందిన గుర్రపు మచ్చేందర్ ఫౌండేషన్ చైర్మన్ గ్రూపు మధ్యందం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## కూలిపోయిన ఇండ్ల బాధితులను ఆదుకుంటాం




**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని 15వ వార్డు శివాలయం నగర్, ఉదయ్ నగర్ కాలనీలలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మట్టి ఇండ్లు కూలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ మున్సిపల్ అధికారులకు, తహసిల్దార్ కార్యాలయానికి సమాచారం అందించారు. ఈ మేరకు మున్సిపాలిటీ కమిషనర్ వసంత ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, ఆర్ఐ చెన్న కేశవులులతో కలిసి ఇండ్లను పరిశిలించారు. సందర్భంగా కూలిపోయిన మట్టి మిద్దెలు చెరుకు అమృత, గుర్రం బుచ్చయ్య, సాకలి యాదయ్య, సాకలి రాజు, యజమానులుగా ఇళ్లను తక్షణమే ఖాళీ చేయాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా బాధితులను ఆదుకుంటామని వారు భరోసా ఇచ్చారు. కౌన్సిలర్ చెన్నకేశవులు, మున్సిపల్వార్డుఆఫీసర్లు,మేనేజర్సత్యనారాయణ,రామకృష్ణ,షర్ఫుద్దీన్,మహబూబ్ తదితరులున్నారు.

## జాగ్రత్తలు పాటించండి - ఎస్సై పి.మల్లయ్య



**విశ్వంభర, రామన్నపేట:** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రామన్నపేట మండల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని రామన్నపేట ఎస్సై పి.మల్లయ్య మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తడిచిన విద్యుత్ స్తంభాలను తడ చేతులతో స్టార్టర్లు, మోటార్లు, స్విచ్ బోర్డులు ముట్టుకోవద్దని, విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్లను ముట్టుకోవద్దని, చిన్నపిల్లలు కరెంటు వస్తువుల జోలికి రాకుండా చూసుకోవాలని, ఇనుప తీగలపై దుస్తులు ఆరబెట్టుకోవద్దని, ఏమైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే తక్షనమే పోలీస్ శాఖకు తెలపాలని రామన్నపేట ప్రజలను కోరారు.

## రామన్నపేటలో మదర్సా విద్యార్థి మిస్సింగ్



**విశ్వంభర, రామన్నపేట:** రామన్నపేటలోని దారుల్-ఉలూం- హుస్సేనియా మదర్సాలో 18 ఆగస్టు 2024న మొహమ్మద్ అమీనుద్దీన్ కుమారుడు విద్యార్థి మొహమ్మద్ మొయినుద్దూన్ ఖాన్ (20) తప్పిపోయాడని, పనిచేసే ఉపాధ్యాయుడు మొహమ్మద్ సయ్యద్ అన్వర్ రామన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని కోసం సాధ్యమైన అన్ని ప్రదేశాలలో వెతికామని, అతని తల్లిదండ్రులకు కూడా సమాచారం ఇచ్చామని, కానీ తమ ప్రయత్నం ఫలించలేదని, తప్పిపోయిన సమయంలో, విద్యార్థి బ్రౌన్ కలర్ లాల్చీ, వైట్ కలర్ పైజామా ధరించాడని, అతను 5 అడుగుల 10 అం గుళాల ఎత్తు మరియు ఉర్దూ, ఇంగ్లీష్ మాట్లాడతాడని తన ఫిర్యాదులో తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉండాలి : మంత్రి పొన్నం

- సమస్యలపై సత్వరమే పరిష్కరించాలి
- భారీగా వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాలో బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలి
- జిల్లాల యంత్రాంగంతో మంత్రి పొన్నం సమీక్ష



**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రానికి మరో రెండు రోజుల పాటు వర్ష సూచన ఉండటంతో అన్ని జిల్లాల యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై సత్వరమే స్పందించాలని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. రోడ్ల పై భారీగా వరద నీరు ప్రవహించే ప్రాంతాలను గుర్తించి, అక్కడకు ప్రజలు వెళ్లకుండా బ్యారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. భారీగా వరద నీరు వస్తున్న వివిధ ప్రాజెక్టుల వద్ద ఎప్పటికపుడు అధికారులు ఇన్ ఫ్లో, దానికి తగిన విధంగా ఔట్ ఫ్లో ఉండేలా చర్యలు తీసుకోవటంతో పాటు దిగువ ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికపుడు పరిశీలించాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలనీ సూచించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని. ఎక్కడ ఇబ్బంది ఉన్న వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ఉదయం నుండి కరీంనగర్ కార్యాలయం నుండి జీహెచ్ఎంసీ,సిద్దిపేట , కరీంనగర్ , హనుమకొండ ,సిరిసిల్ల జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ జిల్లా అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ అప్రమత్తం చేస్తూ, వర్షంతో ప్రజలెదుర్కొంటున్న ఇబ్బందుల నివారణకు చేపట్టిన చర్యలపై అధికారులతో ఆరా తీశారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి, జిల్లా పోలీస్ కమిషనర్, ఇతర అధికారులతో మంత్రి పొన్నం మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాలు కురిసినందున అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సిద్దిపేట - హనుమకొండ వెళ్ళే రోడ్డు పై భారీగా వరద నీరు పోతుండటంతో అక్కడ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దాంతో పాటు అటువైపు ఎవరు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వరదల్లో రోడ్డుపై ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లవద్దని ప్రజలకు సూచించారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం రామచంద్రాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బొబ్బల కనుక రెడ్డి వరద కాలువ కెనాల్ ప్రవాహంలో గల్లంతు అయినట్లు అధికారులు వెల్లడించారు. ఆవు కోసం వెళ్లి కనకారెడ్డి గల్లంతు అయ్యారనీ రైతు కనకారెడ్డి ఆచూకీ కోసం తక్షణమే ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. రైతులు జాగ్రత్తగా ఉండాలనీ. వర్షాలు తగ్గిన తర్వాతనే పొలం దగ్గరకు వెళ్ళాలని, వరద నీరు ఉన్న వైపు వెళ్ళరాదు. వరదల్లో ఎవరు చేపలు పట్టడానికి వెళ్ళరాదనీ తెలిపారు.

**సిటీలో సహాయక చర్యలపై ఆరా .....**

హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి గా పొన్నం ప్రభాకర్ ఆదివారం నగరంలో కొనసాగుతున్న వర్షం సహాయక చర్యలపై కూడా ఆరా తీశారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, నగర పోలీసు కమిషనర్ కే. శ్రీనివాస్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి లతో ఎప్పటికప్పుడు గ్రేటర్ హైదరాబాద్ లో తాజా పరిస్థితి పై ఆరా తీశారు. జంట జలాశయాలు హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ లలో తాజా పరిస్థితి పై అడిగి తెలుసుకున్నారు. కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రాజెక్ట్ లో నీటి వివరాలు జిల్లాలో తాజా పరిస్థితి పై అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ , మేడిపల్లి సత్యం లతో కలిసి స్వయంగా లోయర్ మానేర్ డ్యాం పరిశీలించారు. జిల్లాలో వరద పరిస్థితి పై ఆరా తీశారు. జన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ జా ,ఎస్పీ అఖిలేష్ మహజన్ ఇతర అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షించారు. మిడ్ మానేరు కు వస్తున్న వరద అప్పర్ మానేరు డ్యాం లో తాజా పరిస్థితి పై ఆరా తీశారు. జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అధికారులంతా క్షేత్ర స్థాయిలో ఉండాలని మంత్రి ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య ఇతర అధికారులతో ఎప్పటికప్పుడు తాజా పరిస్థితిపై సమీక్షించారు. జిల్లాలో భారీ వర్షాలు కురిసినా నేపథ్యంలో రోడ్డు పై భారీగా వర్షపు నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

# అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు

- క్షేత్ర స్థాయిలో 610 ఎమర్జెన్సీ బృందాలు
- పురపాలక శాఖ సిబ్బందికి సెలవులు రద్దు
- అధికారులంతా ఫీల్డులోనే ఉండాలి
- సిటీలో పర్యటించిన మున్సిపల్ శాఖ చీఫ్ సెక్రెటరీ



**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రానికి మరో రెండు రోజుల పాటు భారీ వర్షసూచన ఉండటంతో హైదరాబాద్ మహానగర వాసులు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని మున్సిపల్ శాఖ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్ సూచించారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా నగరంలో సహాయక చర్యలు, శానిటేషన్, జలాశయాలు, చెరువుల్లోకి వస్తున్న వరద నీటి ఉద్ధృతి అంశాలపై ఆయన ఆదివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. సాగర్ క్షేత్ర పరిస్థితిని, అశోక్ నగర్, విద్యా నగర్, పద్మా కాలలోని నాలా లను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. దాన కిషోర్ రోడ్లపై నీరు నిల్వకుండా, వర్షం కురుస్తున్న సమయంలో సహాయకం కోసం వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జీహెచ్ఎంసీ, జలమండలి, హెచ్ఎండీఏకు చెందిన మొత్తం 610 టీమ్ లు 24 గంటలు విధి నిర్వహణలో ఉన్నట్లు వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి మున్సిపల్ యంత్రాంగానికి సహకరించాలని సూచించారు. మొత్తం పురపాలక శాఖ సిబ్బందికి సెలవులను రద్దు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా తనతో మాట్లా డారని, వర్షాల గ్రేటర్ లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ సిబ్బంది మొత్తం ఫీల్డ్ లో ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు. రెవెన్యూ మంత్రి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్ష పరిస్థితులపై రివ్యూ చేశారని తెలిపారు. ఆదివారం సెలవు రోజు కావడంతో నగరంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాలేదన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం నాడు ముందస్తుగా గ్రేటర్ పరిధిలోని విద్యా సంస్థలకు కలెక్టర్ లు సెలవులు ప్రకటించారని చెప్పారు. భారీ వర్షాల వల్ల ఎదురయ్యే ఇబ్బందులు, సమస్యలను త్వరితగతిన పరిష్కారం చూపేందుకు జీహెచ్ఎంసీ, జలమండలి, హెచ్ఎండీఏ కు చెందిన 610 అధికారిక బృందాలు పని చేస్తున్నాయని వివరించారు. అల్లాపూర్, కూకట్లపల్లి మినహా గ్రేటర్ లో చిన్న చిన్న ఇబ్బందులు తప్ప ఎలాంటి పెద్ద ఘటనలు రిపోర్టు కాలేదని దాన కిషోర్ తెలిపారు. అల్లాపూర్, కూకట్ పల్లి ఏరియాలో 20 ఇళ్లు నీట మునిగినట్టు సమాచారం వచ్చిందన్నారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని తెలిపారు. పురాతన, శిథిలావస్థకు చేరిన గోడలు కూలి ప్రజలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉన్న దృష్ట్యా అలాంటి ప్రదేశాలను గుర్తించాల్సిందిగా డిప్యూటీ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించామని తెలిపారు. హుస్సేన్ సాగర్ నుండి ప్రస్తుతం 10, 400 క్యూసెక్కుల నీరును కిందికి వదులుతున్నామని తెలిపారు. లోతట్టు పాంత ప్రజలను అప్రమత్తం చేశామని చెప్పారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాల పూర్తి స్థాయి నీటిమట్టం చేరుకునేందుకు ఇంకా 8 అడుగులు గ్యాప్ ఉన్నట్లు, రిజర్వాయర్లలోకి వస్తున్న వరద నీటిని ఎప్పటికపుడు పర్యవేక్షిస్తున్నట్లు, ఎప్పటికపుడు అవసరమైన చర్యలు చేపట్టేందుకు సిబ్బంది సిద్దంగా ఉన్నట్లు ఆయన వివరించారు.

## పెద్ద ఎత్తున రైళ్లను రద్దు చేసిన దక్షిణ మధ్య రైల్వే

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:** తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు వాగులు వంకలు ఒప్పొంగి ప్రవహిస్తున్నాయి. వరదల నేపథ్యంలో రైళ్ల రాకపోలపై తీవ్ర ప్రభావం చూపుతోంది మహబూబాబాద్ జిల్లా కేస ముద్రం మండలం తాళ్లపూసపల్లి, ఇంటికన్నె మధ్య రైల్వేట్రాక్ కింద మట్టి కోతకు గురైంది. పట్టాల కింద నుంచి భారీగా వరద ప్రవహిస్తున్నది. ఈ క్రమంలో ఆ మార్గంలో అధికారులు రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. వర్షాల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో దాదాపు 40 రైళ్లు వరకు రద్దయ్యాయి. అదే సమయంలో పెద్ద ఎత్తున రైళ్లను అధికారులు దారి మళ్లించారు. సికింద్రాబాద్-విశాఖపట్నం (12728) గోదావరి ఎక్స్‌ప్రెస్‌ను కొండపల్లి రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. ప్రయాణికులను రాయన్‌పాడు నుంచి విజయవాడ స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి ప్రత్యేక రైలులో విశాఖపట్నానికి ప్రయాణికులను తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



రద్దయిన రైళ్లు ఇవే..

| | |
|---|---|
| రైలునం. 12728, హైదరాబాద్ - విశాఖపట్నం | రైలు నం. 03242, బెంగళూరు - దానాపూర్ |
| రైలునం. 12727, విశాఖపట్నం- హైదరాబాద్ | రైలు నం. 12737, కాకినాడపోర్ట్ - లింగంపల్లి |
| రైలు నం. 12738, లింగంపల్లి - కాకినాడపోర్ట్ | రైలు నం. 12707, గూడూరు -సికింద్రాబాద్ |
| రైలునం. 12739, విశాఖపట్నం- సికింద్రాబాద్ | రైలు నం. 17033, భద్రాచలం - బల్లర్షా |
| రైలునం. 12740, సికింద్రాబాద్ - విశాఖపట్నం | రైలు నం. 17004, బల్లర్షా - కాజీపేట |
| రైలునం. 12745, సికింద్రాబాద్ - మణుగూరు | రైలు నం. 17660, భద్రాచలం - సికింద్రాబాద్ |
| రైలునం. 12746, మణుగూరు - సికింద్రాబాద | రైలు నం. 17659, సికింద్రాబాద్ - భద్రాచలం |
| రైలునం. 12749, మచిలీపట్నం- బీదర్ | రైలు నం. 07753, కాజీపేట - డోర్నకల్ |
| రైలునం. 12750, బీదర్ - మచిలీపట్నం | రైలునం. 18046, హైదరాబాద్ - షాలిమార్ |
| రైలునం. 12759, తాంబరం - హైదరాబాద్ | రైలునం. 20707, సికింద్రాబాద్ - విశాఖపట్నం |
| రైలునం. 12860, హైదరాబాద్ - తాంబరం | రైలునం. 20708, విశాఖపట్నం - సికింద్రాబాద్ |
| రైలునం. 18519, విశాఖపట్నం - లోకమాన్య తిలక్ | రైలు నం. 12704, సికింద్రాబాద్ - హౌరా |
| రైలునం. 12861,విశాఖపట్నం - మహబూబ్‌నగర్ | రైలు నం. 12703, హౌరా - సికింద్రాబాద్ |
| రైలు నం. 12775, కాకినాడపోర్ట్ - లింగంపల్లి | రైలునం. 17230,సికింద్రాబాద్- తిరువనంతపురం |
| రైలు నం. 12776, లింగంపల్లి -కాకినాడపోర్ట్ | రైలునం. 17229,తిరువనంతపురం- సికింద్రాబాద్ |
| రైలు నం. 07013, సికింద్రాబాద్ - బనరాస్ | రైలునం. 12862,మహబూబ్‌నగర్- విశాఖపట్నం |
| రైలు నం. 07014, బనారస్ - సికింద్రాబాద్ | రైలునం. 17058,లింగంలపల్లి-ఎస్‌టీఎం ముంబయి |
| రైలు నం. 07632, నర్సాపూర్ - హైదరాబాద్ | రైలు నం. 17057, సీఎస్‌టీ - లింగంపల్లి |
| | రైలు నం. 12762, కరీంనగర్ - తిరుపతి |

## కేంద్ర ప్రభుత్వం తరపున పూర్తి స్థాయిలో సహాయసహకారాలు అందిస్తాం: ప్రధాని మోదీ



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రధాని నరేంద్రమోదీ ఫోన్ చేశారు. రాష్ట్రంలో కురుస్తోన్న వర్షాలు, వరద పరిస్థితులు, వాటిల్లిన నష్టం పై అడిగి తెలుసుకున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తోన్న వర్షాలు, వరదలతో వాటిల్లిన నష్టాలు, రాష్ట్రంలో తాజా పరిస్థితులపై సీఎం.. ప్రధానికి వివరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ప్రాణ నష్టం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తక్షణ సహాయక చర్యలను రేవంత్ రెడ్డి ప్రధానికి వివరించారు. వరదల కారణంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎక్కువ నష్టం సంభవించిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ప్రాణ నష్టం లేకుండా అప్రమత్తంగా వ్యవహరించి ముందస్తు చర్యలు తీసుకు న్నందుకుగాను రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రధాని అభినందించారని సీఎంఓ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో అత్యవసర సేవలు అందించేందుకు హెలికాప్టర్లను పంపిస్తామని ప్రధాని హామీ ఇచ్చారని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం తరపున పూర్తి స్థాయిలో సహాయసహకారాలు అందిస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని సీఎంఓ ప్రకటనలో పేర్కొంది.

## రెచ్చిపోయిన జనసైనికులు.. పేర్ని నాని కారుపై రాళ్ల దాడి

**విశ్వంభర, గుడివాడ:** కృష్ణా జిల్లా గుడివాడలో జనసేన కార్యకర్తలు రెచ్చిపోయారు. మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని కారుపై రాళ్ల దాడికి తెగబడ్డారు. దీంతో గుడివాడలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.గుడివాడలోని వైసీపీ నేత తోట శివాజీ ఇంటికి పేర్ని నాని ఆదివారం వచ్చారు. నాని రాక గురించి తెలుసుకున్న జన సైనికులు అక్కడికి చేరుకున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నానికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. ఈ క్రమంలోనే ఆగ్రహానికి గురైన జన సైనికులు పేర్ని నానిపై కోడిగుడ్లు విసిరారు. ఈ ఘటనతో పేర్ని నాని గుడివాడ నుంచి వెనుదిరిగారు. అదే సమయంలో మరికొందరు కారుపై రాళ్ల దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో పేర్ని నాని కారు అద్దాలు ధ్వంసమయ్యాయి.గుడివాడలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో అప్రమత్తమైన పోలీసులు జన సైనికులను అదుపులోకి తీసుకున్నారు. పలువుర్ని అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేయగా.. మిగతా జన సైనికులు పోలీసుల వాహనాలకు అడ్డుపడ్డారు. దీంతో పోలీసులు, జనసైనికుల మధ్య వాగ్వాదం నెలకొంది.

సింగూరు, నిజాంసాగర్ ప్రాజెక్టులూ నింపాలి

## ఇరిగేషన్ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

**విశ్వంభర, హైదరాబాద్ :**ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వరదనీటిని రోజుకు ఒక టీఎంసీ చొప్పున ఎత్తిపోయాలని సీఎం రేవంత్‌రెడ్డి సాగునీటిపారుదలశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా లిఫ్ట్ చేసి రిజర్వాయర్లు నింపాలని పేర్కొన్నారు. మిడ్‌మానేరు, లోయర్ మానేరు, రంగనాయక్ సాగర్, మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్ జలాశయాల వరకు ఏకధాటిగా నీటిని లిఫ్ట్ చేయాలని సూచించారు.సింగూర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల వరకు నీటిని తరలించాలని తెలిపారు. మల్లన్నసాగర్‌లో గరిష్ఠంగా 20 టీఎంసీలు, కొండపోచమ్మ సాగర్‌లో 10 టీఎంసీల నీటిని నిల్వ చేయాలని పేర్కొన్నారు.

## సూర్యాపేట మీదుగా విజయవాడ.. ప్రయాణం రద్దు చేసుకోవాలి: ఎస్పీ



**విశ్వంభర, సూర్యాపేట:** కోదాడ మండలం నల్లబండగూడెం వద్ద పాలేరువాగు ఉదృతికి జాతీయ రహదారిపై నీరు చేరింది. దీంతో హైదరాబాద్- విజయవాడ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. సూర్యాపేట మీదుగా.. ఖమ్మం, విజయవాడ వెళ్లే ప్రజలు ప్రయాణం వాయిదా వేసుకోవాలని సూర్యా పేట ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. సూర్యాపేట నుంచి ఖమ్మం వెళ్లే మార్గంలో నాయకినిగూ డెం వద్ద పాలేరువాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోందని తెలిపారు. రక్షణ చర్యల్లో భాగంగా ఈ మార్గంలో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిపివేసినట్టు ఎస్పీ చెప్పారు.

## ఖమ్మం జిల్లా పాలేరులో విషాదం.. ప్రవాహంలో దంపతుల గల్లంతు



**విశ్వంభర, కూసుమంచి:** భారీ వర్షం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెంలో తీవ్ర విషాదం నింపింది. పాలేరు వాగులో చిక్కుకున్న కుటుంబంలో దంపతులు గల్లంతయ్యారు. ప్రవాహంలో కొట్టుకుపోతున్న మరో యువకుడుని స్థానికులు, పోలీసులు రక్షించారు. పాలేరు అలుగు సమీపంలో ఉన్న సిమెంటు ఇటుకల తయారీ కర్మాగారంలో ఓ కుటుంబం నివసిస్తోంది. పాలేరు జలాశయానికి ఆదివారం తెల్లవారుజాము నుంచి వరద పోటెత్తడంతో షేక్ యాకుబ్, భార్య సైదాబి, కుమారుడు షరీఫ్ వరదల్లో చిక్కుకుపోయారు. వరద ఉద్ధృతి పెరగడంతో ప్రవాహంలో గల్లంతయ్యారు. కొట్టుకుపోతున్న షరీఫ్ను స్థానికులు, పోలీసులు కాపాడారు. దంపతుల కోసం గాలింపు కొనసాగుతోంది.

## జల దిగ్బంధంలో అర్వపల్లి కేజీబీవీ.. ఫంక్షన్ హాల్‌లో తలదాచుకున్న విద్యార్థులు



**విశ్వంభర, అర్వపల్లి :** భారీ వర్షాలకు సూర్యాపేట జిల్లా జాజిరెడ్డి గూడెం మండలం అర్వపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం జల దిగ్బంధమైంది.పాఠశాల ఆవరణ మొత్తం నుడుం లోతు వరకు నీళ్లు నిలిచాయి. సుమారు 200 మంది విద్యార్థులు, ఉపాధ్యా యులు అడుగు బయటపెట్టలేని పరిస్థితి నెలకొనడంతో అధికారులతో ఆదేశాలతో తాత్కాలింగా విద్యార్థు లను అక్కడ నుంచి తరలించి శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో సర్దుబాటు చేశారు. తల్లిదండ్రులకు సమాచారం అందించి కొందరిని ఇంటికి పంపించారు.

## మున్నేరు ఉగ్రరూపం.. తిరుపతమ్మ ఆలయం వద్దకు వరద



**విశ్వంభర, పెనుగంచిప్రోలు:** ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు వద్ద మున్నేరు వాగు ఉగ్రరూపం దాల్చింది. భారీగా వరద నీరు ఒక్కసారిగా పోటెత్తింది. స్థానిక తిరుపతమ్మ ఆలయ పరిసరాల్లోకి వరద చేరింది. దీంతో అక్కడి దుకాణాలు నీట మునిగాయి. వ్యాపారులు సామగ్రిని వదిలేసి బయటికి వచ్చారు. మరోవైపు ఆలయ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న కేశఖండనశాల, శౌచాలయం, డార్మెటరీ నిర్మాణాల్లోకి వరద నీరు చేరింది.ఆలయం పక్కనే ఉన్న బోస్పేట, ఎస్సీ కాలనీలోని వందలాది ఇళ్లు నీట మునిగాయి. అధికారులు వారికి దేవస్థానం సత్రాల్లో పునరావాస సౌకర్యం కల్పించారు. వరద ఇలాగే కొనసాగితే మరిన్ని దుకాణాలు నీట మునిగే అవకాశం ఉంది. ఆలయ అధికారులు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది ఆలయం వద్ద పహారా కాస్తూ వరద పరిస్థితిని అంచనా వేస్తున్నారు. ఆలయానికి కొద్ది దూరంలో ఉన్న వంతెన పూర్తిగా నీట మునిగింది. వరద ప్రవాహం గంట గంటకూ పెరుగుతున్న నేపథ్యంలో దేవస్థానం వద్ద ఉన్న వ్యాపారులు భయాందోళన చెందుతున్నారు. పెనుగంచిప్రోలు నుంచి అనిగండ్లపాడు, రేవులగడ్డ వైపు వెళ్లే మార్గంలో భారీగా వరద చేరడంతో అక్కడి వంతెన నీట మునిగింది.

## తెలంగాణ-ఏపీ మధ్య నిలిచిన రాకపోకలు

### అంతర్రాష్ట చెక్‌పోస్ట్ వద్ద భారీగా నిలిచిన వాహనాలు

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:** తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు ఎడతెరపిలేకుండా కురుస్తున్నాయి .దీంతో వాగులు వంకలు పొంగుతున్నాయి. ఈ క్రమంలో పలుచోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తెలంగాణ ఏపీ సరిహద్దు రామాపురం వద్ద చిమిర్యాల వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. కోదాడ నుంచి వరదనీరు దిగువకు ప్రవహిస్తోంది. నల్లబండగూడెం వద్ద జాతీయ రహదారిపైకి నీరు చేరడంతో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఇక ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం ఐతవరం గ్రామం వద్ద జాతీయ రహదారిపై మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. హైవేపై మోకాళ్ల లోతు వరద ఉండడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

# తెలంగాణలో భారీ వర్షాలకు 9 మంది మృతి





**విశ్వంభర .తెలంగాణ బ్యూరో: తెలంగాణలో వర్షాలు భారీగా కురుస్తున్నాయి. భారీ వర్షాలు, వరదల కారణంగా ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాష్ట్రంలో 9 మంది మృతి చెందినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. భారీ వర్షాలకు మున్నేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో ఖమ్మంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.**

పలు ఆపార్ట్‌మెంట్‌లలోని సెల్లార్లు వరద నీటితో నిండాయి. రహదారులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. భారీగా ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఏపీ, తెలంగాణ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. తెలంగాణలో ఎడతెరపి లేకుడా వర్షాలు పడుతున్నాయి. అన్ని జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. కుండపోత వాన తో చెరువుల నిండిపోయాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతు న్నాయి. హైదరాబాద్ పరిధిలోని అన్ని చెరువులూ నిండుకుండల్లా మారిపోయాయి. పలుచోట్ల వర్ష సంబంధ ఘటనల్లో మరణాలు కూడా సంభవిస్తున్నాయి. అధికార యంత్రాంగ అప్రమ త్తంగా ఉన్నప్పటికీ కొన్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

**విలేకరుల సమావేశంలోనే కంటతడి పెట్టిన మంత్రి పొంగులేటి :** శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి తన నియోజకవర్గమైన పాలేరులోని కూసుమంచి మండలం నాయకన్ గూడెంకు చెందిన ఇటుకలపని చేసుకునే యాకూబ్ ఆయన భార్య సైదా వరదల్లో కొట్టుకొనిపోవడం పట్ల రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఉదయం నుంచి ఆ కుటుంబాన్ని రక్షించేందుకు మంత్రి చేసిన ప్రయత్నమంటూ లేదు. విలేకరుల సమావేశం జరుగుతున్న సమయంలోనే యాకూబ్ కుటుంబం వరదల్లో కొట్టుకుపోయిందని సమాచారం అందడంతో ఆ కుటుంబాన్ని ఇంకా ఆ భగవంతుడే కాపాడాలని భావోద్వేగానికి గురయ్యారు. వరద నీటిలోనైనా వారిని రక్షించాలని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ముగ్గురిలో ఒకరిని కాపాడగలిగారు. అన్ని ఉన్నా కూడా వాతావరణం అనుకూలించక వారిని రక్షించుకోలేకపోయానంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్లోని డా.బీ.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో భారీ వర్షాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై విలేకరుల సమావేశంలో మాట్లాడుతుండగా యాకూబ్ కుటుంబం వరదలో కొట్టుకుపోయిన సమాచారం అందడంతో ఒక్కసారిగా ఖిన్నుడయ్యారు. ఒక దశలో నిమిషంపాటు మాటరాని పరిస్థితికి లోనయ్యారు. ఆ వెంటనే తేరుకుని ఉదయం నుంచి ఆ కుటుంబాన్ని రక్షించడానికి తీసుకున్న చర్యలను వివరించారు. "నేను ఉదయం నుంచి ఆ కుటుంబాన్ని కాపాడేందుకు చేయని ప్రయత్నం లేదు. నేవీ, ఎయిర్ ఫోర్స్ తో పాటు హకీంపేటలోని పలు హెలికాప్టర్ లను నాయకన్ గూడెంకు పంపేందుకు ఫోన్ల మీద ఫోన్ లు చేస్తూనే ఉన్నాను. భారీ వర్షాలకు హెలికాప్టర్లు టేక్-ఆఫ్ కావడం కష్టమన్న సమాధానం వచ్చింది. మరోవైపు యాకూబ్‌తో పాటు ఆయన భార్య సైదా తో నిరంతరం మాట్లాడుతూ ధైర్యం చెప్తూనే ఉన్నాను. ఎన్.డీ.ఆర్.ఎఫ్. బృందాలను కూడా అక్కడికి పంపాను. వరదకు బృందాలు అక్కడికి వెళ్లలేకపోయాయి. దీంతో స్థానిక యంత్రాంగం కాంగ్రెస్ కార్యకర్తలను సిద్ధం చేసి దగ్గరలో ఉన్న ఊరు నుంచి ఒక డ్రోన్ ను ఆ ప్రాంతానికి పంపించి, ఆ డ్రోన్ కు ఒక తాడు కట్టి లైఫ్ జాకెట్లను వారికి స్థానికులు అందించారు. 12 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభానికి ముందు కూడా వారితో నేను మాట్లాడాను, ధైర్యం చెప్పాను. ఇంతలోనే భారీ వరద పోటెత్తడంతో వారు ఉన్న ఇంటిగోడ కూలి వరదలో కొట్టుకుపోయారు. అయినప్పటికీ వారి కొడుకు షరీఫ్ ను రక్షించగలిగాం" అంటూ చమర్చిన కళ్ళతో మంత్రి మీడియా ముందు జరిగిన మొత్తం పరిస్థితిని వివరించారు. ఆ కుటుంబాన్ని రక్షించడానికి చివరి వరకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడం పట్ల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆ కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు."రాష్ట్రంలో ఎవరూ కూడా వరదలు పోటెత్తే ప్రాంతాల్లో ఉండొద్దని వీలైనంత వరకు ఎత్తైన ప్రదేశాలకు వెళ్లాలని సూచిం చారు. అధికార యంత్రాంగం కూడా వెంటనే తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**కోదాడలో బీభత్సం సృష్టిస్తున్న వర్షం ..**
**వరదలో కొట్టుకొచ్చిన 2 మృతదేహాలు**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం చాలా అలర్ట్‌గా ఉందని తెలిపారు. అన్ని జిల్లాలతో తాను మాట్లాడినట్టు వివరించారు. రెస్క్యూ టీంలు ఏర్పాటు చేసుకోవాలని హైడ్రాను ఆదేశించినట్టు చెప్పారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. వరద ముంపు ప్రాంతాల్లో విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించాలని కలెక్టర్లను ఆదేశించినట్టు వివరించారు. వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న రోడ్లపైకి వాహనాలను అనుమతించరాదని తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని సూచనలు చేశారు.

**వర్షాల కారణంగా**
**నేడు విద్యాసంస్థలకు సెలవు**

తెలంగాణలో భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం (సెప్టెంబరు 2) అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. సోమవారం సాయంత్రం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పలుచోట్ల రహదారులపై భారీగా వరద ప్రవహిస్తోందని చెప్పారు. వరద ఉన్నచోట ఎవరూ రోడ్డు దాటేందుకు ప్రయత్నించవద్దని సూచించారు.

## ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**విశ్వంభర,పరిగి:** పరిగి మండల పరిధిలోని లక్నాపూర్ ప్రాజెక్టును ఆదివారం ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధిక వర్షాలతో చెరువులు, కుంటలు నిండడంతో రైతన్నలకు మేలు జరుగుతుందని, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని తెలిపారు. లక్నాపూర్ ప్రాజెక్టు అభివృద్ధికి నిధులు తెచ్చి బోటింగ్ ఏర్పాటు చేయడమే గాక మినీ ట్యాంక్ బండ్ గా ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి హనుమంతు, డిసిసి ఉపాధ్యక్షులు లాలూ కృష్ణ, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణ, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, ఆంజనేయులు, రాజ పుల్లారెడ్డి, భరత్ కుమార్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సీవీ రామన్ ఉన్నత పాఠశాలలో 2009-10లో పదవ తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు పాఠశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డ వారంతా బడి ప్రాంగణంలో అడుగు పెడుతూనే హోదాల ను మరిచి ఒకరినొకరు ఆత్మీ యంగా పలకరించుకుంటూ ఒకరి యోగ క్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు శాలువాలతో సన్మానించి షిల్డ్ లు అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సీఐ సుధీర్ కుమార్



**విశ్వంభర, సంగారెడ్డి:** పటాన్ చెరువు నియోజకవర్గం జిన్నారం మండలం వావిలాల గ్రామం భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంలో చెరువులు కుంటలు వాగులు వంకలు పొంగుతున్న సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు జిన్నారం సీఐ సుధీర్ మరియు ఎస్సై నాగలక్ష్మి లతో కలిసి జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ గ్రామంలో పర్యటించారు. వావిలాల పిర్ష చెరువు నిండడంతో చుట్టుపక్కల గ్రామాలను అప్రమత్తంగా ఉండాలని మండలంలోని గ్రామాలలో పురాతనమైన భవనాలు శిధిలావస్థలో ఉన్న ఇళ్లల్లో నుండి సురక్షితమైన ప్రాంతాల్లో చేరుకోవాలని ప్రజలకు సూచించారు. మరో రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించారని, రైతులు పొలాలకు వెళ్లేటప్పుడు కరెంటు స్తంభాలను, వైర్లను చూసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని అవసరమైతే తప్ప ఇంటి నుండి బయటకు రావద్దని జిన్నారం ప్రజలకు మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ సూచించారు.

## మరుపురాని మహానేత:
## నేడు మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2004 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఉచిత విధ్యుత్ ఫైల్ పై మొదటి సంతకం పెట్టి, రైతులకు 2 లక్షల ఋణ మాఫీ చేసి మాట తప్పం - మడమ తిప్పం అనే పదానికి నిర్వచనం ఇచ్చిన మహానుభావుడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. పేద విద్యార్థులు ఉన్నత విద్యను ఉచితంగా చదువుకునేలా ఫీజు రియంబర్స్మెంట్ ప్రవేశపెట్టిన విద్యా ప్రధాత. పేద వారికి పెద్ద జబ్బులు వస్తే ఇబ్బంది పడకుండా ఎంత పెద్ద జబ్బుకైనా, ఆపరేషన్ కైనా ప్రయివేట్ ఆసుపత్రులలో ఉచితంగా వైద్యం అందించాలనే లక్ష్యంతో రాజీవ్ ఆరోగ్య శ్రీని ప్రవేశ పెట్టిన ప్రాణదాత డాక్టర్ వైఎస్సార్. రైతులకు, ప్రజలకు సాగునీరు, తాగునీటి కొరకు జలయజ్ఞం పేరుతో డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ప్రాణహిత చెవ్వేల ప్రాజెక్ట్ ను మొదలు పెట్టిన సుజల దాత. ఎన్నో ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్‌లు వేసి నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపి, జంబో డీఎస్సీ ద్వారా 50 వేలకు పైచిలుకు టీచర్ పోస్టులను భర్తీ చేసిన లెజెండ్. మహిళల స్వయం ఉపాధి కొరకు పావలా వడ్డీ కే మహిళా సంఘాలకు రుణాలు అందచేసిన గొప్ప నాయకుడు మరుపురాని మహానేత నేడు మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి నేడు.

## ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

**ప్రజలు వాగులు వంకలు దాటే ప్రయత్నం చేయరాదు**

**అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాకూడదు: మర్పల్లి ఎస్సై సురేష్**



**విశ్వంభర, వికారాబాద్ :** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మర్పల్లి మండలంలోని వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయని మర్పల్లి ఎస్సై సురేష్ అన్నారు. ఇట్టి నీటి ప్రవాహాల వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండడానికి మండల రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సెక్రెటరీ లసహకారంతో మర్పల్లి మండలంలోని సిరిపురం వాగు దగ్గర, తిమ్మాపూర్ వాగు దగ్గర పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. కావున మండల ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇల్లు వదిలి బయటకు రాకూడదని, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను దాటడానికి ప్రయత్నం చేయరాదని మర్పల్లి ఎస్సై సురేష్ తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100కు సమాచారం ఇవ్వాలని అన్నారు.

## ఫ్రీహిస్ కాఫీ కార్నర్ మండీ హోటల్ ప్రారంభం



**విశ్వంభర, హైదరాబాద్:** చంద్రాయన గుట్ట నియోజకవర్గం ఉప్పుగూడలో ఫ్రీహిస్ కాఫీ కార్నర్ మండీ హోటల్ ను ఆదివారం ప్రారంభించారు. యజమాని కే సన్నీ మరియూ ఝాన్సీ మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు కే పద్మకే శివకుమార్ చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. చుట్టుపక్కల ఐదు కిలోమీటర్ల వరకు మా సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు. మా స్పెషల్ ఫిష్ మండి, చికెన్ మండి, మటన్ మండి, తందూరి చికెన్ చికెన్ జ్యూసీ, ఇంకా చాలా రకములైన వంటకాలు లభించునని తెలిపారు. ఇక్కడ ఎలాంటి కలర్స్ వాడకుండా అన్ని కుటుంబాలకు ఇంటి రుచిని తలపించే విధంగా ఉంటుందని అన్నారు. ఇక్కడ అన్ని రకాలు ఆన్లైన్ సేవలు అందుబాటు ధరల్లో అందించడం మా ప్రత్యేకత అని సన్నీ తెలిపారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**విశ్వంభర, వికారాబాద్:** వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ఎవ్వరు వాగుల దగ్గరకు వెళ్ళకూడదని కాంగ్రెస్ పార్టీ మర్పల్లి మండల అధ్యక్షుడు తుమ్మల సురేష్ యాదవ్ అన్నారు. కల్వర్టులు, బ్రిడ్జిల దగ్గరకు వెళ్ళవద్దని, దాటడానికి ప్రయత్నం చేయవద్దని అన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకూడదని, పాత ఇండ్లలో నివసిస్తున్న వారు తక్షణమే ఇంటిని విడిచి సమీపంలోని ప్రభుత్వ భవనాలు, పాఠశాలలో ఆశ్రయం పొందాలని అన్నారు. పాత గోడల దగ్గరకు వెళ్ళవద్దని, కరెంటు స్తంభాలు, వైర్లను ముట్టుకోవద్దని అన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలను ఇంటోల్లనే ఉండి బయటకు రానివ్వద్దని అన్నారు. మీ ప్రాంతాల్లో తడిసిన కరెంటు స్థంబాలకు దూరంగా ఉండాలని, గ్రామంలో తెరిచి ఉన్న డ్రైనేజీ ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. భారీ వర్షాల కారణంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి ప్రమాదాలకు గురి కావద్దని అన్నారు.

## వర్షంలో పర్యటించిన హైడ్రా కమిషనర్
### స్థానికులను కలిసి బయటకు రావద్దంటూ సూచన



**విశ్వంభర, హైదరాబాద్:** భారీ వర్షాలు హైదరాబాద్ మహానగరాన్ని అతలాకుతలం చేస్తున్న నేప థ్యంలో ప్రజలకు ధైర్యం చేప్పేందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ నేరుగా క్షేత్రానికి వెళ్లారు. ఆదివారం ప్రాంతాల్లో పర్యటించి, ప్రజలను కలుసుకున్నారు. హైదరాబాద్ నగరానికి మరో రెండు రోజుల పాటు వర్ష సూచన ఉండటం, రెడ్ అలర్ట్ జారీ చేసినందుకు అత్యవసరమైతే తప్ప, ప్రజలు బయటకు రావద్దని సూచించారు. భారీ వర్షాల ధాటికి అమీర్ పేట, బేగంపేట్, షేక్‌పేట్, టోలీచౌకీ, గచ్చిబౌలి, కొండాపూర్, అత్తా పూర్ వంటి ప్రాంతాల్లోని లోతట్టు ప్రదేశాలు జలమయమైనట్లు గుర్తించారు. పలు ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవహించినట్లు గుర్తించిన కమిషనర్ వెంటనే డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దింపి సహాయక చర్యలు అందించాలని ఆదేశించారు. మురుగునీరు, వరదనీటి పారుదల కాలువల్లో చెత్త పేరుకుపోవడం వల్ల అవన్నీ కూడా పొంగి పొర్లుతున్నట్లు గుర్తించారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మహానగరవాసులు అత్యవసరమైతే తప్ప బయకు రావద్దని, ఇప్పటికే ఈ విషయంపై బల్దియా కమిషనర్ చేసిన ప్రకటనను గుర్తు చేశారు. రోడ్లపై నిలిచిన వర్షపునీటిలో పిల్లలు, వృద్ధులు ఒంటరిగా బయటికి వెళ్లకూడదని విజ్ఞప్తి చేశారు. ద్విచక్ర వాహనాలను కూడా వినియోగించవద్దని సూచించారు. వర్షపు నీరు వెళ్లిపోవాలనే ఉద్దేశంతో స్థానికులు తమ పరిధిలో ఉన్న మ్యాన్ హోల్స్ను తెరవకూడదని సూచించారు. ఒకవేళ అవి తెరచి ఉంటే జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్ కు సమాచారమివ్వాలని సూచించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ షేక్ పేట్, టోలీచౌకీల్లో పర్యటించారు. లోతట్టు ప్రాంతాల్లో కలియదిరిగారు. విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బందితో మాట్లాడారు. వర్షపునీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించా రు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ఇతర విపత్తు నిర్వహణ ఏజెన్సీలు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ వరద పరిస్థితులను ఎదుర్కొంటోన్నాయని, నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలను తీసుకుంటున్నామని కమిషనర్ భరోసా ఇచ్చారు.

## వర్షాల కారణంగా వాగులు వంకలు దాటొద్దు



**విశ్వంభర, వికారాబాద్ :** గొట్టిముక్కుల -ద్యాచారం రోడ్డుపై వర్షపు నీరు పొంగి పొర్లుతుంది. రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగి పొందుతున్నాయి. గ్రామస్తుల సహకారంతో ప్రజలు రోడ్డు క్రాస్ చేయకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. వికారాబాద్ సిఐ నాగరాజు వాగులు దాటితే ప్రమాదానికి గురవుతారని అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

## ధారూర్ మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**విశ్వంభర, వికారాబాద్ :** అకాల వర్షాల కారణంగా ధారూర్ మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ధారూర్ లమండల మాజీ వైస్ ఎంపీపీ విజయ్ కుమార్ అన్నారు. శనివారం ధరూర్ మండల మాజీ వైస్ ఎంపీపీ విజయ్ కుమార్ మాట్లాడుతూ, వర్షాలతో ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని అన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాకూడదని పేర్కొన్నారు. తడి చేతులతో విద్యుత్ స్తంభాలను ముట్టుకోరాదని అన్నారు. శిథిలావస్థలో ఉన్నఇండ్లలో ప్రజలు నివసించరాదని పేర్కొన్నారు. రైతులు పొలాల వద్దకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, పిడుగులు పడే అవకాశాలు మెండుగా ఉన్నాయని, చెట్ల కింద ఉండకుండా జాగ్రత్త వహించాలని అన్నారు.

## అక్రమంగా అరెస్టు చేసిన సొసైటీ సభ్యులను బేషరతుగా విడుదల చేయాలి



**విశ్వంభర, బషీర్ బాగ్:** ప్రతిష్టాత్మక హెబ్రోన్ చర్చిలో రాజకీయ కుట్రలతో హైకోర్టు ఆర్డర్లను సైతం ధిక్కరించి అక్రమంగా పోలీసులు అర్ధరాత్రి ట్రస్ట్ ను స్వాదీనం చేసుకోవడం దుర్మార్గం అని క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షులు జెరుషలేము మత్తయ్య అన్నారు. మాజీ ఉద్యోగి ఎఫ్ సి ఎస్ పీటర్, జాన్ సుబ్బారెడ్డి వర్గం, ఇక్కడి కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుమ్మక్కై, ఎమ్మెల్సీ రాజేశ్వరరావు ప్రోద్బలంతో సీయం ఆఫీస్ ప్రతినిదుల పేరుతో కొందరు శనివారం అర్ధరాత్రి హెబ్రోన్ చర్చి గేట్లు కోసి లోపలికి ప్రవేశించి, సొసైటీ సభ్యులను గాయపరిచి హెబ్రోన్ ఆక్రమించారని అయన ఆరోపించారు. గతంలో ఇదే విధంగా దౌర్జన్యానికి పాల్పడి జైలుకు వెళ్లిన రెడ్డి వర్గం ఇప్పుడు సీఎం రెడ్డి, సిపి రెడ్డి లను ప్రలోభ పెట్టీ, స్థానిక పోలీసులపై ఒత్తిడి తెచ్చి, హైకోర్టు భద్రత కల్పించాలని ఇచ్చిన ఆర్డర్ సహితం లెక్క చేయకుండా కొన్ని దశాబ్దాలుగా న్యాయ వ్యవస్థ నిర్వహణలో సొసైటీకి చెందిన వీరాచారి అనుచర సేవకులను అదుపులోకి తీసుకుని మరీ ట్రస్ట్ హస్తగతం చేసుకోవడం రాజ్యాంగ విరుద్ధం అని మండిపడ్డారు. వీరాచారి బీసీ, దళిత క్రైస్తవులు, బీసీ క్రైస్తవుల మనోభావాలను పరిగణలోకి తీసుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. తెలంగాణలో క్రైస్తవ మత సంస్థల అంతర్గత వ్యవహారాల సీయం తలదూర్చడం, ఏకంగా హైకోర్టు పరిదిలో ఉండగా మరి ముఖ్యంగా గతంలో పలు ఆర్థిక అక్రమాల ఆరోపణలు ఉన్న హెబ్రోన్ ట్రస్ట్, కాంగ్రెస్ పార్టీ అర్ధరాత్రి మద్దతు తెలపడాన్ని రాష్ట్ర వ్యాప్తంగా క్రైస్తవ సమాజం ఖండిస్తుందన్నారు.త్వరలోనే ఈ విషయమై డిల్లీ లోని కాంగ్రెస్ అధినాయకత్వానికి క్రైస్తవ, దళిత సంఘాలు నేతృత్వంలో పిర్యాదు చేస్తామని క్రైస్తవ దర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షులు జెరుషలేము మత్తయ్య తెలిపారు.త్వరలోనే కార్యాచరణ తమ కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. పోలీసులు అక్రమంగా అరెస్టు చేసిన సొసైటీ సభ్యులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ధోనీ నా కుమారుడి కెరీర్ నాశనం చేశాడు

## యువరాజ్ సింగ్ తండ్రి సంచలన వ్యాఖ్యలు




**విశ్వంభర, క్రిడావిభాగం :** టీమ్ఇండియా మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ తండ్రి, ప్రముఖ క్రికెట్ కోచ్ యోగ్‌రాజ్ సింగ్ ఎమ్ఎస్ ధోనీపై మరోసారి మండిపడ్డారు. తన కుమారుడి కెరీర్‌ను మాజీ కెప్టెన్ ధోనీయే నాశనం చేశాడని ఆరోపించారు. ఈ విషయంలో అతడిని ఎప్పటికీ క్షమించనని యోగ్‌రాజ్ పేర్కొన్నారు. ఆయన ఇటీవల పాల్గొన్న ఓ యూట్యూబ్ ఛానెల్‌లో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి.

'ధోనీ ని నేను క్షమించను. అతడు ఫేమస్ క్రికెటరే. కానీ, నా కుమారుడికి మాత్రం క్షమించరాని చేసిన అన్యాయం చేశాడు. ప్రతిదీ ఇప్పుడు వెలుగులోకి వస్తోంది. ఇంకా 45 ఏళ్లు క్రికెట్ ఆడగలిగే నా కుమారుడి కెరీర్‌ను ధోనీ నాశనం చేశాడు. నాకు అన్యాయం చేసిన వాళ్లను నేను ఎప్పటికీ క్షమించను. వాళ్లను నా కుటుంబ సభ్యులైనా దగ్గరికి రానివ్వను. ధోనీ ఓసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. అప్పటి స్టార్లు గౌతమ్ గంభీర్, వీరేంద్ర సెహ్వాగ్ కూడా మరో యువరాజ్ రాడని అన్నారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూనే దేశం కోసం ఆడి ప్రపంచకప్ గెలిచినందుకు భారత ప్రభుత్వం యువరాజ్‌కు భారతరత్న ఇవ్వాలి' అని యోగ్ రాజ్ అన్నారు.

భారత్ 2007 టీ20 ప్రపంచకప్, 2011 వరల్డ్‌కప్ గెలవడంలో యువరాజ్ సింగ్ కీలకపాత్ర పోషించాడు. అయితే, అతడికి తగినంత గుర్తింపు దక్కలేదని పలువురు మాజీ క్రికెటర్ల అభిప్రాయం. ధోనీ నాయకత్వంలో టీమ్ఇండియా వన్డే వరల్డ్‌కప్ నిలిచినప్పుడే యూవీ డేంజరస్ వ్యాధి క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఆపై మెరుగైన చికిత్స తీసుకొని దాని నుంచి కోలుకొని ఆపై తిరిగి టీమ్ఇండియాలో చేరాడు. ఆ తర్వాత ఆశించ దగిన రీతిలో యూవీ రాణించలేదు.

కాగా, యూవీ 2000 నుంచి 2017 మధ్యలో టీమ్ఇండియాకు ప్రాతినిధ్యం వహించాడు. తన కెరీర్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి 402 మ్యాచ్‌ల్లో 11,178 పరుగులు చేశాడు. అందులో 17 సెంచరీలు, 71 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇక 2017లో వెస్టిండీస్‌తో జరిగిన వన్డేలో చివరిసారిగా ఆడాడు. 2019లో కెరీర్‌కు గుడ్‌బై చెప్పేశాడు.

# ఒక్క IPL మ్యాచ్‌తో ఆ ముగ్గురి కెరీర్ ఫినిష్

**విశ్వంభర, క్రిడావిభాగం :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చాలా మంది క్రికెటర్లకు గుర్తింపు తీసుకొచ్చింది. 2008లో ప్రారంభమైనప్పటి నుంచి చాలా మంది క్రికెటర్లు ఈ ప్రీమియర్ లీగ్ ద్వారా పరిచయమయ్యారు. వారిలో కొందరు ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌లో స్టార్ ప్లేయర్లుగా కొనసాగుతున్నారు. అయితే ఐపీఎల్‌లో చాలా అవకాశాలు వచ్చినప్పటికీ సద్వినియోగం చేసుకోలేకపోయిన ఆటగాళ్లు కూడా ఉన్నారు.

అయితే ఈ రెండు కేటగిరీలు కాకుండా ఐపీఎల్‌లో కేవలం ఒకే ఒక్క మ్యాచ్ ఆడిన క్రికెటర్లు కూడా ఉన్నారు. ఆ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగినప్పటికీ, ఐపీఎల్‌లో మళ్లీ కనిపించలేదు. ఆ ప్లేయర్లు ఎవరో ఇప్పుడు చూద్దాం.

షోయబ్ అక్తర్

క్రికెట్ ప్రపంచంలో షోయబ్ అక్తర్‌ని 'రావల్పిండి ఎక్స్‌ప్రెస్' అని పిలుస్తారు. అంతర్జాతీయ క్రికెట్‌లో అక్తర్ ప్రభావం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ ఫాస్ట్ బౌలర్ కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ఐపీఎల్‌లో అరంగేట్రం చేశాడు. మొదటి మ్యాచ్‌లోనే గుర్తుండిపోయే ప్రదర్శన ఇచ్చాడు. ఢిల్లీ డేర్‌డెవిల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అక్తర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 11 పరుగులు ఇచ్చి, 4 వికెట్లు పడగొట్టాడు. వీరేంద్ర సెహ్వాగ్, ఏబీ డివిలియర్స్ వంటి స్టార్ ఆటగాళ్లను పెవిలియన్ చేర్చాడు. దీని తర్వాత అక్తర్ మరో ఐపీఎల్ మ్యాచ్ ఆడలేకపోయాడు. 2008 ముంబయి పేలుళ్ల తర్వాత పాకిస్థాన్ ప్లేయర్లు ఐపీఎల్‌లో పాల్గొనకుండా బీసీసీఐ నిషేధించింది.

యూనిస్ ఖాన్

పాకిస్థాన్ సక్సెస్‌ఫుల్ టెస్ట్ కెప్టెన్‌గా యూనిస్ ఖాన్ గుర్తింపు పొందాడు. ఐపీఎల్ 2008 సీజన్‌లో యూనిస్‌ను రాజస్థాన్ రాయల్స్ కొనుగోలు చేసింది. అంతర్జాతీయ క్రికెట్‌లో గుర్తింపు, అనుభవం ఉన్నప్పటికీ, యూనిస్ రాయల్స్ తరఫున ఒకే ఒక మ్యాచ్ ఆడాడు. ఆ మ్యాచ్‌లో కూడా కేవలం 3 పరుగులే చేశాడు.

ఆండ్రే నెల్


దూకుడైన బౌలింగ్, తీవ్రమైన స్లెడ్జింగ్‌కు దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ ఆండ్రే నెల్ ప్రసిద్ధి. ఈ స్టార్ ప్లేయర్‌ను ఐపీఎల్ తొలి సీజన్‌లో ముంబయి ఇండియన్స్ సొంతం చేసుకుంది. ఇక అభిమానులందరూ కూడా ముంబయి జట్టుకు నెల్ అదనపు బలం అవుతాడని భావించారు. అయితే యూనిస్ లాగే నెల్ కూడా ఒకే ఒక్క గేమ్ ఆడాడు. ఆ మ్యాచ్‌లో మూడు ఓవర్లలో 31 పరుగులు ఇచ్చి, కేవలం ఒక వికెట్ పడగొట్టాడు.




# ఛాంపియన్స్ ట్రోఫీ కోసం

# భారత్ ఎందుకు పాకిస్థాన్‌కు వెళ్లకూడదు?

## సంచలనం రేపుతున్న హర్భజన్ సింగ్ వ్యాఖ్యలు




**విశ్వంభర, క్రిడావిభాగం :** వచ్చే ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ ఐసీసీ టోర్నీకి భారత్ పాకిస్థాన్ వెళ్తుందా లేదా అనేది ఇప్పటికీ ప్రశ్నగా మిగిలిపోయింది. ఈ క్రమంలోనే భారత మాజీ స్టార్ బౌలర్ హర్భజన్ సింగ్ చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.


ఇటీవలే టీ20 ప్రపంచ కప్ 2024 ను విజయవంతంగా నిర్వహించిన ఐసీసీ మరో మెగా టోర్నీని నిర్వహించడానికి సిద్ధమవుతోంది. అదే ఛాంపియన్స్ ట్రోఫీ 2025. ఛాంపియన్స్ ట్రోఫీ వచ్చే ఏడాది పాకిస్థాన్‌లో జరగనుంది. ఈ ఐసీసీ టోర్నమెంట్ కోసం భారత్ పాకిస్తాన్ వెళ్తుందా లేదా అనేది ఇప్పటికీ ప్రశ్నగా మిగిలిపోయింది. ఎందుకంటే చాలా ఏళ్లుగా భారత్‌పాకిస్తాన్ ల మధ్య సంబంధాలు పెద్దగా లేవు. భద్రతా కారణాల వల్ల భారత క్రికెట్ జట్టు చాలా కాలంగా పాకిస్తాన్‌లో పర్యటించలేదు. 201213 నుంచి భారత్, పాకిస్థాన్‌లు ద్వైపాక్షిక సిరీస్‌లు కూడా ఆడలేదు. ఈ రెండు జట్టు కేవలం ఐసీసీ టోర్నీ మ్యాచ్‌ల్లో మాత్రమే తలపడుతున్నాయి.

భారత్ పాకిస్తాన్ ఎందుకు వెళ్లకూడదు?

భారత్ కూడా ఇదివరకు పాకిస్తాన్ తో ద్వైపాక్షిక సిరీస్ లను ఆడటానికి పాక్ వెళ్లేందుకు ప్రభుత్వాన్ని బీసీసీఐ సంప్రదించగా, సర్కారు నో చెప్పింది. ఆగటాళ్లలో కూడా పలువురు పాక్ వెళ్లడంపై ఆసక్తి చూపలేదు. క్రీడలురాజకీయాలను వేరుగా చూడాల్సిన అవసరముందనే వాదనలు కూడా చాలా సార్లు వినిపించాయి. ఈ క్రమంలోనే ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత్ ఎందుకు పాకిస్థాన్‌కు వెళ్లకూడదో ఇప్పుడు భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ చెప్పాడు. టీమిండియా స్టార్ స్పిన్ బౌలర్ గా జట్టుకు అనేక విజయాలు అందించిన హర్భజన్ సింగ్ తాజాగా చేసిన ఈ కామెంట్స్ క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతున్నాయి.

**హర్భజన్ సింగ్ ఏం చెప్పారంటే?**

భద్రతా కారణాల దృష్ట్యా టోర్నీ కోసం టీమిండియా పాకిస్థాన్‌కు వెళ్లడం లేదని భారత స్పిన్నర్ హర్భజన్ సింగ్ అభిప్రాయపడ్డాడు. ఒక ఇంటర్వ్యూలో భజ్జీ మాట్లాడుతూ.. ''వారు ఏమి చెప్పినా. అది సరైనదని వారు భావిస్తారు, అయితే మనం చెప్పేది మన దృక్కోణం. భద్రతాపరమైన సమస్యలు ఎప్పుడూ ఉంటాయని నేను భావిస్తున్నాను. ఆటగాళ్ల భద్రత అక్కడ నిర్ధారించబడకపోతే, జట్టు అక్కడికి వెళ్లాలని నేను అనుకోను'' అని హర్భజన్ అన్నాడు. భారత బృందాలకు పూర్తి భద్రత ఉంటుందని, ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెబితే.. ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ విషయంలో క్రికెటర్ల అభిప్రాయాలు కూడా కీలకంగా ఉంటాయని చెప్పారు.




ఇది కేవలం క్రికెట్ సమస్య మాత్రమే కాదు..

అలాగే, 'అన్నింటికంటే, ఇది క్రికెట్ సమస్య మాత్రమే కాదు.. సమస్య అంతకు మించి ఉంటుంది. ఒక క్రికెటర్‌గా, మీరు క్రికెట్ ఆడాలనుకుంటే ఆడండి అని నేను చెప్పగలను, అయితే భద్రత గురించి ఎల్లప్పుడూ ఆందోళన ఉంటుంది. భద్రతకు హామీ ఇవ్వకపోతే ఆటగాళ్ళు అక్కడికి వెళ్లకూడదు. ఇది మరిన్ని సమస్యలను తెచ్చిపెడుతుంది' అని హర్భజన్ అన్నాడు. అలాగే, హైబ్రిడ్ మోడల్‌పై చర్చలు జరిగే అవకాశాలను ప్రస్తావించారు. 'ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత్ పాకిస్థాన్ వెళ్లే అవకాశం కనిపించడం లేదు. భారత్ పాకిస్థాన్‌లో పర్యటించకుంటే ఐసీసీ ఇప్పటికే ప్లాన్ 'బీ' ని సిద్ధం చేసిందని పలు మీడియా నివేదికల్లో పేర్కొంది.

పాకిస్థాన్‌లో కాకుండా ఇతర వేదికల్లో మ్యాచ్‌ల నిర్వహణకు అయ్యే ఖర్చుల కోసం దాదాపు 65 మిలియన్ డాలర్ల బడ్జెట్‌ను ఐసీసీ ఆమోదించినట్లు నివేదికలు తెలిపాయి. గత ఏడాది పాకిస్థాన్‌లో జరిగిన ఆసియా కప్‌లో కూడా భారత జట్టు పాక్ వెళ్లలేదు. భారత్ ఆడిన అన్ని మ్యాచ్‌లు శ్రీలంకలో జరిగాయి.

పాకిస్తాన్ మాజీ ప్లేయర్..

హర్భజన్ సింగ్ తో పాటు పాకిస్తాన్ మాజీ ప్లేయర్ కూడా ఇదే తరహా కామెంట్స్ చేయడం గమనార్హం. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ సిరీస్‌లో ఆడేందుకు భారత జట్టు పాకిస్థాన్‌కు రావద్దనీ, హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించాలని పాకిస్థాన్ మాజీ ఆటగాడు కనేరియా అన్నాడు. భారత జట్టు ఆటగాళ్ల భద్రత ముఖ్యం కాబట్టి ఐసీసీ హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించాలని అన్నాడు. 2025 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ సిరీస్ ఫిబ్రవరి 19 నుండి మార్చి 9 వరకు పాకిస్తాన్‌లో జరుగుతుంది. దీనికి సంబంధించిన ముందస్తు షెడ్యూల్‌ను ఇప్పటికే ప్రకటించగా, భారత జట్టు ఆడే మ్యాచ్‌లు లాహోర్ స్టేడియంలో జరుగుతాయని వెల్లడించింది. అయితే భారత జట్టు పాకిస్థాన్ వెళ్లి ఆడుతుందా అనే అనుమానాలు ఉన్నాయి. దాదాపు భారత్ పాక్ వెళ్లే అవకాశాలు మాత్రం లేవని భారత క్రికెట్ వర్గాలు పేర్కొంటున్న పరిస్థితులు కూడా ఉన్నాయి.

# టీ20ల్లో మరో రికార్డ్

# నాలుగు ఓవర్లకు 4 మెయిడిన్స్




**విశ్వంభర, క్రిడావిభాగం :** హాంకాంగ్ బౌలర్, భారత సంతతికి చెందిన ఆయుష్ శుక్లా సరికొత్త చరిత్ర లిఖించాడు. టీ20 క్రికెట్‌లో నాలుగు ఓవర్లకు నాలుగు మెయిడిన్ చేసిన బౌలర్‌గా చరిత్రకెక్కాడు. ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ ఆసియా క్వాలిఫైయర్‌లో భాగంగా మంగోలియాతో జరిగిన మ్యాచ్‌లో ఆయూష్ ఈ ఫీట్ సాధించాడు. తద్వారా టీ20 క్రికెట్‌లో ఈ ఫీట్ సాధించిన మూడో బౌలర్‌గా నిలిచాడు. అయితే ఈ అరుదైన ఘనతను అందుకున్న తొలి ఆసియా బౌలర్ మాత్రం ఆయుష్ శుక్లానే కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో వేసిన తొలి బంతికే వికెట్ అందుకున్న ఆయుష్ శుక్లా.. తర్వాత వేసిన 23 బంతులకు ఒక్క పరుగు కూడా ఇవ్వలేదు. గతంలో న్యూజిలాండ్ పేసర్ లాకీ ఫెర్గూసన్, కెనడా బౌలర్ సౌద్ బిన్ జఫర్ ఈ ఫీట్ సాధించాడు. టీ20 ప్రపంచకప్‌లో పపువా న్యూగినియాతో జరిగిన మ్యాచ్‌లో లాకీ ఫెర్గూసన్ ఈ ఘనతను అందుకున్నాడు. పనామాతో జరిగిన మ్యాచ్‌లో సౌద్ బిన్ ఈ రికార్డ్ సాధించాడు. ముంబైలోని పల్గార్ జిల్లాకు చెందిన ఆయుష్ శుక్లా హాంకాంగ్‌కు వలస వెళ్లి అక్కడి టీమ్‌లో కీలక ప్లేయర్‌గా మారాడు. ఇప్పటి వరకు ఆ జట్టు తరఫున 34 మ్యాచ్‌లు ఆడిన ఆయుష్ శుక్లా 8.62 ఎకానమీతో 29 వికెట్లు పడగొట్టాడు. ఆసియాకప్ 2022లో టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ వికెట్ తీసాడు.

# బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో

# ఇదే జరగబోతోంది

## సునీల్ గవాస్కర్ జోస్యం



**విశ్వంభర, క్రిడావిభాగం :** టీమిండియా, ఆస్ట్రేలియా జట్లు బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ కోసం మరోసారి అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ ఏడాది నవంబరు 22న ప్రారంభం కానున్న ఈ ఐదు టెస్టుల సిరీస్ వచ్చే ఏడాది జనవరి 7న ముగియనుంది. బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీకి ఆస్ట్రేలియా ఆతిథ్యం ఇవ్వనుంది.

ఇప్పటికే టీమిండియా 201819, 202021 సీజన్లలో బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీని వరుసగా రెండుసార్లు గెలిచి సత్తా చాటింది. ఈసారి కూడా గెలిచి హ్యాట్రిక్ సాధించాలని టీమిండియా కృతనిశ్చయంతో ఉంది.

కాగా, భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ టీమిండియాఆసీస్ టెస్ట్ సిరీస్ పై స్పందించాడు. సిరీస్ విజేత ఎవరో జోస్యం చెప్పాడు. ఈ సిరీస్ ను టీమిండియా 31 తేడాతో కైవసం చేసుకుంటుందని అంచనా వేశాడు.

ఈ సిరీస్ ఆసక్తికరంగా సాగుతుందనడంలో సందేహం లేదని, రెండు జట్లలోనూ ప్రతిభావంతులైన ఆటగాళ్లున్నారని వెల్లడించాడు. అంతేకాదు, క్రికెట్ లో టెస్టు ఫార్మాట్ ను అత్యధికంగా ఎందుకు ఇష్టపడతారో ఈ సిరీస్ చాటిచెబుతుందని గవాస్కర్ పేర్కొన్నాడు.

అంతర్జాతీయ క్రికెట్ కు వీడ్కోలు పలికిన ఆసీస్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ లేని లోటు భర్తీ చేయడం కష్టమని అభిప్రాయపడ్డాడు. టీమిండియాతో సిరీస్ లో ఆసీస్ కు ఓపెనింగ్ సమస్యలు మరింత అధికమవుతాయని అన్నాడు.

టీమిండియా గురించి చెబుతూ, విదేశీ పర్యటలను టీమిండియా నిదానంగా ఆరంభిస్తుందని, అందుకే తొలి టెస్టు కీలకమని భావిస్తున్నానని గవాస్కర్ తెలిపాడు.

# బంగ్లాను ఆదుకున్న లిట్టన్ దాస్

# పాక్‌పై వీరోచిత శతకం



**విశ్వంభర, క్రిడావిభాగం :** రావల్పిండిలో పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల మధ్య జరుగుతున్న రెండో టెస్టు ఆసక్తికరంగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్‌ను మూడొందల లోపే కట్టడి చేసిన సంతోషం బంగ్లాకు దక్కలేదు. తొలి సెషన్‌లో పాక్ పేసర్ ఖుర్రమ్ షెహ్‌జాద్(6/90) విజృంభణకు బంగ్లా టాపార్డర్ కుప్పకూలింది. అయితే ఓవైపు వికెట్లు పడుతున్నా లిట్టన్ దాస్(138) మొండిగా పోరాడాడు. మెహిదీ హసన్ మిరాజ్(78)తో కలిసి పాక్ బౌలర్లపై ఎదురుదాడికి దిగి సూపర్ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. కానీ, అఘా సల్మాన్ అతడిని వెనక్కి పంపాక బంగ్లా ఇన్నింగ్స్ 262 వద్దే ముగిసింది. దాంతో, ఆతిథ్య పాకిస్థాన్‌కు 12 పరుగుల ఆధిక్యం లభించింది.

సిరీస్ విజేతను నిర్ణయించే రెండో టెస్టులో బౌలర్ల ఆధిపత్యం నడుస్తోంది. మూడో రోజు తొలి సెషన్‌లోనే బంగ్లాకు ఆదిలోనే షాక్. పేసర్ ఖుర్రమ్ హెహ్‌జాబ్ బుల్లెట్ బంతులతో వణికించి తొలి మూడు వికెట్లు పడగొట్టాడు. తొలుత ఓపెనర్ జకీర్ హసన్(1)ని బౌల్డ్ చేసిన ఖుర్రమ్.. 5 పరుగుల వ్యవధిలోనే మరో ఓపెనర్ షద్నమ్ ఇస్లామ్(10)ను దొరబుచ్చుకున్నాడు. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే కెప్టెన్ నజ్ముల్ హుసేన్ శాంటో(4)ను బౌల్డ్ చేసి బంగ్లాను ఒత్తిడిలోకి నెట్టాడు. మరో ఎండ్‌లో మిర్ హమ్జా సైతం చెలరేగగా 26 పరుగులకే బంగ్లా సగం వికెట్లు కోల్పోయింది. సగం మంది డగౌట్ అయినా లిట్టన్ దాస్(138) అధైర్యపడలేదు. దూకుడుగా ఆడుతూ పాక్ బౌలర్ల ఎత్తులను చిత్తు చేశాడు. మెహిదీ హసన్ మిరాజ్(78)తో కలిసి బంగ్లా స్కోర్ బోర్డును ఉరికించాడు. ఈ క్రమంలోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న లిట్టన్ ఆ తర్వాత గేర్ మార్చాడు. పాక్ బౌలింగ్ దళాన్ని చీల్చిచెండాడుతూ శతక గర్జన చేశాడు. అయితే.. ఖుర్రం డేంజరస్ మిరాజ్‌ను ఔట్ చేసి పాక్‌కు బ్రేకిచ్చాడు. దాంతో, వీళ్లిద్దరి 165 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత అఘా సంగ్మా సూపర్ బంతితో లిట్టన్‌ను బోల్తా కొట్టించాడు. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా స్పిన్నర్ మెహిదీ హసన్ మిరాజ్(5/61) ధాటికి పాకిస్థాన్ 274 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ సయూం అయూబ్(58), కెప్టెన్ షాన్ మసూద్(57)లు మంచి పునాది వేసినా.. మిరాజ్ తిప్పేయడంతో మిగతా వాళ్లు చేతులెత్తేశారు. ఆఖర్లో అఘా సల్మాన్(54) అర్ధ శతకంతో పోరాడి పాక్ పరువు కాపాడాడు.

# భారీ వర్షం నేపథ్యంలో చిల్కానగర్ డివిజన్

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : బన్నాల



**విశ్వంభర, ఉప్పల్ :** భారీ వర్షాల నేపద్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ చిలుక నగర్ డివిజన్లోని పలు లోతట్టు కాలనీలను పర్యటించి నీరు నిలిచిన వీధుల్లో ఎయిర్ టెక్ వాహనాన్ని పిలిపించి భారీగా నిలిచిపోయిన నీటిని తొలగింపజేశారు. అనంతరం డివిజన్లోని బీరప్ప గడ్డ, ధర్మపురి కాలనీ, శ్రీనగర్ కాలనీ, రాఘవేంద్ర నగర్ కాలనీ, కుమ్మరి కుంట, మర్రిచెట్టు ప్రాంతం పర్యటించారు. కాలనీ ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని తెలుపుతూ నీటి నిల్వలు నిండిపోయి ఉన్న వీధులనుంచి నీళ్లు బయటకు వెళ్లకపోతే వెంటనే తనను సంప్రదించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. వెంటనే మాన్సూన్ సిబ్బందిని, ఏర్టెక్ వెహికల్‌తో పాటు సిబ్బందిని ఏర్పాటు చేస్తానని తెలిపారు.

# మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నా: మమ్ముట్టి

మాలీవుడ్‌లో ఇటీవల జరుగుతున్న పరిణామాలపై ప్రముఖ నటుడు మమ్ముట్టి స్పందించారు. మలయాళ చిత్ర పరిశ్రమలో 'పవర్ గ్రూప్' ఉందని జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఈ మేరకు ఫేస్‌బుక్‌లో ఒక పోస్ట్ పెట్టారు.జస్టిస్ హేమ కమిటీని నియమించిన ప్రభుత్వాన్ని ఆయన ప్రశంసిస్తూ కమిటీ చేసిన సిఫార్సులు, చూపిన పరిష్కారాలకు తాను మనస్ఫూర్తిగా మద్దతు తెలియజేస్తున్నానని తెలిపారు. హేమ కమిటీ గురించితెలియదు: రజనీకాంత్ కేరళ ఏర్పాటు చేసిన జస్టిస్ హేమ కమిటీ గురించి, అలాంటి కమిటీ యే తమిళనాడులో ఏర్పాటు చే యాలన్న డిమాండ్ గురించి తనకు తెలియదని సూపర్‌స్టార్ రజనీకాంత్ తెలిపారు.

## వరద సహాయక చర్యల్లో పోలీస్ శాఖ

## ఎక్స్ వేదికగా పలువురికి డీజీపీ అభినందన

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు రాష్ట్ర పోలీసుశాఖ అప్రమత్తమైంది. ప్రభుత్వ ఆదేశాలతో ఎక్కడికక్కడే సహాయక చర్యల్లో నిమగ్నమైంది. పోలీసు స్టేషన్ల పరిధిలో హోంగార్డుల నుంచి సీఐల వరకూ వరద ప్రభావిత జలాశయాల వద్ద పహారా కాస్తున్నారు.జిల్లాల ఎస్పీలు, కమిషనర్లు భద్రతా పరిస్థితిని సమీక్షించి, వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో చొరవ తీసుకుంటున్నారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు స్థానికుల సహకారంతో పోలీసులు ఆహారం, మంచినీటి వసతి ఏర్పాటు చూశారు.సూర్యాపేట జిల్లా కోదాడలోని శ్రీరంగాపురం వద్ద అర్ధరాత్రి 3 బస్సుల్లో చిక్కుకున్న ప్రయాణికులను పోలీసులు రక్షించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ వ్యక్తి వాగులో కొట్టుకుపోతుండగా హెడ్ కానిస్టేబుల్ రాములు, కానిస్టేబుల్ రాములు ధైర్యంగా వెళ్లి అతన్ని రక్షించారు. జిగిత్యాల జిల్లాలోని మల్యాలపెగ్గపల్లి రోడ్డుకు అక్కడి పోలీసులు మరమ్మతులు చేశారు.వరంగల్ జిల్లాలో సీపీ అంబర్ కిశోర్‌ఝా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ఐపీఎస్ రోహిత్ రాజు, నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఖమ్మం జిల్లాలో సీపీ సునీల్ దత్, సిద్దిపేట పోలీస్ కమిషనర్ బీ అనురాధ ఆయా జిల్లాల పరిధిలో వరద సహాయక చర్యలను పర్యవేక్షించారు. మహబూబ్‌బాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో పోలీసుల కృషిని ఎక్స్ వేదికగా డీజీపీ జితేందర్ కొనియాడారు.

# శ్రీవారిని దర్శించుకున్న ప్రతీ భక్తుడికి

# తగినన్ని లడ్డూలు ఇస్తాం

**విశ్వంభర, తిరుమల**: తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రతి భక్తుడికి తగినన్ని లడ్డూలు అందిస్తామని టీటీడీ ఈవో జే శ్యామల రావు తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో ఆదివారం ఈవో, అదనపు సీహెచ్ వెంకయ్య చౌదరి, సీవీఎస్ఓ శ్రీధర్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఉచిత లడ్డూతో పాటు తగ్గిన రూ.50 లడ్డూలు అందించడమే లక్ష్యమన్నారు. స్వామివారిని దర్శించుకోకుండా లడ్డూల కోసం నేరుగా లడ్డూ కౌంటర్లకు వెళ్లే భక్తులకు ఆధార్‌కార్డు ద్వారా రోజువారి రెండు లడ్డూలు ఇవ్వనున్నట్లు తెలిపారు. టీటీడీ ప్రతిరోజు 3.5 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయిస్తున్నదని, ఇందులో 2.5 లక్షల లడ్డూలు మాత్రమే భక్తులకు చేరుతున్నాయని, మిగిలిన లక్ష లడ్డూలు దర్శనం టోకెన్లు లేనివారు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు.

# మార్కెట్‌లోకి బజాజ్ కొత్త బైక్..

# పెట్రోల్ అక్కర్లేదు..!

**విశ్వంభర (బిజినెస్):** బజాజ్ కంపెనీ ఇటీవలే ప్రపంచంలోనే మొట్టమొదటిసారి సీఎన్జీతో నడిచే బైక్‌ను విడుదల చేయడం ద్వారా ప్రపంచాన్ని ఆశ్చర్యపర్చింది. అయితే ఇప్పుడు బజాజ్ మరో అడుగు ముందుకేసి ఇథనాల్‌తో నడిచే ఈ ద్విచక్ర వాహనాన్ని అతి త్వరలో విడుదల చేయబోతోంది. బైక్‌లో 100 సీసీ ఇంజన్ ఉంటుంది. ఫ్రీడమ్ 125 తర్వాత మరింత సరసమైన CNG మోటార్‌సైకిల్‌ను బజాజ్ అభివృద్ధి చేసింది.

ఈ ఇథనాల్ బైక్ వచ్చే ఏడాది మార్కెట్‌లోకి వచ్చే అవకాశం ఉంది. దీని గురించి పూర్తి వివరాలు తెలుసుకుందాం. బజాజ్ ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఇథనాల్‌తో నడిచే ద్విచక్ర వాహనాలు, మూడు చక్రాల వాహనాలను విడుదల చేయడానికి కంపెనీ సిద్ధంగా ఉన్నామని తెలిపింది. రాబోయే ఇథనాల్ బైక్ 100 సీసీ సెగ్మెంట్‌లో వస్తుంది. ఎఫ్ వై 2025 చివరి త్రైమాసికంలో (జనవరిమార్చి)లో విడుదలయ్యే అవకాశం ఉంది.

బజాజ్ ఫ్రీడమ్ సీఎన్జీ, చేతక్ బ్రాండ్ నుంచి క్లీన్‌ఎనర్జీ కేటగిరీలోని ఇతర ఆఫర్‌లు, ఈ పండుగ సీజన్‌లో కంపెనీ దాదాపు 100,000 యూనిట్లను డెలివరీ చేసే అవకాశం ఉంది. ఇది బజాజ్ ఆటో మొదటి ఇథనాల్ టూవీలర్ అయినప్పటికీ, ఇతర ద్విచక్ర వాహనాల కంపెనీలు ఇప్పటికే కాన్సెప్ట్‌లు లేదా ప్రోటోటైప్‌లను ప్రదర్శించాయి. టీవీఎస్ మోటార్ కంపెనీ కొన్ని సంవత్సరాల క్రితం ఈ100 లేదా 100 శాతం ఇథనాల్‌తో పనిచేసే అపాచీ ఆర్టీఆర్ 200ని వెల్లడించింది.

ఫ్లెక్స్ టెక్‌తో ఈ20ఈ85 ఇంధనంతో నడుస్తున్న హోండా సీబీ300ఎఫ్ జనవరిలో జరిగిన ఇండియా మొబిలిటీ ఎక్స్‌పో 2024లో ప్రదర్శించింది. ప్రయోగ ప్రణాళికలు, ఇంధన లభ్యత గురించి మరిన్ని వివరాలు వచ్చే నెలలో వెల్లడి కానున్నాయి.



అయితే బజాజ్ దాని ప్రస్తుత ఉత్పత్తులలో ఒకదానిని అప్‌డేట్ చేస్తుందా లేదా ఇథనాల్ ద్విచక్ర వాహనం కోసం సరికొత్త ఆఫర్‌ను ప్రవేశపెడుతుందా అనేది చూడాలి. ఈ20 అవసరాలకు అనుగుణంగా ఆయిల్ పంపులు అప్‌గ్రేడ్ అవుతున్నప్పటికీ ఇథనాల్ లభ్యత ఆందోళనకరంగానే ఉంది.

2023లో ప్రవేశపెట్టిన బీఎస్6 2.0 అప్‌డేట్, 20 శాతం ఇథనాల్ బ్లెండింగ్‌తో సహా ఇంధన ఉద్గార ప్రమాణాలకు అనుగుణంగా ప్రస్తుత ఉత్పత్తి శ్రేణిని అప్‌డేట్ చేస్తుంది. బజాజ్ తన క్లీన్‌ఎనర్జీ వాహనాలతో ఈ పండుగ సీజన్‌లో నెలవారీ విక్రయాలలో దాదాపు 100,000 యూనిట్లను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్, కొత్త ఫ్రీడమ్ 125 సీఎన్జీ ఉన్నాయి. కంపెనీ చేతక్ శ్రేణిని విస్తరించేందుకు కూడా కృషి చేస్తోంది. మరిన్ని వేరియంట్‌లను వరుసగా తక్కువ, అధిక ధరలకు బజాజ్ ఆటో ప్లాన్ చేసింది.

# జన అభిమాన పవనం



**జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను అభిమానులు ఎంతలా అభిమానిస్తారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు..మెగాస్టార్ చిరంజీవి తమ్ముడిగా పరిశ్రమలో అడుగు పెట్టి ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్నాడు పవన్ కళ్యాణ్. వరుసగా సినిమాలు ఫెయిల్ అయినా అభిమానులు మాత్రం ఆయనను వదిలి వెళ్ళలేదు.**

సినిమాల్లోనే కాదు.. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనూ పవన్ కళ్యాణ్ అంటే ఓ బ్రాండ్.. ప్రజల నుంచి పైసా ఆశించని నాయకుడు. తన సంపాదనను ప్రజల కోసం పెట్టే ప్రజా నాయకుడు పవన్ కళ్యాణ్. ఐదేళ్ల క్రితం పోటీచేసిన రెండు స్థానాల్లో ఓడిపోయినా నిరాశపడలేదు. రాజకీయాలకు పనికిరావంటే వెనకడుగు వేయలేదు. ప్రజల కోసం ప్రశ్నించే గొంతుకనంటూ ముందడుగు వేశారు. ఐదేళ్లు తిరిగేసరికి.. తాను నమ్మిన ప్రజలే ఘన విజయాన్ని అందించారు. దేశ రాజకీయాల్లో తనకంటూ ఓ స్థానాన్ని సంపాదించుకున్నారు పవన్ కళ్యాణ్. దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేకంగా అభిమానించే వ్యక్తుల్లో పవన్ ఒకరు. ఆయన నీతి, నిజాయితీ, పట్టుదల, సంకల్ప బలం.. ఇవ్వన్నీ కలగలిపి పవన్ కళ్యాణ్‌ను సినిమాల్లోనే కాదు.. రాజకీయాల్లోనూ రియల్ హీరోను చేశాయి.తన సక్సెస్ స్టోరీతో పవన్ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు. సెప్టెంబర్ 2 అంటే వెంటనే గుర్తొచ్చేది పవన్ కళ్యాణ్ పుట్టినరోజు.సోమవారం పవన్ కళ్యాణ్ 55 సంవత్సరాలు పూర్తిచేసుకుని 56వ పడిలోకి అడుగుపెట్టబోతున్నారు. ఇప్పటివరకు ఓ సినీస్టార్‌గా పవన్ జరుపుకున్న పుట్టినరోజులు ఒక ఎత్తైతే.. ఈ పుట్టినరోజు ఆయనకే కాదు.. పవన్ అభిమానులకు ఎంతో ప్రత్యేకం. ఓ సక్సెస్‌ఫుల్ రాజకీయనాయకుడిగా, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్ 56వ పుట్టినరోజును గ్రాండ్‌గా జరుపుకునేందుకు ఆయన అభిమానులు రెడీ అయ్యారు. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో పండగ వాతావరణం నెలకొంది. పవన్ అభిమానులు అన్నదాన కార్యక్రమాలు, రక్తదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే డిప్యూటీ సీఎం హోదాలో పవన్ ఇచ్చిన పిలుపు మేరకు మొక్కలు నాటే కార్యక్రమాలు కూడా చేపట్టబోతున్నారు. ఇక సినిమాల పరంగా వస్తే. పవన్ బ్లాక్ బస్టర్ మూవీ గబ్బర్ సింగ్ సోమవారం థియేటర్లలో రీ రిలీజ్ కానుంది. ఇప్పటికే రికార్డు స్థాయిలో అడ్వాన్స్ బుకింగ్ జరిగాయి. ఇలా ఎవరికి తోచిన విధంగా వారు పవన్ కళ్యాణ్ పై తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. ఈనేపథ్యంలో చిత్తూరు జిల్లా కుప్పం ప్రాంతానికి చెందిన పురుషోత్తమ్ అనే కళాకారుడు పవన్ కళ్యాణ్ పై వినూత్నంగా తన అభిమానాన్ని చాటుకున్నాడు. స్థానికంగా ఉండే నోబెల్ స్కూల్ ఆధ్వర్యంలో దాదాపు 800 విద్యార్థులు పవన్ కళ్యాణ్ ఫొటో ప్రతిబింబించేలా సమహారంగా ఏర్పడి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో బాగా వైరలవుతోంది. దీనిని చూసిన అభిమానులు, జనసైనికుల, కార్యకర్తలు అద్భుతంగా ఉందని కళా కారుడు పురుషోత్తంని అభినందిస్తున్నారు. ఒక స్టార్ హీరో విషయంలో ఇంతలా అభిమానాన్ని చాటుకోవడం కేవలం పవన్ కళ్యాణ్ విషయంలో మాత్రమే జరిగిందని సోషల్ మీడియా వేదికగా కామెంట్లు వ్యక్తమవుతూ ఉండటం గమనార్హం.చిన్నపిల్లల్లో సైతం పవన్ కళ్యాణ్ కు ఊహించని స్థాయిలో ఫ్యాన్ ఫాలోయింగ్ పెరుగుతోంది. ఈనేపథ్యంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా తన సినీ, రాజకీయ జీవితంపై విశ్వంభర ప్రత్యేక కథనం..

బాల్యం, విద్యాభ్యాసం..

ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్లలో సెప్టెంబర్ 2, 1971న వెంకటరావుఅంజనాదేవి దంపతులకు జన్మించాడు పవన్ కళ్యాణ్ . మెగాస్టార్ చిరంజీవి పవన్‌కు పెద్దన్నయ్య. నటుడు, నిర్మాత నాగేంద్ర బాబు పవన్‌కు రెండవ అన్నయ్య. పవన్ ప్రాథమిక విద్యభ్యాసం బాపట్లనే సాగింది . తర్వాత నెల్లూరులో ఉన్నత పాఠశాల విద్యను అభ్యసించారు. ఆ తర్వాత ఇంటర్ నెల్లూరులోని విఆర్ కాలేజీలో చదువుకున్నాడు. ఆ తర్వాత కంప్యూటర్ డిప్లొమా పూర్తి చేశాడు. కంప్యూటర్ డిప్లొమా పూర్తి చేసిన ఉద్యోగం చేయాలని ఉద్దేశం మాత్రం ఆయన ఏ మాత్రం లేదు. ఆయనకు పుస్తకాలు చదువడమంటే చాలా ఇష్టం.

సినీ జీవితం...

చిరంజీవి స్టార్ హీరోగా ఎదగడంతో సినిమాల్లోకి వెళ్లాలని ఆలోచన వచ్చింది పవన్ కళ్యాణ్. ఆ విషయాన్నే తన అన్నయ్య చిరంజీవికి చెప్పారు. సరే నువ్వు నటించు కానీ ముందు యాక్టింగ్ అని.. సత్యం మాస్టార్ దగ్గరికి పవన్ కళ్యాణ్ ని పంపించాడు. ఆయన దగ్గర ఆరు నెలలు నటన నేర్చుకున్నాడు పవన్ కళ్యాణ్. ఈలోగా చిరంజీవి .. తమ్ముడు పవన్ కళ్యాణ్ కోసం ఒక మంచి కథని డైరెక్టర్స్ ని వెతకడం ప్రారంభించారు. ఆ సమయంలో వీవీ సత్యనారాయణ దర్శకత్వంలో అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి కథను ఒకే చేసి.. 1996 జనవరిలో షూటింగ్ మొదలు పెట్టారు .ఈ సినిమా 1996 అక్టోబర్ నెలలో విడుదల చేశారు. ఈ సినిమా యావరేజ్ గా ఆడింది. అయితే.. ప్రేక్షకులు మాత్రం కేవలం చిరంజీవి తమ్ముడైన మాత్రమే సినిమా థియేటర్ కి వచ్చారు.ఆ తరువాత పవన్ కళ్యాణ్ కోసం గోకులంలో సీత అనే కథను సిద్ధం చేశారు. వెంటనే షూటింగ్ కూడా స్టార్ట్ చేశారు. ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నప్పుడే అంటే 1997 మే నెలలో వైజాగ్ కి చెందిన నందిని అనే అమ్మాయితో పవన్ కళ్యాణ్ కి వివాహం జరిపించారు. వీరిద్దరి వివాహం అయ్యాక గోకులంలో సీత 1997 ఆగస్టులో విడుదల చేశారు. ఈ సినిమా సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. తర్వాత భీమినేని శ్రీనివాసరావు దర్శకత్వంలో సుస్వాగతం మొదలైంది. ఈ సినిమా మొదలయ్యే నాటికి పవన్ నందిని లిద్దరు వేరువేరు అయిపోయారు. సుస్వాగతం ,ఆ తరువాత వచ్చిన తొలిప్రేమ సినిమాలు బస్టర్ హిట్ అయింది. సుస్వాగతంతో పవన్ కళ్యాణ్ కి ఒక గుర్తింపు వస్తే .. తొలిప్రేమతో స్టార్ హోదా తెచ్చింది. నిజంగా తొలిప్రేమ పవన్ సినీ జీవితంలో మైల్ స్టోన్. ఈ సినిమా ఉత్తమ సినిమాగా జాతీయ అవార్డు, అలాగే.. మరో నాలుగు నంది అవార్డ్స్ కూడా ఈ సినిమా గెలుచుకుంది.

1999లో అరుణ్ ప్రసాద్ దర్శకత్వంలో వచ్చిన తమ్ముడు మరో సూపర్ డూపర్ హిట్ అయింది. ఈ సినిమాతో పవన్ క్రేజ్ మరికొంత పెరిగింది. ఆ తరువాత పూరి జగన్నాథ్ దర్శకత్వంలో బద్రి వచ్చింది. ఇలా తనదైన నటనతో అభిమానులలో 'పవర్ స్టార్' గా ప్రసిద్ధి చెందాడు. ఈ సినిమా సమయంలోనే రేణు దేశాయ్ తో పరిచయం ఏర్పడింది. అప్పటినుంచి ఇద్దరు ప్రేమలో ఉంటూనే సహజీవనం చేయడం ప్రారంభించారు. అప్పట్లో ఈ విషయం గురించి ఇండస్ట్రీలో పెద్ద చర్చ జరిగింది.

ఇదిలా ఉంటే.. ఎస్ జె సూర్య దర్శకత్వంలో 2001 ఏప్రిల్ లో ఖుషి వచ్చింది. ఆ సినిమా పవన్ కళ్యాణ్ కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్టవడమే కాదు ఆ సంవత్సరం ఇండస్ట్రీకి కూడా ఆ సినిమానే అయింది. ఈ సినిమాతో పవన్ కళ్యాణ్ క్రేజ్ అమాంతం పెరిగింది.ఈ సినిమా 101 కేంద్రాల్లో 50 రోజులు.. 79 కేంద్రాల్లో వంద రోజులు.. ఎనిమిది కేంద్రాల్లో 175 రోజులు ఆడింది. ఈ సినిమా తరువాత పవన్ ఓ ప్రయోగానికి తెర తీశాడు. తనే తనకోసం ఒక కథని సిద్ధం చేసుకుని రేణుదేశాన్ని హీరోయిన్ గా పెట్టి జానీ అనే సినిమాని మొదలు పెట్టాడు. ఈ సినిమాకి పవన్ కళ్యాణ్ దర్శకత్వం వహించగా.. అల్లు అరవింద్ నిర్మాతగా వ్యవహరించాడు. కానీ, జానీ అభిమానుల్ని భారీగానే నిరాశపరిచింది.

2004లో వీరశంకర్ బైరిశెట్టి దర్శకత్వంలో గుడుంబా శంకర్ మొదలైంది ఈ సినిమా షూటింగ్ సమయంలోనే పవన్ కి రేణు దేశాయ్ లకు కొడుకు అకీరానందన్ జన్మించాడు. 2004 సెప్టెంబర్ నెలలో విడుదలైన ఈ సినిమా కూడా అభిమానుల్ని భారీగానే నిరాశపరిచింది. ఇక 2005లో వచ్చిన బాలు 2006 లో వచ్చిన బంగారం , అన్నవరం కూడా అభిమానులు పెద్దగా తృప్తి పరచలేదు. అదే సమయంలో శంకర దాదా ఎంబిబిఎస్ లో ఒక అతిథి పాత్రలో నటించి మెగా అభిమానుల్ని అలరించాడు.

2010లో వచ్చిన పులి, 2011లో వచ్చిన తీన్మార్ కూడా తీవ్ర నిరాశనే మిగిలించాయి. వరుసగా సినిమాల పోయిన పవన్ కళ్యాణ్ క్రేజ్ మాత్రం తగ్గలేదు. పవన్ కళ్యాణ్ కి అంత క్రేజీ ఇలాంటి క్రేజీ సినిమాలు హిట్స్ వాళ్ళ మాత్రమే కాదు వ్యక్తిత్వం వలన మాత్రమే వస్తుంది.

సినిమాల పరంగా పవన్ అభిమానులకి ఎలాగైనా ఒక మంచి హిట్ అవ్వాలని హరీష్ శంకర్ దర్శకత్వంలో తెలుగు నెటివిటికి దగ్గరగా దబంగ్ సినిమాకు రిమేక్ గా 2012లో వచ్చిన గబ్బర్ సింగ్ వచ్చింది. ఈ సినిమా ఒక ప్రభంజనం సృష్టించింది . పవన్ కళ్యాణ్ అభిమానులకి గబ్బర్ సింగ్ ఒక విందు భోజనం అనే చెప్పాలి 35 కోట్లకు బిజినెస్ జరిగిన గబ్బర్ సింగ్ 60 కోట్ల 16 లక్షల షేర్ వసూలు చేసింది 250 కేంద్రాలలో డైరెక్ట్ గా 50 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సినిమాకి అవార్డ్స్ కంటే అభిమానుల రివార్డ్స్ ఎక్కువ. దీని తర్వాత పూరీ దర్శకత్వంలో వచ్చిన కెమెరామెన్ గంగతో రాంబాబు యావరేజ్ స్టాప్ తెచ్చుకున్న ఆ తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన అత్తారింటికి దారేది మరో బ్లాక్ బస్టర్ హిట్. మళ్లీ వెంటనే పవర్ స్టార్ అభిమానులకి మరో విందు భోజనం అందించాడు. మొదటి సారి 100 కోట్లు సాధించిన తెలుగు సినిమాగా అత్తారింటికి దారేది రికార్డులు క్రియేట్ చేసింది.

2016లో సర్దార్ గబ్బర్ సింగ్, 2017 లో కాటమరాయుడు, 2018లో అజ్ఞాతవాసి అంతగా ఆటలేవు. పార్టీ ఆర్థికంగా కష్ట సమయంలో పవన్.. 2016లో హిందీలో వచ్చిన పింక్ సినిమా ని రీమేక్ చేశారు. ఈ సినిమాకు వేణు శ్రీరామ్ దర్శకత్వంలో దిల్ రాజు నిర్మాతగా వకీల్ సాబ్ మొదలుపెట్టారు. ఈ సినిమా పవన్ డబ్బు కోసమే చేశాడు. దిల్ రాజు ఈ సినిమా కోసం పవన్ కళ్యాణ్ కు అప్పటివరకు ఏ టాలీవుడ్ హీరోకు ఇవ్వలేనంత రెమ్యూరేషన్ ఇచ్చారు.దాదాపు 50 కోట్ల వరకు ఈ సినిమాకి పవన్ కళ్యాణ్ రెమినేషన్ తీసుకున్నాడని టాక్. 2021 ఏప్రిల్ 9న విడుదలైన వకీల్ సాబ్ బ్లాక్ బస్టర్ హిట్టుగా నిలిచింది. ఈ సినిమా మొదటి మూడు రోజుల్లోనే 100 కోట్ల వరకు వసూలు చేసింది

రాజకీయ జీవితం

జీవితంలో ఎన్నో కష్ట, నష్టాలను ఎదురొడ్డి.. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న వ్యక్తి జనసేనాని. ఎన్నో ఓటములు ఎదురైనా.. విజయం కోసం ముందుకు సాగి.. ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న నాయకుల్లో పవన్ కళ్యాణ్ ఒకరు.2009లో ప్రజారాజ్యం పార్టీ తరపున పవన్ కళ్యాణ్ అహర్నిశలు ప్రచారం చేశాడు ఆ పార్టీ యువజన నాయకుడుగా ఎటువంటి పదవులు ఆశించకుండా ఆ ఎన్నికల్లో ప్రచారం చేశాడు. అయితే ఆ ప్రచారంలో ఆవేశంగా మాట్లాడేవారు. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ అనుకున్న స్థాయిలో విజయం సాధించలేదు. దీంతో 2011లో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్లో విలీనం చేశాడు. దీంతో పవన్ కళ్యాణ్ కొంత నిరాశకు గురయ్యాడు. కానీ, ప్రజాసేవ చేయాలనే తన సంకల్పాన్ని మాత్రం వదులుకోలేదు. ప్రజాసేవకు అంకితమవ్వాలనే లక్ష్యంతో పవన్ కళ్యాణ్ 2014 మార్చి 14న ఒక్కడే అభిమానులు సమక్షంలో జనసేన పార్టీని స్థాపించాడు. జనసేన పార్టీ భావజాలంతో కూడిన ఒక పుస్తకం కూడా రాశాడు. నరేంద్ర మోడీని కలిసి రెండు తెలుగు రాష్ట్రాల సమస్యల వివరించాడు. ఆ తర్వాత 2014 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి బిజెపికి సపోర్ట్ చేసి టీడీపీ విజయంలో కీలక పాత్ర పోషించాడు. కానీ జనసేన ఒక్క స్థానంలో కూడా పోటీ చేయలేదు. ఇలా పూర్తి స్థాయిలో రాజకీయాల్లోకి వచ్చిన పవన్ నిత్యం ప్రజల మధ్యనే ఉన్నాడు.2019 ఎన్నికల్లో జనసేన 175 స్థానాలు గాను 140 స్థానాల్లో పోటీ చేసింది .ఈ ఎన్నికల్లో.. పవన్.. భీమవరం, గాజువాక రెండు స్థానాల్లోనూ పోటీ చేశాడు. కానీ ఆ రెండు చోట్ల ఓడిపోయాడు మిగతా 138 స్థానాల్లో ఒక తూర్పుగోదావరి జిల్లా రాజోలులో రాపాక వరప్రసాద రావు గారు తప్ప ఇంకెవరూ గెలవలేదు. అయినా కూడా పవన్ కళ్యాణ్ నిరాశ చెందలేదు. ప్రజల సమస్యల పై తన గళాన్ని వినిపిస్తునే ఉన్నారు. ప్రజల కోసమే తాను పార్టీని స్థాపించాను. కానీ పదవుల కోసం కాదు అని ప్రజల సమస్యల గురించి పట్టించుకున్నాడు.2020 జనవరి నుంచి బిజెపితో పొత్తు పెట్టుకున్నాడు.2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీతో కలిసి పోటీచేసిన జనసేన వంద శాతం స్ట్రైక్ రేట్ తో విజయం సాధించింది. ఈ విజయం వెనుక పవన్ కళ్యాణ్ కఠోర శ్రమ దాగి ఉంది.

గుండె ధైర్యం.. ప్రశ్నించే గొంతుక..

పవన్ కళ్యాణ్ అంటే ఆయనను నమ్ముకున్న అభిమానులకు గుండె ధైర్యం.. ప్రశ్నించే గొంతుక.. అక్రమార్కుల గుండెల్లో దడ.. సామాన్యుడి కోసం ఎంతవరకైనా తెగించే తత్వం. ఓటములకు కుంగిపోయి.. విజయాలకు పొంగిపోయే వ్యక్తిత్వం కాదు. సమాజం కోసం నిరంతర ఆలోచన.. తన ప్రజల కోసం ఏదైనా చేయాలనే తపన.. అధికారం ఉన్నా.. లేకపోయినా ఒకటే మనస్థత్వం. పేదవాడి బతుకు బాగుండాలనే ఆలోచన ఒక్కటే పవన్ మదిలో మెదులుతూ ఉంటుంది. సినిమాల్లో అయినా.. రాజకీయాల్లో అయినా పవన్ కళ్యాణ్‌ది ప్రత్యేక స్థానం. చిన్నతనం నుంచి ఎన్నో కష్ట, నష్టాలను చూశారు. తన ఎదుగుదలలో ఎన్నో అపజయాలు పలకరించాయి.. అయినా సరే నిరుత్సాహపడలేదు. పరాజయాలను అనుభవ పాఠాలుగా మల్చుకుని ముందుకు సాగారు.. ఈ ప్రయాణంలో ఎన్నో వెక్కిరింతలు.. మరెన్నో అవమానాలు.. వాటన్నింటిని ఎంతో సహనంగా భరించారు.. ప్రజల కోసం ఒకరోజు వస్తుందనే ఆశాభావంతో ముందుకు కదిలారు. 2024 సార్వత్రిక ఎన్నికల రూపంలో ఆ సమయం వచ్చింది. ఎవరూ ఊహించని విధంగా పవన్ కళ్యాణ్ పార్టీ జనసేన వంద శాతం స్ట్రైక్ రేటు సాధించింది. కొన్ని దశాబ్ధాలుగా పవన్ కళ్యాణ్‌ను హేళన చేసిన వ్యక్తులే శభాష్ అంటూ పొగడ్తలతో ముంచెత్తారు.

అధికారంలో ఉన్నామని అహంకారం లేదు...

అధికారంలో ఉన్నామని అహంకారం లేదు. పదవి ఉందని పొగరు లేదు. ప్రజలు ఇచ్చిన అధికారంతో సామాన్యుడి జీవితాల్లో వెలుగులు నింపాలనే సంకల్పమే పవన్ ముందు కనిపిస్తోంది. రెండు నెలల కాలంలోనే గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖలో సంస్కరణలకు శ్రీకారం చుట్టి.. ప్రజల మన్ననలు పొందుతున్న నిజమైన ప్రజా నాయకుడు పవన్ కళ్యాణ్.. ప్రజలే అతడి సైన్యం. ప్రజలకు ఇచ్చిన మాట కోసం నిలబడే వ్యక్తిత్వం. సమస్య ఉందన్న అంటే నీకు నేను తోడుగా ఉంటానంటూ.. సమస్య నుంచి విముక్తిడిని చేసే వరకు విశ్రమించని నాయకుడు పవన్ కళ్యాణ్.

అభివృద్ధి కోసం ఏం చేయాలో నిరంతరం ఆలోచించే ఆధునిక రాజకీయ నాయకుడు...

పవన్ కళ్యాణ్ ఏ పని చేసినా ప్రజాకోణం ప్రతిబింబిస్తుంది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం ఏం చేయాలో నిరంతరం ఆలోచించే ఆధునిక రాజకీయ నాయకుడు జనసేనాని. ప్రజల సమస్యలను పార్టీ అజెండాగా మార్చుకున్న నాయకుడు. ప్రభుత్వం అంటే అధికారాన్ని చలాయించడం కాదు.. ప్రజలకు జవాబుదారీలా ఉండే వ్యవస్థ అని చెప్పడంతో పాటు.. చేతల్లో చూపించిన వ్యక్తి పవన్ కళ్యాణ్. సమస్యలను ప్రస్తావించడం కాదు.. సమస్యకు పరిష్కారం చూపించేవరకు నిద్రపోని వ్యక్తి పవన్. ఉద్దానం సమస్య ఉందని చెప్పి ఊరుకోలేదు. ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేసిన నిజమైన నాయకుడు పవన్. అంతర్జాతీయ స్థాయి వైద్యబృందాన్ని ఈ ప్రాంతానికి తీసుకొచ్చి, ఇక్కడి సమస్యలపై అధ్యయనం చేయించి.. ప్రభుత్వాన్ని కదిలించిన నాయకుడు పవన్ కళ్యాణ్. రాజకీయ కక్షతో ఇప్పటం ప్రజల ఇళ్లను జగన్ ప్రభుత్వం కూలిస్తే వారికి అండగా ఉంటానంటూ.. కుటుంబానికి లక్ష రూపాయిల ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్న పొలిటీషియన్ పవన్ కళ్యాణ్. ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుల కుటుంబాలకు తన సొంత డబ్బులతో ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయిల ఆర్థిక సాయం అందించిన నేత జనసేనాని. అందుకే పవన్ ఏమి చేసినా వెరీ స్పెషల్. నేటి రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయుడు జనసేనాని.

## పవన్ కళ్యాణ్ సినీ జీవితాన్నే మార్చిన సినిమాలు.!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అంటే ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఎంతటి హోదా ఉందో మనందరికీ తెలుసు. కేవలం సినిమాల ద్వారానే కాకుండా రాజకీయాల్లో కూడా రాటుదేలారు. దేశ రాజకీయాల్లో కూడా కీలకంగా మారారు. మరి ఆయనకింతటి గౌరవం రావడానికి ప్రధాన కారణం సినిమాలే అని చెప్పవచ్చు. అలాంటి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినీ కెరియర్ ను మార్చినటువంటి కొన్ని చిత్రాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**1. సుస్వాగతం:**

భీనవేని శ్రీనివాసరావు డైరెక్షన్ లో పవన్ కళ్యాణ్ హీరోగా సూపర్ గుడ్ ఫిలిమ్స్ బ్యానర్ పై వచ్చిన సినిమా సుస్వాగతం. చిత్రం అద్భుతమైన హిట్స్ సాధించి పవన్ కళ్యాణ్ కెరియర్ లో దూసుకుపోయేలా చేసింది.

**2. తొలిప్రేమ:**

ఏ కరుణాకరన్ డైరెక్షన్ లో పవన్ కళ్యాణ్ కీర్తిరెడ్డి హీరో హీరోయిన్లుగా వచ్చిన మూవీ తొలిప్రేమ. ఈ చిత్రం అద్భుతమైన ప్రేమ కథతో వచ్చి అద్భుతమైన హిట్ సాధించింది.

**3. తమ్ముడు:** పిఏ అరుణ్ ప్రసాద్ డైరెక్షన్ లో పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన మూవీ తమ్ముడు. బాలీవుడ్ లో జోజిత వహి సికిందర్ అనే చిత్రానికి రీమేక్ గా వచ్చి అద్భుతమైన హిట్ సాధించింది. ఇది పవన్ కెరియర్ ను మరోసారి గాడిలో పడేలా చేసింది అని చెప్పవచ్చు.

**4. బద్రి:**

గ్రేట్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ డైరెక్షన్ లో అద్భుతమైన కథాంశంతో వచ్చిన మూవీ బద్రి. ఇది పవన్ కళ్యాణ్ కెరియర్ లో ఒక డిఫరెంట్ మూవీగా తెరకెక్కి అద్భుతమైన పేరు తీసుకొచ్చింది.

**5. ఖుషి:**

ఎస్ జె సూర్య దర్శకత్వంలో పవన్ కళ్యాణ్ భూమిక హీరో హీరోయిన్ గా వచ్చిన మూవీ ఖుషి. ఎంతో ఆకట్టుకునే ప్రేమ కథ చిత్రంతో వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని అందుకు.

**6. గబ్బర్ సింగ్ :**

గ్రేట్ డైరెక్టర్ హరీష్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన మూవీ గబ్బర్ సింగ్. హిందీ చిత్రం దబాంగ్ మూవీకి రీమేక్ గా వచ్చిన ఈ మూవీ సంచలన విజయాన్ని అందుకుంది.

**7. వకీల్ సాబ్:**

సినిమా ఇండస్ట్రీకి కొంతకాలం గ్యాప్ ఇచ్చిన తర్వాత వచ్చిన మూవీ వకీల్ సాబ్. కరోనా సెకండ్ వేవ్ లో రిలీజ్ అయి అద్భుతమైన విజయాన్ని సాధించింది.


# తెలుగు సినిమా రొమాంటిక్ ఐకాన్ హరనాథ్

### నేడు ఆయన హరనాథ్ జయంతి

బుద్ధరాజు వెంకట అప్పల హరినాథ రాజు అలియాస్ హరనాథ్ తెలుగు సినిమా కథానాయకుడు.ఆయన 1936లో సెప్టెంబర్ 2 న తూర్పుగోదావరి గొల్లప్రోలు మండలం రాపర్తి గ్రామంలో బుద్దరాజు వరహాలరాజు దంపతులకు జన్మించాడు. ఆయనకు కుమారుడు శ్రీనివాస రాజు, కుమార్తె పద్మజ ఉన్నారు. తండ్రి బుద్ధరాజు వరహాలరాజు శ్రీ ఆంధ్ర క్షత్రియ వంశ రత్నాకరము అనే గ్రంథ రచయిత. మద్రాసులో పాఠశాల విద్యను పూర్తి చేసి, కాకినాడలో ఆర్ట్స్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. తన కళాశాల రోజుల్లో, పాఠ్యేతర కార్యకలాపాల్లో పాల్గొనడానికి ఉత్సాహభరితమైన వ్యక్తి. ఆయన తన కళాశాలలో నాటకాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి నిలిపాడు. కళాశాలలో హరనాథ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ వంటి అనేక నాటకాల్లో నటించాడు. బహుమతులు కూడా గెలుచు కున్నాడు. ఆయన శిక్షణ పొందిన పైలట్. ఒక రోజు, ఆయన పైలట్ శిక్షణా తరగతికి హాజరై తిరిగి వచ్చినప్పుడు, దర్శకుడు గుత్తా రామినీడును చూశాడు. ఒకేసారి, దర్శకుడు అతనిని చూశాడు; వెంటనే రామినీడు, హరనాథ్ ను తన మనస్సులో ఒక హీరోగా ఊహించు కొన్నాడు. వెంటనే చిత్రంలో హీరోగా బుక్ చేసుకున్నాడు. ఆ చిత్రం ఋష్యశృంగ. 60 వ దశకంలో హరినాథ రాజు తెలుగు సినిమాల్లో రొమాంటిక్ ఐకాన్ గా పేరొందాడు.

ఆయన తొలి సినిమా మా ఇంటి మహాలక్ష్మి 1959 లో హైదరాబాద్ సారథీ స్టూడియోస్ లో చిత్రీకరించారు. మా ఇంటి మహాలక్ష్మి సినిమాతో ఎన్టీయార్, ఏఎన్నార్ తరువాత తెలుగులో హరనాద్ ప్రముఖ హీరో అని అనిపించు కున్నాడు. నందమూరి తారక రామారావు 1959 నిర్మించిన సీతారామ కళ్యాణం సినిమాలో శ్రీ రాముడుగా నటించాడు.

1967 లో నిర్మించిన భీష్మలో శ్రీకృష్ణుడుగా నటించాడు.1969 శ్రీ రామ కథ శ్రీ రామ పాత్రలో నటించాడు. సుమారు 117 తెలుగు సినిమాలు, 12 తమిళం, 1 హిందీ, 1 కన్నడం సినిమాల్లో నటించాడు. హరనాథ్, జమున తో కలిసి చాలా చిత్రాల్లో నటించాడు.లేత మనసులు' చిత్రంలో హరనాథ్ నటించిన 'అందాలా ఓ చిలకా, అందుకో నా లేఖా' పాట ఆ రోజుల్లో ఆంధ్రప్రదేశ్ మొత్తాన్ని మంత్ర ముగ్ధులను చేసింది. పాలమనసులు, పెళ్లి రోజు వంటి సినిమాలు, హరనాథ్, జమున ప్రధాన జంటగా అద్భుతమైన విజయాలు సాధించాయి. ఆయన చివరి చిత్రం 1989 లో తోడల్లుడు. ఆయన 1981 లో విడుదలైన మా ఇంటి దేవత అనే ఒక చిత్రాన్ని నిర్మించాడు. చివరి దశలో మద్యపానానికి అలవాటు పడడంతో కేవలం అతిథి పాత్రలలో నటించే అవకాశాలే వచ్చాయి. 1984లో హరనాథ్ చివరగా చిరంజీవి నటించిన, నాగు సినిమాలో తండ్రి పాత్ర పోషించాడు.ఆయన 1989, నవంబర్ 1 న మరణించాడు. హరనాథ్ కుమారుడు శ్రీనివాస్ బుద్ధరాజు చిత్ర నిర్మాత, కుమార్తె పద్మజా చిత్ర నిర్మాత జివిజి రాజు భార్య. హరనాథ్... కలవారి సంసారం (1982); గడసరి అత్త సొగసరి కోడలు (1981); బాల భారతం (1972); భలే పాప (1971); కథానాయిక మొల్ల (1970); శ్రీదేవి (1970); తల్లి తండ్రులు (1970); ప్రేమకానుక (1969); చల్లని నీడ (1968); నడమంత్రపు సిరి (1968); బంగారు సంకెళ్ళు (1968); పెళ్ళిరోజు (1968); భక్త ప్రహ్లాద (1967); చదరంగం (1967); శ్రీ శ్రీ శ్రీ మర్యాద రామన్న (1967); లేత మనసులు (1966); శ్రీకృష్ణ పాండవీయం (1966); చంద్రహాస (1965); సర్వర్ సుందరం (1964); అమరశిల్పి జక్కన్న (1964); మురళీకృష్ణ (1964); పెంపుడు కూతురు (1963); గుండమ్మ కథ (1962); భీష్మ (1962); కలసివుంటే కలదు సుఖం; ఋష్య శృంగ (1961); మా ఇంటి మహాలక్ష్మి (1959); తదితర చిత్రాలలో విభిన్న పాత్రలలో నటించారు. నవంబర్ 1, 1989న కన్నుమూశారు.



Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com